www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 01 No | విజయవాడ, మంగళవారం 01 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs

నిరుద్యోగులకు కొత్త సంవత్సర కానుక

- 1386 పోస్టులకు నోటిఫికేషన్
- గ్రూప్ 1, 2 పోస్టులు కూడా భర్తీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ శాఖల్లోని గ్రూప్-1, గ్రూప్-2తో పాటు డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ల భర్తీకి కలిపి 1386 పోస్టులకు ఏడు నోటిఫికేషన్లను సోమవారం ఎపిపిఎస్సీ జారీ చేసింది. టెక్నికల్ ఎడ్యుకేషన్ కింద (ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విభాగంలో) 405 పాలిటెక్నిక్ మిగతా 9లో



ప్రజాశక్తి పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు, 2019 సంవత్సరానికి స్వాగతం

\- ఎడిటర్

న్యాయమూర్తులొచ్చేశారు!

- నేడు సిజె ప్రమాణ స్వీకారం
- విజయవాడలో సందడి
- నవ్యాంధ్రలో మరో కీలక ఘట్టం
- 62 సంవత్సరాల హైదరాబాద్ 'న్యాయ' బంధానికి తెర
- బెంచ్ కోసం 'సీమ' లాయర్ల నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నవ్యాంధ్రలో మరో కీలకఘట్టానికి తెరలేచింది. ఉమ్మడి హైకోర్టు విభజన పూర్తి కావడం, మంగళవారం నుండి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విధులు ప్రారంభం కానుండటంతో న్యాయమూర్తులు, అధికారులతో పాటు సిబ్బంది హైదరాబాద్ నుండి సోమవారమే విజయవాడకు తరలివచ్చారు. రాష్ట్రానికి చెందిన పలువురు న్యాయవాదులు కూడా చేరుకున్నారు. దీంతో విజయవాడలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తిగా నియమతులైన జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్‌తో పాటు మరో 13 మంది న్యాయమూర్తులకు నోవాటెల్ హోటల్ వద్ద అధికారయంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ప్రధాన న్యాయమూర్తికి పోలీసులు గౌరవ వందనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా స్వాగతం పలికారు. ఆయనతోపాటు ప్రొటోకాల్ సెక్రటరీ నాగులాపల్లి శ్రీకాంత్, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్, సబ్ కలెక్టర్ మిషాసింగ్ ఆయనకు స్వాగతం పలికారు.



చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం పలికిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠ, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం తదితర అధికారులు

సిజెతో పాటు న్యాయమూర్తులు కె.ఉమా దేవి, టి.రజని, కె.విజయలక్ష్మి, ఎస్‌వి.భట్, ఎ.వి.శేషసాయి, ఎం.సీతారామమూర్తి, యు.దుర్గాప్రసాదు, టి.సునీల్‌చౌదరి, ఎం.సత్యనారాయణమూర్తి, జి.శ్యాంప్రసాదు, ఎన్.బాలయోగి, డి.వి.ఎస్.ఎస్.సోమ యాజులు, ఎం.గంగారావు విజయవాడకు చేరుకున్నారు. మరోవైపు తాత్కాలిక హైకోర్టుగా నిర్ణయించిన సిఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నుండి కోర్టు విధులు నిర్వహించడానికి అవసరమైన తుది సన్నాహాలు ముమ్మరంగా మిగతా 9లో

అత్యవసరం కాదు

బుధవారం విచారిస్తాం

హైకోర్టు తరలింపుపై సుప్రీం

9

రాజ్యసభలో 'తలాక్' ప్రకంపనలు

- సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందే
- తేల్చి చెప్పిన ప్రతిపక్షం
- తీర్మానంపై 11 పార్టీలు సంతకాలు
- ఓటింగ్‌కు డిమాండ్
- అంగీకరించని కేంద్రం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ట్రిపుల్ తలాక్ బిల్లుపై సోమవారం రాజ్యసభ దద్దరిల్లింది. ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదించేది లేదని ప్రతి పక్షాలు స్పష్టం చేశాయి. ఎగువసభలో బిజెపికి తగినంత మెజార్టీ లేనందున బిల్లు ఆమోదం పొందడం కష్టమని తెలిసి కూడా అధికార పార్టీ బిజెపి ప్రతిపక్షాల సూచనను పెడచెవిన పెట్టడంతో సభలో గందరగోళం చెలరేగింది. బిల్లుపై విస్తృత చర్చ జరగాలని, దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టుబట్టాయి. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో పాలక బిజెపి, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో బిల్లుపై చర్చ జరగకుండానే రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని దాదాపు 14 ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో స్పష్టం చేశాయి. న్యాయ శాఖ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ సోమవారం రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రస్తుత రూపంలో ఉన్న బిల్లును అనుమతించేందుకు కాంగ్రెస్, టిఎంసి, మిగతా 9లో

సేవా రంగంలో వెనుకబడ్డాం

శ్వేతపత్రం విడుదల సందర్భంగా సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సేవా రంగంలో మనం వెనుకబడి ఉన్నామని, మన తరువాతి స్థానంలో మధ్యప్రదేశ్ ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. పరిశ్రమల రంగంలో తెలంగాణ కంటే మనం కొంచెం ముందున్నామన్నారు. పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై సోమవారం ఉండవల్లి లోని గ్రీవెన్స్ హాల్‌లో ఆయన మిగతా 9లో

ఓటరు ఐడితో 'మొబైల్' అనుసంధానం

రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు

7

ప్రాణాలు తీసిన అతివేగం

- నలుగురు విద్యార్థులు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి గాయాలు

3

బంగ్లా ఎన్నికల్లో 'హసీనా' గెలుపు

- 288 పార్లమెంట్ స్థానాల్లో అధికార అవామీలీగ్ కూటమి జయకేతనం
- ఫలితాలను తిరస్కరించిన ప్రతిపక్షం
- హసీనాకు పలువురి అభినందనలు

9

నేడు మహిళల మానవహారం

- కేరళలో 30 లక్షల మంది పాల్గొనే అవకాశం
- రాష్ట్రానికి చేరుకున్న అంతర్జాతీయ మీడియా సంస్థలు
- ప్రపంచ రికార్డులో నమోదుకు ఏర్పాట్లు

8



13 తరువాత ఆర్టీసి సమ్మె

ఎమ్‌డికి ఇయు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నోటీసు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి ఉద్యోగుల వేతన సవరణ సమస్యను పరిష్కరించకపోతే జనవరి 13 తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు దిగుతామని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) రాష్ట్ర అధ్యక్షులు వైవిరావు, ప్రధాన కార్యదర్శ పలిశెట్టి దామోదరరావు హెచ్చరించారు. ఆర్టీసి ఎమ్‌డి సురేంద్రబాబు, చైర్మన్ వర్ల రామయ్యకు సోమవారం వారు సమ్మె నోటీసు అందజేశారు. ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర నాయకులు కూడా ఎమ్‌డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లకోసారి జరగాల్సిన వేతన సవరణ 2017 ఏప్రెల్ మిగతా 9లో

వీడ్కోలు

అమరావతికి బయలుదేరిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న తెలంగాణ న్యాయవాదులు



నిరసన

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపులో రాయలసీమకు అన్యాయం చేశారంటూ హైదరాబాద్ హైకోర్టులో నిరసన తెలుపుతున్న ఆ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు





తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రెండ్రోజుల నుంచి తగ్గుముఖం పడుతున్నాయి. కోస్తాలోని విశాఖ, అమరావతి తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో 12 డిగ్రీలకు పడిపోవడం పదేళ్లలో ఇదేనని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్లపల్లి మురళీకృష్ణ అభిప్రాయ పడ్డారు. అంతకుముందు విశాఖలో 11.6 డిగ్రీలు నమోదైందన్నారు. ఉత్తరాదిలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడ నుండి చలి కిందకు వ్యాపిస్తోందని చెప్పారు. ఆకాశం నిర్మలంగా ఉండటంతో పగలు ఎండలు కాసినా రేడియేషన్ కూలింగ్‌తో సాయంత్రం తొందరగా కింద నున్న వేడి పైకి వెళ్లిపోవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతోంద న్నారు. అరకు, లంబసింగి వంటి ప్రదేశాలు ఎత్తుగా ఉండటంతో ఉత్తరాది గాలుల ప్రభా వంతో దాదాపుగా జీరో డిగ్రీలకు చేరుతోందని తెలిపారు. అక్కడ మంచు కురిసే అవకాశాలు న్నాయన్నారు. మరో నాలుగైదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. తర్వాత క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, రాత్రి వేళల్లో చలి కొనసాగుతుందని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతు న్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ప్రజ్ఞ

1. 42వ ఇండియన్ సోషల్ సైన్స్ కాంగ్రెస్ ఎక్కడ జరిగింది?
2. అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ను ఎవరు? అధిరోహించారు?
3. షేక్ హసినా ఏ పార్టీకి నేతృత్వం వహిస్తున్నారు?
4. 2019లో అంతర్జాతీయ కెమికల్ ఫెస్టివల్ ఏ రాష్ట్రంలో జరగనుంది?
5. ఐరాస ఎఫ్ఏవోలో భారత శాశ్వత ప్రతినిధిగా నియామితులయింది ఎవరు?

సమాధానాలు 7లో

హక్కుల పరిరక్షణకు పోరాటం

- ఉద్యమకారులపై కేసుల్ని ఎత్తేయాలి
- ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్‌లో తీర్మానం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యర్శి పి మధు, పాల్గొన్న ఇతర పార్టీల నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని విజయవాడలోని ఎన్జీవో హోంలో సోమవారం నిర్వహించిన ప్రజా సంఘాల సదస్సు తీర్మానించింది. ధర్నాలు, ప్రదర్శనలకు పోలీసుల ఆంక్షలు తొలగించాలని, ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేసింది. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకించాలని, ఈ అంశంపై కార్మిక, ప్రజా సంఘాలు తీర్మానం చేసి ముఖ్యమంత్రికి పంపాలన్నారు. దేశంలో దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమాల ప్రభావంతో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపిపై వ్యతిరేకత వ్యక్తమయ్యింద న్నారు. రాష్ట్రంలో కొంత మంది పోలీసులు పసుపు చొక్కాలు వేసుకోకుండానే టిడిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ఆందోళనకారులను వాహనాల నుంచి దింపి భయభ్రాంతులకు గురిచేస్తు న్నారని, ఇది సరికాదని అన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి లేఖ రాయాల్సిన అవసరముందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ నిరసన కారుల పట్ల ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోందని, విభజన తరువాత ఏ నిరసనలకూ అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. సచివాలయానికి దూరంగా విజయవాడలో శాంతియుతంగా ధర్నాలు చేస్తే కనీస గౌరవం లేకుండా ఎందుకు అరెస్టులు చేయాల్సి వస్తోందని ప్రశ్నించారు. పోలీసులు కనీస ఇంకితజ్ఞానంతో పనిచేయడం లేదన్నారు.

ఆందోళనకారులు చీడపురుగుల్లా కనిపిస్తున్నారా? టిడిపి నాయకులకు ఒక చట్టం, ప్రతిపక్షాలకు వేరే చట్టం ఉందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ దేశంలో ప్రజాస్వామ్య రక్షణకు పోరాటం చేస్తున్నానని సిఎం చెప్పడం విడ్డూరమన్నారు. వైఎస్‌ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గౌతంరెడ్డి మాట్లాడుతూ పోలీసుల ద్వారా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. టిడిపి నాయకుల దీక్షలకు అనుమతి అవసరం లేదా? ఇతరులనైతే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాలరాసే నిర్ణయాలపై నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని తెలిపారు. పోలీస్ వ్యవస్థ తీరు మార్చుకోవాలన్నారు. అనుమతి కోరాక 24 గంటల్లో ధర్నాలకు అనుమతివ్వాలని, ధర్నా చౌక్‌కు కావాల్సినంత స్థలం ఇచ్చి మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, పిడబ్ల్యూడి గ్రౌండ్‌లో బహిరంగ సభలకు అనుమతివ్వాలని, తుమ్మలపల్లి కళాక్షేత్రం అద్దెలను తగ్గించి అందరికీ అందుబాటులోకి తేవాలని తీర్మానం చేశారు. సమావేశానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అధ్యక్షతన వహించారు. సమావేశంలో జనసేన నాయకులు పోతిన మహేష్, ఎఐటియుసి పూర్వ ప్రధానకార్యదర్శి పీజే చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ నాయకులు సుంకర రాజేంద్ర ప్రసాద్, శ్రామిక మహిళా నాయకురాలు కె.స్వరూపరాణి, మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గాభవాని, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జెల్లి విల్సన్, ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి పూల పెద్దిరెడ్డి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఎస్‌యూసీఐ, లిబరేషన్ పార్టీల నాయకులు, విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకు ఇళ్లు

- ఎఆర్, మహిళా కానిస్టేబుళ్లకూ పదోన్నతులు
- ఆత్మీయ సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసులకు త్వరలో ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పోలీస్ కానిస్టేబుళ్లు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ సివిల్ కానిస్టేబుళ్లలాగా ఎఆర్ కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్ల పదోన్నతికి అడ్డంకిగా ఉన్న జీవో 84ను అధిగమించి, వారికి కూడా పదోన్నతులు కల్పిస్తామన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు సక్రమంగా ఉండాలని, అందుకు పోలీసుల సహకారం అవసరమని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలీసుల ప్రతిష్ట పెంచే బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాలా గౌరవాన్ని పెంచుతామని అన్నారు. కానిస్టేబుళ్ల యూనిఫాంను నిక్కర్ నుంచి ఫ్యాంట్‌గా మార్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పోలీసుల్లో వచ్చిన నూతన శక్తితో దేశంలోనే ఎపి పోలీస్ వ్యవస్థ పటిష్టంగా మారుతుందన్నారు. 189 డిఎస్పీ పోస్టులిన సూపర్ న్యూమరీ పోస్టులుగా మారుస్తున్నామన్నారు. అందరికంటే పోలీస్ ఉద్యోగం కష్టమని, పోలీసుల త్యాగాలవల్లే అందరూ ఆనందంగా ఉంటున్నారన్నారు. పోలీస్ కానిస్టేబుల్ కూడా ఐటి ప్రొఫెషినల్ కావాలని, పోలీసుల్ని నిరంతరం పైకి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. పోలీసులకు ఎటువంటి సమస్యలొచ్చినా తన దృష్టికి తీసుకురావాలని డిజిపికి సూచించారు. ఎస్పీ, డిఐజి, ఐజిలు కూడా కింది స్థాయి ఉద్యోగులకు గౌరవమివ్వాలని, వారితో మమేకమై కుటుంబ సభ్యుల్లాగా మెలగాలన్నారు. హోం శాఖా మంత్రి చినరాజప్ప మాట్లాడుతూ కొత్తగా తీసుకునే కానిస్టేబుళ్లకు సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నామన్నారు. డిజిపి ఆర్‌పి ఠాకూర్ మాట్లాడుతూ పోలీసుల్లో స్థాయీ భేదం స్టార్లలోనే ఉందని, అందరూ కుటుంబ సభ్యులేనని అన్నారు. అందరి సహకారంతో పోలీసులకు మరింత సంక్షేమాన్ని కల్పిస్తామన్నారు. ఎఆర్, మహిళా కానిస్టేబుళ్లకు కూడా పదోన్నతి కల్పిస్తే బాగుంటుందని సిఎంను కోరారు. కానిస్టేబుళ్లు సిఎంను గజమాలతో సత్కరించారు. పోలీస్ శాఖకు నూతనంగా కేటాయించిన 1580 వాహనాలను సిఎం ప్రారంభించారు. అంతకు ముందు మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో వంద అడుగుల జాతీయ జెండాను సిఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, విజయవాడ నగర సిపి ద్వారకా తిరుమలరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ ఎబి వెంకటేశ్వరరావు, పోలీస్ ఉన్నతాధికారులు రవి శంకర్, కిశోర్ కుమార్, సంజయ్, కుమార్ విశ్వజిత్, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.



డిజిపికి కేక్ తినిపిస్తున్న సిఎం చంద్రబాబు

రాహుల్, మమతలకు ఫోన్

ముస్లిం వర్గాల్లో అభద్రత దేశ సమగ్రతకు మంచిది కాదని, త్రిపుల్ తలాక్ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించడంతో పాటు, సభలో లోతుగా చర్చించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లి గ్రీవెన్స్‌హాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని అందరికీ ఒకే చట్టం ఉండాలని, ఒక్కో వర్గానికి ఒక్కో చట్టం ఉండకూడదని అన్నారు. ముస్లిం వ్యతిరేక పోకడల్ని బిజెపి అనుసరిస్తోందని, త్రిపుల్ తలాక్ చట్టానికి వ్యతిరేకంగా బిజెపియేతర పార్టీలన్నీ ఏకం కావాలని ఇతర పార్టీలకు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీతో ఈ విషయంపై ఫోన్లో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

23న పిసిబి సెంట్రల్ ల్యాబ్ ప్రారంభం

మంత్రి శిద్ధా రాఘవరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో రూ. 22 కోట్లతో ఏర్పాటు చేసిన కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) సెంట్రల్ ల్యాబొరేటరీని ఈనెల 23న ప్రారంభిస్తామని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు తెలిపారు. సోమవారం సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో 5 హెక్టార్లలోపు ఉన్న పరిశ్రమల యాజమాన్యం స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఇఐఎఎ) ద్వారా పర్యావరణ అనుమతులు పొందవచ్చని అధికారులకు తెలిపారు.

మరణించిన ఆర్టీసి ఉద్యోగుల కుటుంబాలకు రూ.5 లక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ(సిసిఎస్) ద్వారా రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి టి త్రాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క సభ్యునికీ రూ.1,641 ప్రీమియం చొప్పున సొసైటీకి చెల్లించవలసిన రూ.8.5 కోట్ల చెక్కును సోమవారం ఆర్టీసి ఎమ్‌డి సురేంద్రబాబు అందించినట్లు పేర్కొన్నారు. ఈ బీమా జనవరి 1 నుంచి అమలులోకి వస్తుందని, ఏడాది పాటు చెల్లుబాటులో ఉంటుందని తెలిపారు.

కుంభమేళాకు రండి

చంద్రబాబుకు యుపి మంత్రి ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో ఈనెల 15నుంచి జరిగే కుంభమేళా ఉత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును యుపి పరిశ్రమల శాఖ మంత్రి సతీష్ మహనా ఆహ్వానించారు. ఉండవల్లి గ్రీవెన్స్‌హాల్‌లో సోమవారం చంద్రబాబును ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా వారణాసిలో జనవరి 21 నుంచి మూడు రోజులపాటు జరిగే ప్రవాస భారతి దినోత్సవానికి హాజరుకావాలని మరో ఆహ్వానపత్రికను కూడా మంత్రి అందించారు.

75 లక్షల ఎకరాలకు పోలవరం ఆయకట్టు !

- సిఎంకు వివరించిన జలవనరుల శాఖాధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు కింద సాగు విస్తీర్ణం 40 లక్షల ఎకరాలు నుంచి 75 లక్షల ఎకరాలకు పెరిగిందని జలవనరుల శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. పోలవరం పనుల పురోగతిపై సోమవారం ఉండవల్లి ప్రజావేదికలో సిఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం వల్ల ఏ జిల్లాకు ఎంత మేర ప్రయోజనం కలుగుతుందనే దానిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేశామన్నారు. పోలవరం పూర్తయితే 75.38 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడం సాధ్యమ వుతుందన్నారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాకు మేలు జరుగుతుందన్నారు. విశాఖ నగరం తాగు నీరుకు 7.32 టిఎంసిలు, పరిశ్రమలకు 16.12 టిఎంసిలు, పరిసర ప్రాంతాల్లోని 540 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి తాగు నీరు లభిస్తుందన్నారు. ఒడిశాకు 5, చత్తీస్‌గడ్‌కు 1.5 టిఎంసిలు అందుతుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల సర్వీసు ఏడాది పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు ప్రస్తుతం వారికున్న సర్వీసును మరో ఏడాది పాటు పొడిగించినట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధిత్యనాథ్ దాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఉద్యోగ విరమణ నాటికి మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటే వారి సేవల్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలుల్లోకొస్తాయని ఆధిత్యనాథ్ తెలిపారు.

12 నుండి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనవరి 12 నుండి 20 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు సిద్ధమయ్యాయి. దీనిపై ఉన్నతాధికారులు సంతకం చేయడమే తరువాయి. ఇప్పటికే జూనియర్ కళాశాలలకు 12 నుండి 20 వరకు సెలువులు ప్రకటించిన సంగతి తెలిసిందే. జనవరి 2 నుండి జన్మభూమి కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో సెలవుల్ని మార్చాలని ఉపాధ్యాయుల నుండి పెద్దఎత్తున వినతులొస్తున్నాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ప్రత్యేకం

తెలంగాణకన్నా మనమే భేష్!


- శ్వేతపత్రానికి ఆర్థికశాఖ తుది మెరుగులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి నిధులివ్వడంలో కేంద్రం విదిలింపు ధోరణి అవలంబిస్తోంది. ప్రత్యేక అవసరాల కోసం అడిగిన నిధుల్లో కేవలం 17 శాతమే ఇచ్చి చేతులు దులుపుకొంది. అయినా పక్క రాష్ట్రమైన తెలంగాణ కన్నా నవ్యాంధ్రప్రదేశ్‌లోనే అభివృద్ధి మెరుగ్గా ఉండదని, కాని తలసరి ఆదాయంలో మాత్రం బాగా వెనుకబడి ఉన్నట్లు అధికారులు చెబుతు న్నారు. ఇలాంటి పలు అంశాలతో ఆర్థిక శాఖ అధికారులు శ్వేతపత్రాన్ని సిద్ధంచేశారు. మంగళ వారంనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేయనున్నారు.

విభజన నేపథ్యంలో వివిధ రంగాల్లో ప్రత్యేక సాయం కోసం 80,365 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరగా కేవలం 14,256 కోట్లే ఇచ్చింది. దీనినే ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించనున్నారు. లోటు నిధులు రూ.16,078 కోట్లు అడగ్గా రూ.3,979 కోట్లు మాత్రమే ఇచ్చింది. రాజధానికి రూ.39,937 కోట్లు కోరగా రూ.1,500 కోట్లు, ఏడు జిల్లాలకు రూ.24,350 కోట్లకుగానూ రూ.1,050 కోట్లు మాత్రమే ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించనున్నారు. అలాగే ప్రత్యేక సాయం కింద కూడా విదిలింపు విధానాన్నే అనుసరిస్తోందని శ్వేతపేతంలో పేర్కొన్నట్టు తెలిసింది. ఇక తాజాగా తెలంగాణ, ఆంధ్రా ముఖ్యమంత్రుల మధ్య నెలకొన్న మాటల తూటాల నేపథ్యంలో రెండు రాష్ట్రాల అభివృద్ధిపైనా వివరించాలని భావిస్తున్నారు. ప్రధానంగా విభజన సమయం నుంచి రెండు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ఆంధ్రాయే మెరుగ్గా ఉందని చెప్పనున్నారు. ప్రతియేటా సొంత ఆదాయం పెరుగుతూ తాజా గణాంకాల మేరకు రూ.71 వేల కోట్లు దాటిందని వివరించనున్నారు. అయితే కేంద్రం విధానాల వల్ల ఇతర అంశాల్లో సమస్యలు పెరుగుతున్నాయన్న కోణంలో వాటి వివరాలు కూడా సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఒక్క వ్యవసాయ రంగంలో మాత్రం మెరుగ్గా ఉన్నట్లు చెబుతున్న ప్రభుత్వం పరిశ్రమలు, సేవా రంగాల్లో మాత్రం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోల్చిచూస్తే ఆంధ్రా వెనుకబడి ఉంది. పరిశ్రమల రంగంలో 22.09 శాతం ఆదాయం లభిస్తుండగా, తమిళనాడులో 34 శాతం, కర్నాటకలో 23 శాతం, కేరళలో 23 శాతం ఆదాయం లభిస్తున్నట్లు లెక్కలు తేల్చారు. సేవా రంగంలో కూడా రాష్ట్రంలో 43.54 శాతం ఆదాయం లభిస్తుండగా, తెలంగాణలో ఏకంగా 63.8 శాతం లభిస్తోంది. కర్నాటకలో కూడా 66.27 శాతం, తమిళనాడులో 53.37 శాతం, కేరలంలో 64.41 శాతం ఆదాయం సమకూరు తోంది. దీనికి కారణం నిర్మాణ రంగం మెరుగ్గా లేకపోవడం, పరిశ్రమలకు కేంద్రం సహకరించక పోవడమే కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చెప్పనుంది.

ఇక ఐదేళ్లుగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ వ్యవసాయ రంగంలో మెరుగైన అభివృద్ధి సాధిస్తున్నట్లు చూపించాలని భావిస్తు న్నారు. తలసరి ఆదాయం కూడా వెనుకబడి ఉందని, సేవా, పారిశ్రామిక రంగాల అభివృద్ధి లేకపోవడమేనని వివరించాలని భావిస్తున్నారు. తలసరి ఆదాయంలో ఇతర రాష్ట్రాల గణాంకాలే మెరుగ్గా కనిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన సంవత్సరంలో రూ.93,900 రూపాయల తలసరి ఆదాయం ఉండగా, 2017-18 నాటికి రూ.1.42 లక్షలకు పెరిగింది. అదే పక్కనున్న తెలంగాణలో 2014-15లో రూ.1.12 లక్షల కోట్ల తలసరి ఆదాయం ఉండగా, అది ఏకంగా రూ.1.81 లక్షల కోట్లకు చేరుకుంది. కేరళలో కూడా 2014-15లో రూ.1.23 లక్షల కోట్లు ఉండగా, గత ఏడాదికి రూ.1.80 లక్షలకు చేరుకోవడం విశేషం. కర్నాటకలోనూ ఇదే తరహాలో అభివృద్ధి కనిపిస్తున్నట్లు రాష్ట్ర అధికారులు వివరించారు. ఇలా మరికొన్ని అంశాలతో, కేంద్రం అనుసరిస్తున్న విధానాలను వివరిస్తూ మంగళవారం ఈ సీరీస్‌లో చివరి శ్వేతపత్రాన్ని ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు.



విజయవాడలో నూతన సంవత్సర సంబరాలు





విజయవాడలో నూతన సంవత్సర రాక సందర్భంగా సోమవారం అర్ధరాత్రి సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో యువతీ యువకులు రోడ్లమీదకు వచ్చి అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుకున్నారు.





నేటి నుంచి దుర్గగుడిలో సంప్రదాయ దుస్తుల నిబంధన అమలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలోకి ఆధునిక వస్త్రాలతో ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. కొద్దిరోజుల క్రితం భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యురాలు, మాజీ సారథి మిథాలీరాజ్ విజయవాడకు వచ్చారు. ఆ సమయంలో ఆమె జీన్స్ ఫ్యాంటు, టీషర్టు ధరించి కనకదుర్గమ్మ ఆలయంలోకి ప్రవేశించారు. ఆమెకు ఆలయ అధికారులు కూడా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇది పెద్ద వివాదంగా మారింది. ఆలయంలోకి ఆధునిక వస్త్రాలతో ఎలా ప్రవేశిస్తారని, ఇది అమ్మవారి పవిత్రతకు భంగం కలిగించడమనే వాదన వచ్చింది. దీంతో ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి ఆలయ అధికారులు తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు తిరుమల తిరుపతిలో అమలు చేస్తున్న విధంగా ఆలయంలోకి ప్రవేశించే వారు సంప్రదాయ వస్త్రాలను మాత్రమే ధరించి రావాలనే నిబంధనను విధించారు.

పాదయాత్ర



శ్రీకాకుళం జిల్లా గుణుపల్లిలో జగన్‌కు సమస్యలను విన్నవిస్తున్న కిడ్నీ రోగులు

వైద్యం అందడం లేదు

జగన్‌తో వాపోయిన ఉద్దానం కిడ్నీ బాధిత ప్రజలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

తమ గ్రామంలో ప్రతి ఇంట్లో కనీసం ఒకరైనా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, అయినా ఎలాంటి వైద్య సదుపాయాలూ అందడం లేదని శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి గ్రామస్తులు వైసిపి అధినేత జగన్ వద్ద వాపోయారు. డయాలసిస్ కోసం శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లాల్సి వస్తుండడంతో, ఆర్థిక భారం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పని ద్వారా వచ్చిన డబ్బంతా మందులకే ఖర్చు పెట్టాల్సి వస్తోందని, తమను ఆదుకోవాలని కోరారు. జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర సోమవారం ఉద్దాన ప్రాంతంలో సాగింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక సాయం చేయాలని, తమను బిసి-ఎ జాబితాలో చేర్చాలని తూర్పు కాపు సంఘం నాయకులు కోరారు. లొత్తూరు వరహాలగెడ్డ రిజర్వాయర్ నిర్మించి, రైతులకు మేలు చేయాలని రెంటికోట యువకులు విజ్ఞప్తి చేశారు. పాదయాత్రలో జగన్ సమక్షంలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి వైసిపిలో చేరారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2019 తెలుగు ప్రజలకు ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు వెల్లివి రియాలని, సంపద, సమద్ధి కలగాలని, ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవితాల్లో మంచి మార్పులకు దారితీయాలని ఆకాంక్షించారు.

టిడిపి, వైసిపి ద్రోహం

- గిరిజనులను గాలికొదిలేశాయి
- సిపిఎం, సిపిఐ, జనసేన కూటమికి అండగా నిలవాలి
- బుట్టాయగూడెం సభలో పి.మధు, కె.రామకృష్ణ



బహిరంగ సభలో మాట్లాడుతున్న మధు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం పేరుతో ప్రభుత్వం గిరిజనులను గాలికొదిలేసింది... రోడ్లు, వైద్య సదుపాయం, స్కూళ్లు.. ఏ ఒక్కటీ లేవు... అదేమని అడిగితే మునిగిపోయే వాళ్లకు సదుపాయాలు ఎందుకంటూ దారుణంగా మాట్లాడతారు.... రాష్ట్రంలో ఏడు గిరిజన నియోజకవర్గాలు ఉండగా, ఆరుచోట్ల వైసిపి ఎంఎల్‌ఎలు గెలిచారు. వారు కూడా పోలవరం నిర్వాసితుల గురించి మాట్లాడరు... టిడిపి, వైసిపిలు గిరిజనులకు శనిలా మారాయి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 'పోలవరం నియోజకవర్గ సమస్యలు-నియోజకవర్గ అభివృద్ధి, నూతన రాజకీయ ప్రత్యామ్నాయం' పేరిట బుట్టాయగూడెంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. సభలో పి.మధు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఇళ్లకు ఇళ్లు, భూమికి భూమి అంటూ చెప్పి నయవంచన చేశారన్నారు. సిపిఎం, సిపిఐ, జనసేన కూటమి అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే పేద ప్రజల సమస్యలు తీరతాయన్నారు. పోలవరం పనుల పరిశీలనకు జిల్లాకు వచ్చే సిఎం గిరిజనుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో ముంపు ప్రాంతాలను ఇప్పటివరకూ సరిగా తేల్చలేదన్నారు. 30, 40 ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను నిర్వాసిత గిరిజనులకు ఇస్తూ గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. గిరిజన సలహా కమిటీని ఏర్పాటు చేయకుండా ఏజెన్సీలో ఏ విధంగా పనులు చేపడుతున్నారని నిలదీశారు.. రాష్ట్రానికి అనేక హామీలిచ్చిన మోడీ సర్కారు పూర్తిగా విస్మరించిందన్నారు. రూ.15 లక్షలు బ్యాంకులో వేస్తానని, నల్లధనం తెస్తానంటూ హామీలు గుప్పించిన మోడీ నాలుగున్నరేళ్లుగా ఏ ఒక్కటీ చేయలేదన్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టితో సామాన్యులను రోడ్డున పడేశారన్నారు. వ్యవసాయాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని, వారి ఆత్మహత్యలు పెరిగిపోయాయని చెప్పారు. గిరిజనులు పోరాడితే జైలులో పెడుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌కు కట్టబెడుతున్నారని, ఎదురుతిరిగి పోరాడితే ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. జనవరి 8, 9 తేదీల్లో కార్మికుల సమస్యలపై దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందని, ఆ తర్వాత రైతులకు గిట్టుబాటు ధర, రుణమాఫీ, గిరిజనులను రక్షణ వంటి అనేక అంశాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. 2019లో పోరాటాలతో ముందుకు సాగుతామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం నిర్వాసితులు త్యాగాలు చేస్తే బడాబాబులు బాగుపడ్డారన్నారు. రూ.33 వేల కోట్లు నిర్వాసితుల కోసం పరిహారంగా ఇవ్వాల్సి ఉండగా, ఎప్పటికి చెల్లిస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు వేల ఎకరాలు కట్టబెడుతున్న చంద్రబాబు గిరిజనులకు పోడు భూములకు పట్టాలు కూడా ఇవ్వలేదన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అధికారులపై, ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడుతున్నా కనీస చర్యలు లేకుండా పోయాయన్నారు. మట్కా జూదగాళ్లు పోలీసులను కొట్టే పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. హోం మంత్రి చినరాజప్ప చేతకాని మంత్రిగా ఉండిపోయారన్నారు. సింగపూర్ కంపెనీకి 1,600 ఎకరాలు కట్టబెట్టారని, 13 జిల్లాల్లో ఒక్క పేదవాడికి కూడా ఎకరం భూమి ఇవ్వలేదన్నారు. చంద్రబాబు దిగాలి... కొత్త రాజకీయ శక్తి రావాలని నినదించారు. ప్రజల పక్షాన పోరాడాల్సిన వైసిపి అధినేత జగన్ తాను ముఖ్యమంత్రి అయితే తప్ప ఏమీ చేయలేనంటూ కూర్చున్నారన్నారు. అసెంబ్లీకి వెళ్లి మాట్లాడని వారికి అధికారం ఎందుకని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రవి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ మునీల్ అధ్యక్షత వహించిన సభలో జనసేన నాయకులు కరాటం సాయిచంద్రమోహన్, సౌజన్య, లోక్‌సత్తా నాయకులు వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు చింతకాయల బాబూరావు, డేగా ప్రభాకర్, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి పెన్మెత్స అప్పలరాజు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

ధాన్యం రైతుకు ఊరట ఏదీ?

- తుపానుకు తడిచిన ధాన్యం కొనేవారు కరువు
- నాణ్యతా ప్రమాణాల సడలింపునకు మీనమేషాలు



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పెథాయ్ తుపానుకు ధాన్యం దెబ్బతిన్న బాధిత రైతులకు ప్రభుత్వ చర్యలు ఊరటనివ్వడం లేదు. వర్షానికి మొలకలొచ్చి రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు, అధికార పార్టీ నేతలు చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలను సడలించకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సైతం కొనడం లేదు. తాము పండించిన పంట ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మచిలీపట్నం మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించినప్పుడు తుపాను బాధిత రైతులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకొచ్చాయి.

దెబ్బతిన్న ధాన్యం కొనేవారు కరువు

మచిలీపట్నానికి చెందిన బోయిన నరసింహస్వామి తన మూడు ఎకరాల్లోని పంటను మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు శ్యాంపిల్ తీసుకు వచ్చారు. తుపానుకు తడవడంతో 30 శాతం గింజలు మొలకలొచ్చాయి. మచిలీపట్నం శారదానగర్‌కు చెందిన తెనాలి కిరణ్ ఆరు ఎకరాల్లో ధాన్యం, గూడూరు మండలం మల్లవోలుకు చెందిన వేణుగోపాల్ 4 ఎకరాల్లో ధాన్యం శాంపిల్స్ తీసుకొచ్చారు. తుపానుకు తడిచిన ధాన్యం కొనుగోలు చేయమని ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందలేదని, ధాన్యం కొనుగోలు చేసేది లేదని అధికారులు తేల్చిచెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 258 కేంద్రాల్లోనూ తుపానుకు దెబ్బతిన్న ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ఇలా ప్రతిరోజూ ఒక్క కొనుగోలు కేంద్రం వద్ద నుండి 10 మంది రైతులు తీసుకు వచ్చిన శ్యాంపిళ్లను అధికారులు తిరస్కరిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాల సడలింపుపై మీనమేషాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పెథాయ్ తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించే క్రమంలో 20 శాతం వరకు తడిచి, మొలకలొచ్చిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సైతం తుపానుకు దెబ్బతిన్న ధాన్యం రైతులు నష్టపోకుండా కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఈనెల 16, 17 తేదీల్లో జిల్లాలో కురిసిన వర్షాలకు వరితో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో వరి నూర్పిళ్లు ముమ్మరమయ్యాయి. దీంతో మార్కెట్‌లో విక్రయించేందుకు రైతాంగం ధాన్యం అధిక మొత్తంలో తీసుకువస్తున్నారు. అయితే 15 రోజులవుతున్నా తుపానుకు తడిచి దెబ్బతిన్న ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఉత్తర్వులూ వెలువడలేదు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంతో రైతులు పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.



ప్రమాదానికి గురైన కారు

ప్రాణాలు తీసిన అతివేగం

- నలుగురు విద్యార్థులు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ ప్రతినిధి

షాపింగ్‌కు వెళ్తూ కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో నలుగురు ఇంజినీరింగ్ విద్యా ర్థులు దుర్మరణం పాలయ్యారు. గుంటూరు సమీపంలోని లాల్‌పురం వద్ద కలకత్తా-చెన్నయ్ జాతీయరహదారిపై సోమవారం ఈ ఉదంతం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెదకూరపాడు మండలం, కంభంపాడుకు చెందిన చిరుమామిళ్ల సాయిరాం, మండల కేంద్రమైన శావల్యాపురానికి చెందిన గుంటూరు కోటేశ్వరరావు, సాదినేని ధనుష్ (గుంటూరులోని విద్యానగర్), ఎస్‌కె.గఫూర్ (పిడుగురాళ్ల మండలం పిల్లుట్ల), తారక్ హీరేంద్ర (తెనాలి సమీపంలోని వైకుంఠపురం), దొప్పలపూడి కౌశిక్ (ప్రకాశం జిల్లా ఒంగోలులోని ప్రగతినగర్), అల్లా శివాజి (ప్రకాశం జిల్లా మామిళ్లపల్లి) గుంటూరు సమీపంలోని చౌడవరం వద్ద ఆర్‌విఆర్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువు తున్నారు. సోమవారం కళాశాలకు వచ్చిన వీరు నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ నిర్వహించుకోవాలనేదానిపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అందులో భాగంగా తొలుత షాపింగ్ కోసమని కారులో గుంటూరు బయలుదేరారు. అయితే విజయవాడ అయితే బాగుంటుందని ఒకరు చెప్పగా సమయం సరిపోదని కొందరు, హైవేపై వేగంగా వెళ్తే సాయంత్రానికి రావొచ్చని వీరిలో ఒకరు చెప్పడంతో కారు వేగాన్ని పెంచారు. లాల్‌పురం వద్దకు రాగానే ముందున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం ముందుగా వెళ్తున్న గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల వాహనాన్ని (కంపాక్టర్) ఢీకొట్టింది. దీంతో కంపాక్టర్ పల్టీ కొట్టి రోడ్డుపక్కకు పడిపోయింది. ఈ క్రమంలో కారులోని సాయిరాం, కోటేశ్వరరావు, ధనుష్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానంతరం 20 నిమిషాలకు సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గాయపడిన నలుగుర్ని గుంటూరు జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందే క్రమంలో ఎస్‌కె.గఫూర్ మృతిచెందాడు. తారక్ హీరేంద్రను వారి బంధువులు స్థానిక ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. కౌశిక్, శివాజి పరిస్థితి మెరుగ్గా ఉంది. ఘటనా స్థలిని అర్బన్ ఎస్‌పి విజయరావు పరిశీలించారు. ప్రమాద సందర్భంలో కారు వేగం 160 కిలోమీటర్లున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. బంధువుల రోదనలతో జిజిహెచ్ ప్రాంగణంలో విషాద వాతావరణం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు.



మీడియా 2019 డైరీని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీని ఆవిష్కరించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర డైరీని సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఉండవల్లిలోని సిఎం కాన్ఫరెన్స్ హాలులో ఈ డైరీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి ఎ.అమరయ్య, రాష్ట్ర కోశాధికారి ఒ.శాంతి, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు టి.శ్రీరామ్మూర్తి, షేక్ ఖాజావలి, కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.రామారావు, వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు ఎం.బి.నాథన్, నగర నాయకులు జె.వి.శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

4న ఆసుపత్రుల బంద్

ప్రజాశక్తి-గుడివాడ

వినియోగదారుల రక్షణ చట్టం నుండి వైద్యరంగాన్ని మినహాయించాలని డిమాండ్ చేస్తూ జనవరి 4వ తేదీన దేశవ్యాప్తంగా ఆసుపత్రుల బంద్, నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ పొట్లూరి గంగాధరరావు తెలిపారు. సోమవారం కృష్ణాజిల్లా గుడివాడ ఐఎంఎ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు వైద్యం అందించకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను పున:సమీక్షించాలని కోరారు. ఐఎంఎ వైద్యులు ఎంతో నిబద్ధతతో పేదలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు.

మంగళగిరిని వెంటాడుతున్న ముంపు

- అసంపూర్తి నిర్మాణాలతో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తం
- చిన్నపాటి వర్షాలకే పలు కాలనీలకు చేరుతున్న వర్షం నీరు
- రాజధానిలో ఉన్నా మౌలిక వసతులు కరవు




మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వద్ద వ్యర్థపదార్థాలతో నిండిన కాలువ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతంగా ఉన్న మంగళగిరిని ముంపు సమస్య పట్టి పీడిస్తోంది. చిన్నపాటి వర్షాలకే పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రూ.32 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పటి వరకూ రూ.24 కోట్లకు పైగా ఖర్చు చేశారు. సైడు డ్రైన్లు, కాలువల నిర్మాణం కూడా అస్తవ్యస్తంగా మారింది. భూ గర్భ డ్రైనేజి నిర్మాణం చేపట్టకపోగా బహిరంగ డ్రైనేజీల నిర్మాణం కూడా సక్రమంగా జరగలేదు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటి పారుదలకు నిర్మించిన భారీ కాల్వలోకి చెత్తా చెదారం చేరుతోంది. వీటిని శుభ్రపరిచే వారు లేరు. మునిసిపల్ అధికారులకు, కాంట్రాక్టర్లకు మధ్య సమన్వయం లోపించింది. మూడు అడుగుల లోతు పైబడి ఉండే కాల్వలను తాము శుభ్రపర్చబోమని కాంట్రాక్టర్లు మొండికేస్తున్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించకపోవడం, కాల్వలపై నిర్మాణాలు జరగడం, రహదారుల విస్తరణ జరగకపోవడంతో మురుగునీటిపారుదల సరిగ్గా లేక ముంపు సమస్య వెంటాడుతోంది. లక్ష మందికి పైగా జనాభా ఉండి రాజధాని నేపథ్యంలో పట్టణ శివార్లలోనే అనేక భారీ నిర్మాణాలు జరుగుతున్నా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. పలు కాలనీల్లోకి చిన్నపాటి వర్షానికే నీరు చేరుతోంది. పాత బస్టాండ్ వద్ద ఉన్న మసీదు రోడ్డులో కూడా తరచూ బురదనీరు చేరుతోంది. పాత బస్టాండ్ నుంచి నిడమర్రు రోడ్డు వరకూ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో ఇటీవల వచ్చిన పెథాయ్ తుపాను ప్రభావంతో ఆరు సెంటీమీటర్ల వర్షానికే రత్నాల చెరువు ప్రాంతం ముంపునకు గురైంది. ఈ చెరువు పరిధిలో ఉన్న పలు కాలనీలు నీట మునిగాయి. ఆటోనగర్, రాజీవ్ గృహ కల్ప, ఎన్‌టిఆర్ గృహ వసతి ఇళ్ల నిర్మించిన నల్లచెరువు, ఎర్ర చెరువు ప్రాంతాల్లో కూడా మురుగునీటి పారుదల సరిగ్గా లేదు. పట్టణ శివార్లలో పలు ఐటీ కంపెనీలు, చిన్న తరహా పరిశ్రమలు, అపార్టుమెంట్లు ఏర్పాటవుతున్నాయి. పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వరకూ డ్రైనేజీ కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. పట్టణంలో వివిధ పద్దుల కింద నిధులొచ్చినా ఇందుకు సంబంధించిన పనుల్లో భారీగా అవినీతి జరిగిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ సుందరీకరణ నిధులు, పుష్కరాల నిమిత్తం మంజూరు చేసిన నిధులు,13వ ఆర్థిక సంఘం నిధులు భారీగానే వచ్చినా పనులు ఎక్కడా సక్రమంగా జరగలేదన్న విమర్శలు అధికార పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నాయి. నాలుగేళ్లుగా ఓపెన్ డ్రైనేజి వ్యవస్థ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. మంగళగిరి పట్టణంలో నివశిస్తున్న ప్రజలకు మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందుతున్నారు. రత్నాల చెరువు, పావురాల కాలనీలో దాదాపు వెయ్యి కుటుంబాల వరకూ ఉన్నారు. 45 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని ఉన్న వీరికి రిజిస్ట్రేషన్ సదుపాయం లేదు. మురుగునీటిపారుదల వ్యవస్థ లేదు. రత్నాల చెరువు, భగత్‌సింగ్ నగర్, లక్ష్మీనరసింహ కాలనీ, సుందరయ్య నగర్, పావురాల కాలనీ, బాపనయ్య నగర్, నీరుకొండ దళిత శిబిరం ప్రాంతాల్లో తరచూ ముంపు సమస్య ఏర్పడుతోంది. మంగళగిరికి సమీపంలోనే ముఖ్యమంత్రి నివాసం ఉండటం, పట్టణం కూడా నిత్యం వెలగపూడి సచివాలయానికి మంత్రులు, అనేక మంది విఐపిలు రాకపోకలు కొనసాగిస్తున్నా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనలో అధికార యంత్రాంగం తగిన శ్రద్ధ కనబర్చడం లేదు.


శాశ్వత ప్రణాళిక లేదు



మంగళగిరిలో మురుగునీటి పారుదల సమస్య తీవ్రంగా ఉంది. ఇందుకు శాశ్వత ప్రణాళిక లేదు. గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఇప్పటి వరకూ ఈ సమస్య గురించి పట్టించుకోలేదు. 14 ఆర్థిక సంఘం నిధులు వస్తాయని పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. గుంటూరు ఛానల్ కింద మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన పనులు పూర్తి చేయాలి.


- కారంపూడి అంకమ్మరావు, మాజీ కౌన్సిలర్

పూడికలు తీయకపోవడం వల్లే ..



పట్టణంలో డ్రైనేజి కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మురుగు నీటి పారుదలకు ఎప్పటికప్పుడు పూడికలు తీయాలి. సిల్టు తొలగింపు కూడా సక్రమంగా లేదు. పలు కాలనీల్లోకి చిన్న పాటి వర్షానికే నీరు చేరుతోంది. రత్నాల చెరువులో నివశించే వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని చాలా కాలంగా ప్రజలు కోరుతున్నారు.

- చిలకా వెంకటేశ్వర్లు, రత్నాల చెరువు మంగళగిరి



కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయంలో సోమవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. బేగంపేట విమానాశ్రయం నుంచి మొదటి విమానం ఓర్వకల్లుకు చేరుకుంది. విమానాశ్రయ పనులను ఇంధన, పెట్టుబడుల పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పర్యవేక్షించారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి చంద్రబాబు విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

సంపాదకీయం

అవినీతి ఆంధ్రా!

అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దూసుకు పోవడమేమోకానీ అవినీతిలో మాత్రం శరవేగాన్ని లంకించుకుంది. తమ ఏలుబడి అవినీతి రహితమని పారదర్శకతకు పాలనా సామర్థ్యానికి పెట్టింది పేరని ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టహాసంగా శ్వేత పత్రాల విడుదలకు ఉపక్రమించిన సమయంలోనే చిరుద్యోగులు సైతం అక్రమార్జన ద్వారా రూ.వందల కోట్లకు పడగలెత్తుతున్న దృష్టాంతాలు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) సోదాల్లో బయల్పడుతున్నాయి. సదరు ప్రబుద్ధులు రెండు చేతులా కూడబెడుతున్న అక్రమాస్తులను, బస్తాలకు బస్తాలు కరెన్సీ నోట్ల కట్టలను, కిలోలకు కిలోల బంగారు, వెండి ఆభరణాలను చూస్తున్న ఎసిబి అధికారులే కళ్లు తేలేస్తున్నారు. ఏలూరులోని పంచాయతీరాజ్ జిల్లా కార్యాలయం (ఆర్‌డబ్ల్యుఎస్ విభాగం)లో పని చేస్తున్న దివాకర్ అనే జూనియర్ అసిస్టెంట్ నివాసాలపై ఆదివారం దాడులు చేస్తే ఏకంగా రూ.వంద కోట్ల విలువైన చర స్థిరాస్తులు బయట పడ్డాయి. కూలంకషంగా దర్యాప్తు చేస్తే ఇంకెన్ని ఆస్తులు దొరుకుతాయో చెప్పలేం. రూ.పది వేల జీతంపై తొమ్మిదేళ్ల క్రితంఉద్యోగంలో చేరిన ఒక సాదాసీదా ఉద్యోగి ఏకాయెకన రూ.వంద కోట్లు పోగేయడం అసామాన్యం. విలాసవంతమైన గృహ సముదాయాలు, కమర్షియల్ భవనాలు, ఫాంహౌస్‌లు, పదుల్లో ఇళ్ల స్థలాలు, కిలోలల్లో విలువైన ఆభరణాలు సంపాదించడం ఆ ఒక్క ఉద్యోగి పనితనమే అనుకుంటే పొరపాటు. ఎక్కడి నుంచి ఎక్కడికి అవినీతి మూలాలు విస్తరించాయో ప్రభుత్వంలోని 'పెద్దల' అండ ఎంతనో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తేనే తేలుతుంది. లేదంటే ఆ ఒక్క వ్యక్తితో అంతా పరిసమాప్తమవుతుంది. మరో అధికారి అవినీతి బాగోతం బయట పడే వరకు ఎంచక్కా అక్రమార్కులు తమ చేతివాటం ప్రదర్శిస్తూనే ఉంటారు. దొరికితేనే దొంగలు అప్పటి వరకు దొరలుగా చెలామణి అవుతుంటారు.

అందిన ఫిర్యాదులపైనా వార్షిక టార్గెట్లను చేరేందుకు ఎసిబి మచ్చుకు నిర్వహిస్తున్న దాడుల్లోనే ఇంతగా అవినీతి గుప్పుమంటుండగా వాస్తవాలు ఇంకెంత భయంకరంగా ఉంటాయో ఊహకు కూడా అందదు. ఈ ఒక్క పది రోజుల్లోనే శ్రీకాకుళంలో ఇద్దరు అవినీతి అధికారుల వ్యవహారాలు ఎసిబి తనిఖీలలో వెలుగు చూశాయి. ఆర్‌టిసిలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పని చేస్తున్న రవికుమార్ అక్రమార్జన రూ.50 కోట్లు. నాగేశ్వరరావు అనే పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ అవినీతి సంపాదన రూ.20 కోట్లు. నవంబర్‌లో బహిర్గతమైన తిరుపతి, విశాఖ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల భారీ అక్రమ దందాలు తెలిసిందే. రాజధాని ప్రాంతంలో మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి 2017లో ఎసిబికి దొరికిన ప్రజారోగ్య విభాగం ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ పాము పాండురంగారావు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ రఘు ఒక్కొక్కరుగా రూ.500 కోట్లకు మించిన అక్రమాస్తుల వరుస ఉదంతాలు అప్పట్లో యావదాంధ్రను నిశ్చేష్టులను చేశాయి. చెప్పుకుంటూ పోతే బయటికొచ్చిన కొద్దిపాటి సంఘటనలే కొండవీటి చాంతాడంత. ఇలాంటి సంచలన కేసులు సైతం తర్వాత ఏమయ్యాయో ఎవ్వరికీ తెలీదు. ప్రభుత్వంలోని పెద్దల పేర్లు బయటికి రాకుండా వాస్తవాలకు సమాధి కట్టారని దర్యాప్తులు, ఛార్జిషీట్లు, కోర్టు విచారణలు, శిక్షలను చూస్తే తెలుస్తుంది. దేశాన్ని సైతం నివ్వెరపర్చిన పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సిసిఐ కుంభకోణాన్నే తీసుకుంటే ఇప్పటికీ ఒకపట్టాన తేల్లేదు. నిందితులైన పలువురు అధికారులపై దర్యాప్తులను ఒక్క కలంపోటుతో సర్కారు ఎత్తేసింది. ఇలాంటి ఉదంతాలు ఈ ప్రభుత్వంలో ఎన్నో ఉన్నాయి.

మొన్న దొరికిన ఆర్‌డబ్ల్యుఎస్ దివాకర్‌నే తీసుకుంటే ఏడాది నుంచి దీర్ఘకాలపు సెలవు పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నాడు. పంచాతీరాజ్‌కు సిఎం కుమారుడు లోకేష్ మంత్రి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)కి కూడా ఆయనే అమాత్యుడు. ఐటితో అవినీతిని అంతం చేస్తామంటూ ఉంటారు చంద్రబాబు. ఈ మధ్యన రియల్ టైం గవర్నెన్స్ (ఆర్‌టిజి)కి పాలనలోని అన్ని లోటుపాటులూ క్షణాల్లో తెలుస్తాయని తెగ ఊదరగొడుతున్నారు. ఐటి మంత్రి లోకేష్ పర్యవేక్షించే శాఖలోని ఒక చిన్న ఉద్యోగి ఆఫీస్‌కు డుమ్మాకొట్టి ఇన్నేసి రూ. కోట్లు అక్రమంగా సంపాదిస్తుంటే తెలీదనుకోవాలా? తెలిసినా వదిలేశారా? సంక్షేమ పథకాల్లో ఆన్‌లైన్ పేమెంట్స్ వలన అవినీతి పోతుందంటున్నారే? శ్రీకాకుళంలో తిత్లీ తుపాను పరిహారాన్ని మంత్రి అచ్చెన్నాయుడి సమీప బంధువుకు చెల్లించే ప్రయత్నం చేశారుగా? కృష్ణాలో అవినీతి అధికారిపై 'మీకోసం'లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే కలెక్టర్ కార్యాలయంలోనే ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషాదం మాటేంటి? మా పరిపాలన ఎంత గొప్పదో మాకు వచ్చిన 637 అవార్డులూ చూసుకోండని సిఎం గారు పదే పదే చెప్తున్నారు. 'యువనేస్తం'లో లక్షల మందికి నిరుద్యోగ భృతి దొరకని ఉదంతాలు, ఈ-పోస్‌లో రేషన్ నిరాకరించబడుతున్న వేలాది కుటుంబాలు, భూరికార్డుల 'ఆధునీకరణ' ప్రహసనంలో పేర్లు గల్లంతైన వేలాది మంది వాస్తవ భూయజమానులు, రోజుకొకటి చొప్పున బయట పడుతున్న అవినీతి తిమింగలాల వ్యవహారాలు.. ఇవన్నీ ప్రభుత్వ పాలనకు అసలైన ప్రమాణాలని పాలకులు ఇప్పుడైనా గ్రహిస్తారా? లేక శ్వేతపత్రాల మాటున ఈ వైఫల్యాలని కప్పెట్టుకుంటారా?

ఇదీ విషయం



ఈ నూతన సంవత్సరము
నవ చేతన సంపత్కరము
యువ జీవన శోభావహము
కవితామయ బృందావనము


నీ చిరునవ్వులు పూచిన పువ్వులు
చిందించెనులే పరిమళము
నీ హృదయ పాత్రలో మధువులు నిండి
కావించెను నను పరవశము

- శ్రీశ్రీ

నోట్ల రద్దుపై విమర్శల తీరుతెన్నులు

ప్రజా ప్రభాతం

2016వ సంవత్సరం నవంబరులో భారత ప్రభుత్వం చేసిన నోట్ల రద్దు చర్యను ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ బహిరంగంగా వ్యతిరేకించారు. రాజన్ ఒక ప్రముఖ ఆర్థికవేత్త, ఆయన దేశంలో ఒక ముఖ్యమైన విధాన నిర్ణేత అయినందున నోట్ల రద్దుపై ఆయన చేసిన విమర్శను స్వాగతించాలి. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నియంతృత్వ చర్యపై వచ్చిన విమర్శకు రాజన్ విమర్శ తోడవటంతో అది మరింతగా బలోపేతం అయింది. అయితే అదే సమయంలో ఒక ముఖ్యమైన తేడాను ఎత్తిచూపవలసిన సందర్భాన్ని అది కల్పించింది. సైద్ధాంతిక విషయాలలో అవకాశవాదంగానీ, ఎత్తుగడల ఐక్య సంఘటనగానీ ఉండే అవకాశం లేనందున ఒక నిరంకుశ చర్యను వ్యతిరేకించటంలో ఒకేవైపు ఉన్నప్పటికీ తేడాలను ఎత్తిచూపటం సైద్ధాంతిక స్పష్టతకు అవసరం.



ప్రభాత్ పట్నాయక్

నోట్ల రద్దు చర్యకు వ్యతిరేకంగా చేసిన విమర్శలో రెండు వేర్వేరు పాయలున్నాయి. ఈ చర్యతో రైతాంగం, చిన్న ఉత్పత్తిదారులు, కార్మికులు క్లుప్తంగా చెప్పాలంటే అశేష శ్రామిక జనావళి వినాశకర పర్యవసానాలను చవి చూడాల్సి వస్తుందని వామపక్ష విమర్శ ఎత్తిచూపింది. మరోవైపు నయా ఉదారవాద చట్రం లోపల నుంచి ఆలోచించే మన్‌మోహన్ సింగ్‌తో పాటు అనేకమంది నోట్ల రద్దుతో స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటుపై హానికరమైన ప్రభావం పడుతుందని విమర్శించారు. అంటే నోట్ల రద్దుతో వృద్ధి రేటుపై హానికరమైన ప్రభావం ఉంటుందనే విషయం వామపక్షానికి తెలియనిది కాదు. ఎందుకంటే మనలాంటి ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యతగల చిన్న ఉత్పత్తి రంగంపై దాడి జరిగితే వృద్ధి రేటు ప్రతికూలంగా ప్రభావితం అవుతుందని వేరే చెప్పనక్కరలేదు. అలాగే నోట్ల రద్దుతో శ్రామిక జనం కష్టనష్టాలకు గురవుతారని నయా ఉదారవాద చట్రంలో నుంచి విమర్శిస్తున్నవారికి తెలియదని, దాన్ని వారు పట్టించుకోవటంలేదనడం సరికాదు. అయినప్పటికీ దృష్టిని కేంద్రీకరించటంలోను,



వక్కాణింపు లోను ఈ రెండు విమర్శనా ధోరణుల మధ్య తేడాలున్నాయి. ఒకటి ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం ఉంటుందనే వాస్తవాన్ని ఎత్తిచూపుతుంటే, మరొకటి స్థూల జాతీయోత్పత్తి వృద్ధిపై ప్రతికూల ప్రభావం ఉంటుందని చెబుతుంది. ఒకటి ప్రజల స్థితిగతులపై దృష్టిని కేంద్రీకరిస్తుంటే మరొకటి వస్తు రాశుల పరిమాణం తగ్గుతుందని వాపోతుంది.

రాజన్ విమర్శ స్పష్టంగా రెండవ వర్గానికి చెందుతుంది. ఒకవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు పెరుగుతూ వుంటే నయా ఉదారవాద వ్యవస్థలో దానితో అనుసంధాన మైన భారత వృద్ధి రేటు పెరగటానికి బదులుగా మందగించిందనే వాస్తవాన్ని రాజన్ ఎత్తిచూపుతున్నారు. ఇలా జరగటానికి నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశ పెట్టటాన్ని కారణాలుగా ఆయన చెబుతున్నారు. ఉద్యోగిత పట్ల తనకున్న ఆందోళన వల్ల ఆయన వృద్ధి రేటు గురించి ఆందోళన పడుతున్నారు. అంటే ప్రజల గురించి ఆందోళన చెందు తున్నారు. భారతదేశం తాను ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను తగ్గించుకోవాలంటే వార్షికంగా 7 శాతం కంటే ఎక్కువగా వృద్ధిని సాధించాలి. అయితే నోట్ల రద్దు, జీఎస్‌టీల కారణంగా వృద్ధి రేటు అంతకంటే తక్కువగా నమోదయింది.

కానీ స్థూల జాతీయోత్పత్తి వృద్ధిపై తమ దృష్టిని కేంద్రీకరించటానికి కారణంగా నయా ఉదారవాదులు ఉద్యోగితను చూపటం అంతగా చెల్లదు. నయా ఉదారవాదం భారతదేశంలో ప్రవేశించటానికి ముందటి సంవత్సరాలలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు వార్షికంగా 3.5 నుంచి 4 శాతంగా ఉండేది. అలా ఉన్నప్పుడు ఉద్యోగిత వృద్ధి రేటు వార్షికంగా 2 శాతం ఉంది. అదే నయా ఉదారవాద పాలనలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు 7 శాతాన్ని మించి రెండు రెట్లు అయినా ఉద్యోగిత వృద్ధి రేటు 1 శాతంగా నమోదైంది. అంటే అంతకు ముందున్న ఉద్యోగిత వృద్ధి రేటులో సగమైందనే వాస్తవాన్ని ఈ వాదన గుర్తించటం లేదు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు పడిపోవటంపై ఆందోళన చెందటం ప్రజల కోసమేనని చెబుతున్నప్పటికీ వాస్తవంలో అది కేవలం దాని వృద్ధి రేటు అంటే వస్తువుల రాశి పరిమాణం గురించి ఆందోళన చెందటంగానే ఈ వాదన ఉంది. స్థూల జాతీయోత్పత్తి వృద్ధిని మాత్రమే పట్టించు కోవటమనేది నయా ఉదారవాద భావజాలంలో ఒక అంతర్భాగం. ఇది బడా బూర్జువా వర్గ ప్రయోజనాలకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఒకవేళ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి జాతి ప్రధాన లక్ష్యమైతే అటువంటి లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోయేవాడే నిజమైన దేశభక్తుడు. దాన్ని వ్యతిరేకించేవారు 'జాతి వ్యతిరేకులు'గా మారతారు. ఒక బూర్జువా సమాజంలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధికి కావలసిన మూల ధన సంచయం బాధ్యతను చేపట్టే బూర్జువా వర్గం ముఖ్యంగా బడా బూర్జువావర్గం జాతీయ వాదానికి వాస్తవంలో మూలవిరాట్టు అవుతుంది. మరోవైపు తమ జీవన ప్రమాణాలను కాపాడుకునేందుకు ఎక్కువ వేతనాల కోసం సమ్మెలకు దిగే, ఎక్కువ ధాన్య సేకరణ ధరల కోసం నిరసన ప్రదర్శనలు చేసే శ్రామిక జనం ఆర్థిక వ్యవస్థకు 'అంతరాయం' కలిగిస్తూ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటును దెబ్బతీసేవారిలా కనిపిస్తారు. కాబట్టి వారు 'జాతి వ్యతిరేక' చర్యలకు పాల్పడుతున్నట్టుగా కనిపిస్తారు.

కాబట్టి హాస్యాస్పదమైన విషయం ఏమంటే ఉద్యోగావకాశాలను పెద్ద ఎత్తున సృష్టించటం ద్వారా ప్రజా ప్రయోజనాలను ముందుకు తీసుకుపోతున్నామన్న పేరుతో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిపైనే దృష్టిని కేంద్రీకరిస్తూ ప్రజా పోరాటాలన్నింటినీ ఆమోద యోగ్యమైనవి కానివిగాను, అందుకు బదులుగా పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడికి ఇచ్చే అన్ని రకాల రాయితీలను ఆమోదయోగ్యమైనవిగాను చూపటం జరుగుతుంది. అలా కార్పొరేట్ ప్రయోజనాలను బహిరంగంగా ముందుకు తీసుకుపోవటం నాయబద్ధ మైనవిగాను ప్రజా పోరాటా లన్నీ న్యాయ విరుద్ధమైనవి గాను కనపడతాయి! విదేశీ పెట్టుబడులకు ఇచ్చే రాయితీలు కూడా 'జాతీయ ప్రాజక్టు', 'జాతి నిర్మాణం'లో భాగమై న్యాయబద్ధం అవుతాయి!

దీనిని మనం 'జీడీపీ జాతీయవాదం' అనవచ్చు. నయా ఉదారవాద శకంలో కీర్తించబడే జీడీపీని సంక్షుభిత కాలంలో మరింతగా బలోపేతం చేయటానికి హిందుత్వ మతతత్వంతో అనుసంధానం చేయటం జరిగింది. ఈ జీడీపీ జాతీయ వాదానికి సుదీర్ఘ గతం ఉంది. ఐరోపాలో 17వ శతాబ్దంలో ఆవిర్భవించిన, 18వ శతాబ్దంలో పైకి ఎగసిన బూర్జువా 'జాతీయవాదం'లో ఇది అంతర్భాగంగా ఉంది. వాణిజ్యశీల రచయితలే కాకుండా సంప్రదాయ రాజకీయ అర్థశాస్త్రానికి వ్యతిరేకులు (వీరిలో అనేకులకు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో సంబంధాలున్నాయి) కూడా అయిన రచయితలకు జీడీపీని పెంపొందించటంపై విభిన్న ఆలోచనలు ఉన్నప్పటికీ వీరు దాని బాధితులయ్యారు. 'ద వెల్త్ ఆఫ్ నేషన్స్' గ్రంథం

ఒకవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు పెరుగుతూ వుంటే నయా ఉదారవాద వ్యవస్థలో దానితో అనుసంధాన మైన భారత వృద్ధి రేటు పెరగటానికి బదులుగా మందగించిందనే వాస్తవాన్ని రాజన్ ఎత్తిచూపుతున్నారు. ఇలా జరగటానికి నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశ పెట్టటాన్ని కారణాలుగా ఆయన చెబుతున్నారు. ఉద్యోగిత పట్ల తనకున్న ఆందోళన వల్ల ఆయన వృద్ధి రేటు గురించి ఆందోళన పడుతున్నారు. భారతదేశం తాను ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను తగ్గించుకోవాలంటే వార్షికంగా 7 శాతం కంటే ఎక్కువగా వృద్ధిని సాధించాలి. అయితే నోట్ల రద్దు, జీఎస్‌టీల కారణంగా వృద్ధి రేటు అంతకంటే తక్కువగా నమోదయింది.

రచించటంలో ఆడమ్ స్మిత్ లక్ష్యం సంపదను పెంపొందించటం ఎలా? అనే మర్మాన్ని ఛేదించటమే. అలా పెంపొందించబడిన సంపద 'జాతీయ' లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని ఆయన భావించాడు. అయితే జాతి సంపద పరిమాణాన్ని పెంచినంత మాత్రాన దానితో శ్రమజీవుల పరిస్థితి మెరుగవుతుందనే గ్యారంటీ ఏమీ లేదని ఆయన విశ్లేషణ చెబుతోంది. ఈ విషయం గురించి స్మిత్ చెప్పిందే డేవిడ్ రికార్డో కూడా చెప్పాడు. వేరేమాటల్లో చెప్పాలంటే సంపద పెరగటం వాంఛనీయమే. సరిగ్గా దీనినే నేటి 'జీడీపీ జాతీయవాదం' సమర్థవంతంగా ప్రచారం చేస్తున్నది. ఇందుకోసం అది ఒక ప్రత్యేకమైన వర్గ వ్యూహాన్ని సమర్థిస్తున్నది. కార్మికులపై దాడి చేయటం, అంతర్జాతీయ పెట్టుబడితో అనుసంధానించబడిన కార్పొరేట్ -ఫైనాన్షియల్ వర్గాన్ని సంతృప్తి పరచటంగా ఈ వ్యూహం ఉన్నది.

ఇలా చెప్పటమంటే అర్థం ఈ 'జీడీపీ జాతీయవాదం' పాలక వర్గాల కుట్ర అనిగానీ లేక ఈ ఆలోచనను సమర్థించేవారంతా ఈ కుట్రలో పాలుపంచుకుంటున్నారని అన్నట్టు కాదు. ప్రజల మధ్య సంబంధాలపై కాకుండా వస్తువులపై దృష్టిని సారించేలా చేసే పరిస్థితిని వాస్తవంలో బూర్జువా సమాజం సృష్టిస్తుంది. వస్తువులకు మార్మికంగా మానవాతీత శక్తులు వస్తాయి. ఆ విధంగా ఉత్పత్తి సాధనాలకే మిగులును ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నట్టు కనపడుతుంది. కాబట్టి లాభాలు ఉత్పత్తి సాధనాలలోనే నిక్షిప్తమై వున్నట్టు అనిపిస్తుంది. దీనినే ఈనాటికీ బూర్జువా అర్థశాస్త్రం మనకు బోధిస్తుంది.

అంటే ఏ ప్రత్యేకమైన సామాజిక పరిస్థితుల, సామాజిక సంబంధాల నేపథ్యంలో ఉత్పత్తి జరుగుతుందో, జీడీపీ వృద్ధి చెందుతుందో పట్టించుకోకుండా కేవలం వస్తువులు పోగులు పడటం, అవి రాశులుగాపడే రేటుకు నిరుద్యోగిత, పేదరికం వంటి అన్ని సామాజిక సమస్యలను అధిగమించగల మార్మిక సామర్థ్యం ఉంటుందనే భావన కలగటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. వస్తువుల మధ్యవర్తిత్వం కారణంగా వ్యక్తుల మధ్యగల వాస్తవ సంబంధాలలో అస్పష్టత ఏర్పడుతుంది. అటువంటి అస్పష్టత కారణంగా సమాజంలోని వ్యక్తుల మధ్య ఉండే వాస్తవ సంబంధాలు మరుగున పడతాయి. ఆవిధంగా వస్తువీకరణ దోపిడీని సమర్థించే భావజాలాన్ని అందిస్తుంది. పెట్టుబడిదారుల లాభాలు ఉత్పత్తి క్రమంలో కార్మికుల శ్రమశక్తిని ఉపయోగించటం ద్వారా ఏర్పడిన మిగులు విలువను స్వాహా చేయటం వల్ల వస్తాయని కాకుండా ఉత్పత్తి సాధనాల అంతర్గత లక్షణాల కారణంగా వస్తున్నట్టు కనపడుతుంది. సరిగ్గా ఇదేవిధంగా వస్తువులకు మార్మికశక్తులను ఆపాదించే 'జీడీపీ జాతీయ వాదం' సమాజాన్ని బడా బూర్జువా వర్గానికి అత్యంత అనుకూలంగా మార్చటానికి కావలసిన భావజాలపరమైన సమర్థనను అందిస్తుంది. కాబట్టి దీనితో అర్థమయ్యేదేమంటే మోడీ ప్రభుత్వం చేసిన నోట్ల రద్దుకు వ్యతిరేకంగా వచ్చిన విమర్శలన్నింటినీ ఆహ్వానించి తీరాలి. అయితే నోట్ల రద్దుతో వస్తువుల రాశుల పరిమాణం వృద్ధిపై ప్రతిబంధకాలు ఏర్పడ్డాయనే నయా ఉదారవాద విమర్శకు, దానితో దోపిడీ తీవ్రతరం అవుతుందనే వామపక్ష విమర్శకు మధ్యగల తేడాను ఎన్నడూ విస్మరించ కూడదు.

జనవాక్యం

శ్వేత పత్రంలో చోటు లేదా?

గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న ఆంగ్ల మాధ్యమ ఆదర్శ పాఠశాలలు, వీటికి అనుబంధంగా నడుస్తున్న బాలికల వసతి గృహాలకు సంబంధించిన అంశాలను శ్వేత పత్రాలలో పొందుపరచలేదు. రాష్ట్రంలో ఇబిబి (ఎడ్యుకేషన్ బ్యాక్‌వార్డ్ బ్లాకు)లుగా గుర్తించిన అన్ని ప్రాంతాల్లో ఆదర్శ పాఠశాలలు నిర్మించాలన్న ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రద్దు అయ్యింది. దీంతో అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వమే పాఠశాలల నిర్వహణకు నిధులు అందించాలి. ఈ నేపథ్యంలో మోడల్ పాఠశాలల నిర్వహణపై, ఇందులో పని చేస్తున్న రెండు వేలకు పైగా రెగ్యులర్ సిబ్బందిపై ప్రభుత్వమే విధానపరమైన నిర్ణయం ప్రకటించాలి. ఈ ఆంగ్ల మాధ్యమం సెకండరీ పాఠశాలల భవిష్యత్తుపై కమిటీ ఏర్పాటు చేసినా సిఫార్సుల అమలులో జాప్యం జరుగుతోంది. తక్షణం ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి.

బి సురేశ్, శ్రీకాకుళం జిల్లా .

ఏ కాలంలో వున్నాం?

ఇటీవల బాపట్లలో 18 మంది 10 అడుగుల గోయి తీసుకుని, అందులో కూర్చుని మూత వేయించుకొని గంటన్నర తర్వాత, తీసివేయించుకున్నారట! ఏ కాలంలో వున్నాం మనం? పూర్వం మునీశ్వరులు శాపాలు పెట్టేవారు, ఒక చోట నుండి మరో చోటికి ఎగిరి పోయేవారు, శత్రువులను కుక్కగానో నక్కగానో శపించేవారు, మంత్రాలు, మహిమలు, మాయల ఫకీర్లు, పాల సముద్రాలు, పెరుగు సముద్రాలు, ధ్యానంతో నీళ్ల మీద నడవటం, గాల్లో ఎగరటం వంటివి చదివి చదివి మన బుర్రలు ఆ ఊహాగానాల్లో వున్నాయి. అంతే తప్ప, అందులో ఎటువంటి శాస్త్రీయత లేదన్న వాస్తవాలను గమనించడం లేదు. అందులో నుండి బయట పడడం లేదు. నిజంగా మంత్రాలు, మహిమలు, అతీంద్రియ శక్తులు ఉండి ఉంటే దేశం మీదికి విదేశీయులు దండయాత్రలు చేస్తున్న సమయంలో వీరంతా మంత్రాలు చదివితే సరిపోయేది కదా! శత్రువులు పారిపోయే వారు! మరి అలా ఎందుకు చెయ్యలేదు! మంత్రాలున్నాయని చెప్పే వారు కొంచెం బుర్ర పెట్టి అలోచించండి. చిరంజీవులుగా ఉండేందుకు, ఎక్కువ కాలం బతికేందుకు ధ్యానం, యోగా అంటూ కొంతమంది ప్రచారం చేస్తూ వుంటారు. ప్రజలను వేద కాలంలోకి నెట్టివేసే కుట్రలో భాగమే ఇదంతా! ఇటీవల బాపట్లలో జరిగిన ధ్యానం గుంటలు కూడా అటువంటిదే! ఎవరి వద్ద ఎలాంటి మహిమలూ ఉండవు. సైన్సు సూత్రాలకు విరుద్ధంగా ఏమీ జరగదు. హేతువాద ఆలోచన ఒక్కటే ఈ మూఢ నమ్మకాలకు విరుగుడు.

నార్నె వెంకట సుబ్బయ్య, ఏపి హేతువాద సంఘం.

తెర పైకి గడ్కరీ?

కామెంట్



అరుణ

ఒకప్పటి బిజెపి అధ్యక్షుడు, నేటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగపూర్‌కి చెందిన రాజకీయ నాయకుడు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని దాని కనుసన్నల్లో మసలుకునే వ్యక్తి. అయితే ఈయన ఈ మధ్య వార్తల్లో ఎక్కువగా ఉంటున్నారు. ఇటీవల ఆయన చేసిన రెండు ప్రకటనలు టీవీల్లో, పేపర్లలో వార్తలుగా బాగా పేలాయి. అవేంటో చూద్దాం. మొదటిది పూణేలో బ్యాంకు ఉద్యోగుల కార్యక్రమంలో మాట్లాడుతూ 'విజయానికి అందరూ తండ్రులే అదే సమయాన పరాజయం అనాథ. నాయకత్వం ఓటమిని స్వీకరించాల్సి ఉంటుంది' అన్నారు. దీంట్లో ఏముంది ఓ ఇంగ్లీష్ సామెతను మరాఠీలో పలికేసారు అనుకోవచ్చు. కాకపోతే టైమింగ్‌లో వుంది తమాషా. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల తర్వాత ఆయన ఈ మాటలు అన్నారు. అంతటితో ఆగక 'ఇంటలిజెన్స్ బ్యూరో ప్రధాన అధికారుల' సమావేశంలో స్వరం ఇంకా పెంచి మాట్లాడారు. 'నేను పార్టీ అధ్యక్షుడిననుకోండి నా నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు సక్రమంగా పని చేయలేకపోతే ఒక అధ్యక్షుడిగా నేను వారికి సరైన మార్గనిర్దేశం ఇవ్వనట్టే' అన్నారు. అంతే కాదు వినేవాళ్ళు సొమ్మసిల్లి పడిపోయేలాగా 'భారతీయ సంస్కృతిలో సహనానికి ముఖ్య పాత్ర వుంది... సహనం భారతీయ సమాజ సంతకం వంటింది. జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ ఐకాన్. 'తాను దేశానికి సమస్య కారాదని ప్రతి వ్యక్తీ భావించాలి' అని అన్నారు. నేను నెహ్రూ చెప్పిన మాట నమ్ముతా! నిజమే కదా. మనం నెహ్రూ చెప్పినట్టు ఒక సమస్యగా మారి సమస్యలు సృష్టించక పోతే సగం సమస్యలు తీరిపోతాయి' అని పలికారు.

ఇన్నాళ్లు గమ్మునున్న నితిన్ గడ్కరీ ఇలా చకచకా మాట్లాడుతున్నారంటే లోక్‌సభ ఎన్నికల కసరత్తును, ఆర్‌ఎస్‌ఎస్ మరింత ముమ్మరం చేసిందన్నమాట! నితిన్ గడ్కరీ ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? అనేది మొత్తం ఆర్‌ఎస్‌ఎస్ ప్లాన్ చేసినట్లు కనబడుతున్నది. ఇలా ఎందుకనిపిస్తున్నదంటే ఆర్‌ఎస్‌ఎస్ ఒక రహస్యాల పుట్ట. దాని లోగుట్టు బయటకి రావటం కష్టం. అటువంటిది అక్కడి నుంచి ఇటీవల ఒక నాయకుడు రాసిన లెటర్ మీడియాకి దొరికింది. ఆ లెటర్‌లో వున్న విషయాలు వార్తలుగా టీవీల్లో, పేపర్లో వచ్చాయి కూడా! ఇదంతా ఏదో ఆషామాషీగా జరిగిపోతున్నాయి అనుకుంటే... పొద్దున్నే పార్కుల్లో పెద్దగా 'హహహ నవ్వుల వ్యాయామం చేసే వారి మాదిరిగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు 'భలే బురిడీ కొట్టించాం' అనుకుని మనల్ని చూసి అదనంగా మరో నాలుగు హహహ నవ్వుల వ్యాయామం చేస్తారు.



మోడీని ప్రతిపక్ష పార్టీ తిట్టి.. సొంతవాళ్ళు ఛీ కొడితే.. ఏమో ఎవరికి తెలుసు ప్రజల్లో సానుభూతి పండొచ్చు.. అప్పుడు గత ఎన్నికలలో వచ్చినన్ని సీట్లు రాకపోయినా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. అటుపై ఎన్నికల అనంతరం పొత్తులకై పనికొచ్చే 'న్యూట్రల్ ఫేస్' నితిన్ గడ్కరీని చూపొచ్చు అని ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచిస్తున్నట్లు కనిపిస్తున్నది.

ఇంతకీ ఆ ఉత్తరం రాసింది ఎవరు, దాన్లో ఏముందో చూద్దాం. కిషోర్ తివారీ ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు. అంతే కాదు ఈయన్ను అట్టడుగు కార్యకర్తలతో మంచి సంబంధాలున్న రైతు నాయకుడుగా పరిగణిస్తారు. మహారాష్ట్రలో మంత్రి హోదా కలిగిన కిషోర్ తివారి ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్‌కి, ప్రధాన కార్యదర్శి భయ్యాజీ సురేష్ జోషికి, ఒక లేఖ రాసారు. అందులో వున్న కీలకమైన అంశాలు ఇలా వున్నాయి.. 'నిరంకుశ పోకడలతో పార్టీకి నష్టం చేసిన, చేస్తున్న అమిత్ షా, మోడీలను వదిలించుకుని 2019 ఎన్నికల బరిలో దిగాలి. చరిత్రలో కూడా నిరంకుశ నాయకులని చూసాం, అటువంటి నాయకులని నెత్తికెత్తుకుంటే నష్టం. మోడీ, అమిత్ షా నిరంకుశ ధోరణితో తీసుకున్న నిర్ణయాల వల్లే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఓడిపోయామని రాస్తూ.. నితిన్ గడ్కరీ పీఎంగా రాణిస్తారు అని కూడా రాశారు. ఏళ్ల తరబడి గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన మోడీ ఎలాంటివారో ఆర్‌ఎస్‌ఎస్‌కి తెలియదా? గత ఎన్నికలప్పుడు 'హర్ హర్ మోడీ... ఘర్ ఘర్ మోడీ' అని తన కార్యకర్తలతో హోరెత్తించలేదా? మరి ఇప్పుడెందుకు ఈ విమర్శనా లేఖలు. నితిన్ గడ్కరీ సెటైర్లు... అంటే వ్యక్తి ఆధారిత రాజకీయంతో అయినా అధికారంలోకి రావాలి అనుకున్నారు. అందుకే 56 అంగుళాల ఛాతీ వున్న హిందూ పరిరక్షకుడు మోడీ అని 2014 ఎన్నికల్లో ఆకాశానికెత్తారు. అయితే ప్రజలు మోడీకి ఓటేసింది కేవలం తమ ధర్మ పరిరక్షణ చేస్తారని కాదుగా, పదేళ్ల కాంగ్రెస్, సామాన్యుడి ఆకాంక్షలను అందుకోలేదు. అందుకని మార్పు కోరిన ప్రజానీకం బిజెపికి ఓటు వేసింది. అయితే నోట్ల రద్దుతో సామాన్యుడిని పెనం మీది నుంచి పొయ్యిలో పడేసారు మోడీ. ఇప్పుడు ఐదేళ్ళ తర్వాత ఆయన మెరుపు, వన్నె తగ్గింది. అంతేకాదు హిందుత్వ రాజకీయం కోసం ఉత్తరప్రదేశ్‌లో గత ఏడాది నూటా తొంబై ఐదు మత ఘర్షణలు చేయించినా... అయోధ్య, ఢిల్లీలో ధర్మసభలు ఏర్పాటు చేసుకున్నా... మూడు రాష్ట్రాల్లో ఓట్ల పంట పండలేదు. అవును మరి మనుషుల్ని చంపి గోవుల్ని కాపాడితే... పాపం గోవులకు ఓటు హక్కు లేక ఆ ఎన్నికల్లో బిజెపి ఓడిపోయింది. అటు మోడీ చరిష్మా తగ్గుతూ, నమ్ముకున్న మత విద్వేష రాజకీయం ఎన్నికల వేళ అవసరమైన ప్రజా మద్దతు ఇవ్వడం లేదు. మరో వైపు ఇదే అదను అనుకుని కాంగ్రెస్ రాజకుమారుడు 'చౌకీదార్ చోర్ హై' అని గర్జిస్తున్నాడు. ఇట్లాంటప్పుడు మోడీని ప్రతిపక్ష పార్టీ తిట్టి.. సొంతవాళ్ళు ఛీ కొడితే.. ఏమో ఎవరికి తెలుసు ప్రజల్లో సానుభూతి పండొచ్చు.. అప్పుడు గత ఎన్నికలలో వచ్చినన్ని సీట్లు రాకపోయినా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. అటుపై ఎన్నికల అనంతరం పొత్తులకై పనికొచ్చే 'న్యూట్రల్ ఫేస్' నితిన్ గడ్కరీని చూపొచ్చు అని ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఆఆ.. తూచ్ అనిపిస్తున్నదా.. ఏమో మరి.. నాకైతే పొద్దున్న పార్కుల్లో ఖాకీ నిక్కర్ల వ్యాయామ నవ్వులకి బలి కావాలని లేదు సుమా. బహుశా అందుకే ఈ అనుమానాలన్నీ బుర్రలోకి వస్తున్నాయి. అరె...అరె.. చెప్పటం మర్చిపోయా.. నితిన్ గడ్కరీ కలర్స్ టీవీ షోలో బాలీవుడ్ నటుడు నానా పటేకర్‌తో మరాఠీలో 'ఎన్నికలపై వేసిన సూపర్ జోక్' (మీడియాలో అంతగా రాలేదనుకుంటా).. నానాపటేకర్‌తో ఉల్లాసంగా పక పక నవ్వుతూ నితిన్ గడ్కరీ ఇలా జోక్ వినిపించారు. 'ఎన్నికలప్పుడు నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తాం. ఎందుకంటే పక్కాగా ఎన్నికల్లో గెలుస్తామన్న గ్యారంటీ ఏం లేదు. ఒకవేళ అనుకోకుండా అధికారంలోకి వచ్చామా.. అప్పుడు ఏదో ఒక విధంగా సర్దుబాటే చేయొచ్చు' జోక్ పూర్తి అయ్యాక నానాపటేకర్, నితిన్ గడ్కరీ పొట్టలు కదిలిపోయేలా నవ్వుకుంటూ కనిపించారు. మీకూ నవ్వొస్తే నవ్వుకోండి.

(రచయిత సెల్ : 9810093581)

సోషల్ మీడియా

బ్యాంకుల్లో మోసాలు

ఆర్‌బీఐ తాజా గణాంకాల ప్రకారం బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలు 72 శాతం పెరిగాయి

- 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 23,933 కోట్ల మేర బ్యాంకులు మోసపోగా.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 41,167 కోట్లకు పెరిగింది.

- పంజాబ్ నేషనల్ బ్యాంకులో వెలుగు చూసిన కుంభకోణం యావత్ బ్యాంకింగ్ రంగంలోనే సంచలనం సృష్టించింది

- పీఎన్‌బీ కుంభకోణం వల్లే మోసాలు విలువ అమాంతం పెరిగింది.

- 2016-17లో బ్యాంకింగ్ రంగంలో 5,076 మోసం కేసులు నమోదవ్వగా 2017-18లో 5,917కు పెరిగింది

- 93 శాతం కేసుల్లో ప్రభుత్వరంగ బ్యాంకులే మోసపోయాయి.

ఇదేం జన్ ధన్?



10 కోట్ల మంది ఖాతాలు వాడుకలో లేవు

ఖాతాల్లోకి జనం సొమ్ము రూ. 85 వేల కోట్లు

- మోడీ సర్కార్ చేకూర్చిన జన్‌ధన్ యోజన పథక లబ్ధి మాత్రం కేవలం రూ. 340 కోట్లు

- రూ. 33 కోట్ల జన్ ధన్ ఖాతాదారుల్లో ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా 30 లక్షల మందికి మాత్రమే లబ్ధి

- ఖాతాదారుల ద్వారా బ్యాంకులకు చేరింది రూ. వేల కోట్లు

- ప్రజలకు దక్కిన లబ్ధి వందల కోట్లు

- విదేశాల్లోని నల్లధనం తెచ్చి..ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. -15 లక్షలు వేస్తామన్న బీజేపీ సర్కార్ చేతులెత్తేసింది

- యూపీలో జన్ ధన్ ఖాతాదారులు వేసుకున్న సొంత సొమ్ము రూ. 14, 882 కోట్లు

- పశ్చిమబెంగాల్‌లో రూ. 11,470 కోట్లు

- బీహార్‌లో రూ. 8,417 కోట్లు

- రాజస్థాన్‌లో రూ. 6,360 కోట్లు

- మహారాష్ట్రలో రూ. 5,035 కోట్లు

- మధ్యప్రదేశ్‌లో రూ. 4, 325 కోట్లు జమయ్యాయి.



ప్రజాశక్తి
jeevanapageps@gmail.com
విజయవాడ మంగళవారం 1-1-2019 5
జీవన the far



పయనపు దారుల్లో.. కొత్త.. కొత్తగా..!!



కేవలం మనుషుల మధ్య సంబంధాలు మాత్రమే.. మనిషుల్ని శక్తివంతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దలేవు. ఇంకా మనల్ని ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉంటాయి. అవి కళాత్మకంగా ఉంటాయి. చెట్లులా పచ్చగా ఉంటాయి. మనవెంటే ఉంటూ.. గువ్వపిట్టలా సవ్వడిచేస్తుంటాయి. వానచినుకులా వొళ్ళంతా తడిసేలా, తడిపేలా చేస్తాయి. మనం నడిచివెళ్తున్న దారుల్లో.. కనిపించే పచ్చని గడ్డిపరకల్లోనూ. మనల్ని పలకరిస్తున్న.. ఏదో పలకరింత ఉందేమో.. కాస్తంత ఆగి చూడాలి. అలా ప్రకృతిలో ఊగిసలాడుతూ మనల్ని పచ్చగా పలకరించే పలకరింతనూ అందుకోగలగాలి. తేరిపారా చూడగలిగితే చుట్టూ ఉన్న ప్రపంచమంతా ఓ కళాత్మకమే.

కొత్త సంవత్సరపు సందర్భం అందరికీ ఉత్సాహభరితం. గడిచిన కాలాన్ని గుర్తు చేసుకుంటూనే రేపటి కోసం.. కొత్త లక్ష్యాలను ఏర్పరచుకుంటాం. అలా అనుకున్నవాటిని కొంగ్రొత్త సంవత్సరాన ఆచరణలో పెట్టాలనుకుంటాం. ఇలా చేసే ఆలోచనలో.. వ్యక్తిగత ఉన్నతికోసం.. అవి నెరవేరడం కోసం అనేక ప్రణాళికలు వేసుకుంటాం. వాటితోపాటు.. సమాజ హితమూ మనకు అవసరమే. ప్రస్తుతం స్మార్ట్ సంస్కృతిలో పయనిస్తున్న మనమధ్య అంతకంతకు అనుబంధాలు బలహీనపడుతున్నాయి. ప్రేమపూర్వక పలకరింతలూ పలచబడిపోతున్నాయి. వ్యక్తిగత లక్ష్య ఛేదనలో సమాజాన్ని వదిలేసి.. ఒంటరి దారిపడుతున్నాం. కానీ మానవుడు సంఘజీవి. సమిష్టితత్వం ఉంటేనే .. వ్యక్తి అయినా.. మహాశక్తిగా మారగలడు. పరుల కష్టాన్ని అర్థం చేసుకోగలడు. సమస్యలపై పోరాడగలడు. కొత్తదనం అంటే ఇదే.. మనం సంతోషంగా బతుకుతూనే.. చుట్టూ ఉన్న ప్రపంచమూ సంతోషంగా ఉండాలి అనుకోవడం. మన పరిధిలోనే అందుకు కృషి చేయడం. అందుకే.. కొంగ్రొత్త వేళ.. మనం వేసే ప్రతి అడుగులోనూ .. 'నువ్వూనేను.. కాదు మనం మనందరం' అనే అర్థవంతమైన మార్పును ఆహ్వానించుకుందాం! చేయి..చేయీ కలిపి.. కలిసి నడుద్దాం!!

మనిషి జీవిత గమనం ఓ కవాతులాంటిది. సరిగ్గా మీటర్లో అమరినట్టుగా.. నడక రిథమిక్ (లయ)గా సాగాలి. అలా సాగాలంటే.. కాలం కలిసిరావాలి. ఇక్కడ కాలం కలిసిరావడం అంటే.. ఎవరో పైనుంచి వరాలు జల్లడం కాదు. కాలంతో పోటీపడుతూ.. పరుగులు పెట్టాలి. అలా పరుగులు పెట్టాలంటే.. రబ్బరుతిత్తిలాంటి మనిషిలో.. శక్తి, యుక్తులు ఉండాలి. అవి మెండు, నిండుదనంతో ఉండాలి. శక్తి అంటే.. ఎవరో బూటకపు బాబాలు ప్రసాదించే అతీంద్రియ శక్తులు కాదు. ఆరోగ్యంగా ఉండటం. శరీరం ఆరోగ్యంగా ఉంటేనే.. మనసూ అంతే ఆరోగ్యంగా సంచరిస్తుంది. మనల్ని చేయిపట్టి మరీ కావాల్సిన దారిలో నడిపిస్తుంది. ఇవన్నీ చెప్పుకోడానికి పాత విషయాలే అని అనుకున్నాగానీ.. ఇందులోనే అసలు సిసలైన కొత్తదనం దాగి ఉంది. అందుకే.. మనల్ని మనం తీర్చుదిద్దుకోగల ఆయుధ సామగ్రితో కొత్తగా సిద్ధం కావాలి. కొత్త అంటే.. మరేంకాదు.. మనలో దాగిన నిధి నిక్షేపాలను వెదికి పట్టుకోవడమే.

కాలగమనంలో ...


అసలు.. మనిషిని తక్కెడలోపెట్టి.. జీవితపు విలువల్ని తూకం వేసేది.. ఒకరకంగా కాలమే. అలాంటి కాలపు పయనంలోనే మన ఉనికి తెలిసేది. గడిచిన కాలమూ అలాంటిదే. వెనక్కి తిరిగి చూసుకుంటే 'ఇదిగో.. నీవు ఇలా..' అని కాలమే మనకు.. మన గురించి లెక్కలు కట్టి మరీ చెప్తుంది. అలా గడిచిన కాలచక్రంలో మన తూకమెంత? అనేది మనకు తెలియాల్సిన మొట్టమొదటి సింహావలోకన సూత్రం అదే!

నిజానికి కాలంతో పరుగెట్టడం ఎవరికీ సాధ్యంకాదు. కానీ, కాలగమనంలో మనం పోషించిన పాత్ర గమనాన్ని లెక్కించుకోవడానికి ఇదే సరైన సమయం. నిన్నటి రోజున.. అంటే గడిచిన ఏడాదిలో కాలపు కొలమానంలో మనం ఏమిటి? అని బేరీజు వేసుకున్నప్పుడే.. అనేకానేక జవాబులు కచ్చితంగా దొరుకుతాయి. జీవితంలో విజయాలను అందుకునే ఏ వ్యక్తిని పలకరించినా.. కాలంతో ఎదురీదుతూ.. తన లక్ష్యాన్ని సాధించినవారే. అంటే.. సెకను కాలాన్ని సైతం వృథా కానివ్వకుండా.. ఒక ప్రణాళికా బద్ధంగా వినియోగించుకోవడం వల్లనే వారి లక్ష్యాలు నెరవేరాయి. ఇక్కడ లక్ష్యం అంటే.. సంకల్పం కావొచ్చు. వ్యక్తిగతమైన బాధ్యతలూ కావొచ్చు. లక్ష్యం సాధించడం అంటే.. దేశానికి రాజు అవ్వడమో, లక్షల కోట్ల టర్నోవర్ గల కంపెనీకి బాస్ అవ్వడమో కాదు.. సానుకూలమైన దారిలో వెళ్ళగలగడమే. లక్ష్యానికి అనేక రూపాలు ఉంటాయి. ఎవరి లక్ష్యం వారిది. అవన్నీ సవ్యంగా, సరైన దారిలో, గాడిలో పడాలంటే కాలం వృథా కాకూడదు. వృథా అనే మాటకు చాలానే అర్థాలు ఉంటాయి. కానీ, ఒక రోజులోగల ఇరవై నాలుగుగంటల కాలాన్ని.. ఎలా విభజించుకుంటున్నాం? ఎలాంటి విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామనేది.. బేరీజు వేసుకోవడమే. ఉదాహరణకు.. రోజుకు ఒక అర్థగంట సేపు.. ఏదైనా ఒక కొత్త అధ్యయనం కోసం, విద్య నేర్చుకోవడం కోసం, అభిరుచిగల ఏదైనా ఒక కళ సాధన చేయడం కోసం కేటాయిస్తే.. కొన్నాళ్ళకు ఆ రంగంలో నైపుణ్యం సాధించవచ్చు. అలాంటి కాలపు విలువను.. సోషల్ మీడియాలాంటి మాధ్యమం ఎంతగా కబళిస్తుందో.. ఎవరికివారే నిజాయితీగా బేరీజు వేసుకోవాల్సిన ప్రశ్న. మనకుగల కాలాన్ని ఎలా ఖర్చు చేస్తున్నాము.. అనేదానికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే! మనిషి మేధస్సు, శ్రమ విలువను కాలమే నిర్ణయిస్తుంది. అందుకే.. జీవితంలోని ప్రతి నిముషాన్నీ ప్రేమించాలి. సానుకూలంగా మలచుకోవాలి. అప్పుడే నెగ్గగలిగేది. ఇక్కడ నెగ్గడం అంటే.. పైపై మెరుగులు, కీర్తికిరీటాలు, బ్యాంకు బ్యాలెన్సులు కూడబెట్టుకోవడం లాంటి వ్యక్తిగత ఆస్తులు, ఆసక్తులు కాదు. శ్రమైక జీవనపు స్పర్శను స్వీయానుభవంతో దక్కించుకోవడం.

స్నేహం.. సమానత్వం

కంప్యూటర్ యుగం నుంచి స్మార్ట్ టెక్నాలజీ రోజుల్లో గడుపుతున్న నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ అంతకంతకూ యాంత్రికమవుతున్నాయి. చేతిలో విజ్ఞానాన్ని పంచే పుస్తకాలు పోయి.. స్మార్ట్‌ఫోన్లే అలంకారాలుగా మారాయి. ఈ స్మార్ట్ సంస్కృతిని అలంకారంగా అభివర్ణించే కంటే మానవ సంబంధాలను అంతకంతకూ బలహీనపరిచే గుదిబండలయ్యాయనే చెప్పాలి. దీంతో కుటుంబ సంబంధాల్లో లెక్కలేనన్ని మార్పులు. నలుగురు ఒకచోట కూర్చున్నాగానీ.. 'ఏవండీ బావున్నారా?' అని మనసారా పలకరించుకోలేని ప్రేమ, అప్యాయతలు కరువయ్యాయి. ఎంతగా అంటే.. ఒకే ఇంట్లో ఉండే భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, ఒకే ఆఫీసులో పనిచేసే స్నేహితులు . ఎదురెదురుగా కూర్చుని ఉన్నాగానీ.. కనీసం తలెత్తి చూసుకోలేనంత 'స్మార్ట్'గా మారిపోయాం. మనుషుల మధ్య, వ్యవస్థ, సమాజం ఇలా దేశంలోని విభిన్న మతాల, కులాల, జాతుల మధ్య అనుబంధాలు బలపడాలంటే.. రోజురోజుకీ కొని తెచ్చుకుంటున్న యాంత్రికత నుంచి తక్షణం బయటపడాలి. మన మధ్య కరువైపోతున్న పలకరింతలు, కరచాలనాలు, స్నేహాలు మరింత పరిమళించాలి. 'స్మార్ట్' దారుల్ని పక్కనపెట్టి ఒకరి మధ్య ఒకరి కోసం అన్నట్టుగా మన మధ్య కలుపుగోలుతనం పెరగాలి. అప్పుడే సమాజ శ్రేయస్సు. వ్యక్తిగత ఉన్నతితోపాటు.. సమాజంలోని వర్తమాన, రాజకీయ అంశాలపైనా స్పృహ ఉండాలి. సమాజాన ప్రజ్వరిల్లే నిరంకుశ, అమానుష సంఘటనలపై స్పందించాలి. అవసరమైతే పోరాడేందుకూ సిద్ధపడాలి. ఇవన్నీ కొత్త మార్పుకు సంకేతాలే.





అభిరుచి.. ఓ ఆలంబన

మనిషి సంఘజీవి. సామూహికమైన జీవన గమనంలో గడ్డిపరకల్లోనూ...

యాంత్రికమైన జీవితంలో లయ ఉండాలంటే.. మనం ఒంటరిగా ఉన్నాగానీ.. మనలోనే మన మనసులో వందలాది మంది జనసమూహం నిండాలి. అందుకోసం నచ్చిన పాటగా మారాలి. మెచ్చే ఆటగానూ ఆడాలి. దీనికి వయసు అడ్డేంకాదు. రవీంద్రనాథ్ టాగూర్‌లాంటి వారే.. అరవై ఏళ్ళు దాటాక కూడా చిత్రలేఖన విద్య నేర్చుకుని, ప్రపంచం మెచ్చే గొప్ప గొప్ప చిత్రాలు గీశారు. శంకర్ మహదేవన్‌లాంటి గొప్పగాయకులూ నలభై ఏళ్ల దాటాకనే వెండితెరపై బ్రహ్మాండంగా మారుమోగారు. ఇలా కొత్తగా ఉండాలంటే.. కొత్త కళాభిరుచుల్నీ ఆహ్వానించుకోవాలి. అందుకు మన రోజువారీ జీవితంలోని కాస్తంత సమయాన్ని పెట్టుబడిగా పెడితే చాలు.

రేపటి రోజు బాగుండాలి అంటే.. ఈ రోజు బాగుండాలి. బాగు.. అంటే మనం ముందుగా అనుకున్నట్టు.. సమయపు విలువతోపాటు ఆరోగ్యం, జీవితపు అభిరుచులూ కొత్తగా మెరవాలి. మనలోని మనల్ని మెరుగులు దిద్దుకోవాలి. మనతో కలిసి నడుస్తున్న ప్రతివ్యక్తి మోములోనూ చిరునవ్వు చూడగలిగితే అంతకంటే.. కొత్తదనపు ఆనందం ఇంకేముంటుంది? మనసు ఉంటే మార్గం ఉంటుందన్నట్టు.. వెదికి చూస్తే.. మన పయనపు దారుల్లో నిత్యం కొత్తదనమే.

హ్యాపీ న్యూ ఇయర్!!

- గంగాధర్ వీర్ల

కొత్తగా పరిచయించమని...!

అందరూ
కొత్తగా సరికొత్తగా
పరిచయం చేస్తుంటారు నిన్ను
అదేమిటో నువ్వెప్పుడూ
పాత పరిచయమే మాకు
నీలో కొత్తదనమేముందో
మాకెపుడూ పరిచయం చేయలేదే
నువ్వు!

అవే కన్నీళ్లు
అంతే ఉప్పగా ఉన్నాయి
నిన్నటి ఆశలన్నీ
ఇంకా గొంగళి
పురుగుదశలోనే
ఉన్నాయి
సీతాకోక చిలుకలైనా
తోటను దర్శించనే లేదు

పాదాల కింద పల్లేరు
కాయల బాటే
మెత్తని తివాచీలు పరిచిందెవరని?
అప్పుల ఊబులూ ఆత్మహత్యలూ
రైతు పొలం అన్నంగా
మారిందెప్పుడని?
పెరిగిన ధరలూ పెచ్చరిల్లుతున్న
హింస
సామాన్యుడింటి మీద ప్రశాంత
కోకిల కూసిందెప్పుడనీ?
అవినీతి అక్రమాలు అభద్రతా
శకలాలు
నిర్బంధాల నీలి నీడలూ
దేశం ఠీవిగా
నడిచిపోయిందెప్పుడనీ?

పూలమొగ్గలు విరిగిపడుతున్న
చప్పుడేమైనా ఆగిందా?
తప్పిపోయిన గొర్రె పిల్లలు
ఇంటికి చేరిన ప్రశాంతతేమైనా
కంటిని తుడిచిందా?
మాయ పొరలు కమ్ముకున్న
సమాజం
మసక చీకటి ప్రయాణంలో
ఒంటరి దగ్ధ గీతమై రగులుతూనే
ఉంది!

అంతటా ప్లాస్టిక్ తనాలు కృత్రిమ
రంగులూ
అవసరాల పాములూ
గోడమీది పిల్లులూ గుండెకు
చిల్లులూ మాటల పొల్లులూ
మొత్తంగా
మానవ సమూహాల పూల
తోటలెక్కడివి?
మనుషులంతా కలిసి చరించే
వసంతాల పూబాటలెక్కడివి?



మా ఊరి చివరి గుడిసెల్లో
నువ్వు దీపమై వెలిగిందెప్పుడని?
మా చెమట చుక్కల సముద్రంలో
నువ్వో పూల పడవయి
తిరిగిందెప్పుడనీ?
మా ఆకలి పేగుల్లో నువ్వన్నం
ముద్దయి ఒదిగిందెప్పుడనీ?
కొత్తగా నువ్వొచ్చినప్పుడయినా
మా పొయ్యిలో పిల్లి
లేచిందెప్పుడనీ?

అందరిలా మేమూ
ఆశగానే చూస్తాం నీ వైపు
ఎప్పుడూ కనని కలలని కూడా
రెప్ప మూయని కనుల కింద
కంటూనే వుంటాం మేము కూడా
కానీ,
నువ్వెప్పుడూ మాకు పాత
పరిచయమేగా!
కొత్తగా పరిచయించమనే
మేము యుగాలుగా
ఎదురుచూసేది!

- చిత్తలూరి, 82474 32521


నీవే కొత్త క్యాలెండరు



ఇంకా పాత కవితనే
ఏం చెక్కుతుంటావు కాని
కొత్త కవిత మొదలెట్టు
గుండెలో నీ దిష్టిబొమ్మలు తీసేసి
దేశాన్ని దేవతగా నిలబెట్టు...
అదే పనిగా అదే రాయిని
నువ్వెన్నాళ్ళు చెక్కినా శిల్పం కాదు
ఒకసారి పల్లె వెళ్లిరా
సజీవ శిల్పాలు చూసిరా!
కొత్త క్యాలెండరును
చంకలో పెట్టుకొని ఏం ప్రయోజనం!
కృషిని నీ గుండెలో నాటాలి!
అది ప్రపంచం కోసం మంచి పంట పండాలి...
అప్పుడు నీవే ఓ కొత్త క్యాలెండరు
అప్పుడందరూ నిన్నే
బతుకు గోడమీద ఎదురుగా పెట్టుకొని
జాగ్రత్తగా చూసుకుంటారు,
నిత్య స్మరణ చేసుకుంటారు.

- డాక్టర్ రావి రంగారావు, 92475 81825

శతాబ్ది కలలు



అవును నిజం! ఇది విన్నారా?
చిట్టెలుకలు గర్జిస్తున్నాయి
చూశారా లేదా? ఏనుగులు రెక్కలు కట్టుకుని
గాలిలో ఎగురుతున్నాయి
గాండ్రించే పులులు గడ్డి మేస్తున్నాయి
చెట్లు నేలనొదిలి
నింగి అంచుల నుంచి పెరుగుతున్నాయి
సీతాకోకచిలుకలు తిమింగిలాలై
సముద్రాల నేలుతున్నాయి
అనంతపురం జైసల్మేర్ వెనుక స్థానాన్ని
ఎప్పుడో వదిలేసింది!
అమాంతం కృష్ణా గోదావరులను దాటి
పంటసిరుల్లో ప్రథమ స్థానంలోకి ఎగబాకింది!
బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం
అరేబియా సముద్రం మూడూ
కట్టకట్టుకొని పొంగిపొర్లి
అనంతపురం గడియార స్తంభాన్ని ముంచేశాయి
పంటలు పండించడానికి కేరళ, బెంగళూరు నుంచి
ప్రజలు అనంత సీమకు వలసబాట పట్టారు
పంటలమ్మిన సొమ్ములేం చేయాలో తెలియని
రైతులు ఆనందంతో చెట్ల కొమ్మలకు
ఉయ్యాలలూగుతున్నారు!
సరిగ్గా కళ్ళు పెట్టి చూడండి
అర్ధరాత్రి సూర్యోదయమయింది!!
డిసెంబరు 31తో కొత్త సంవత్సరం మొదలైంది!
శుభాకాంక్షలు అందుకోండి మరి!

(If mice could roar **కవి రస్కిన్ బాండ్‌కు క్షమాపణలతో**)

- గీత



జాస్తి భాగ్యలక్ష్మీ, బంటుమిల్లి, కృష్ణాజిల్లా.

24 చుక్కలు, 24 వరుసలు





ఎ.ఎల్.పి.ఎస్. సుభాషిణి, మండపేట, తూర్పుగోదావరి.

9 చుక్కలు, 3 వరుసలు, 3 వచ్చేవరకు



జీవన సౌరభం

శక్తి ప్రదర్శించడం కన్నా సహనంగా ఉండటం చాలా సందర్భాల్లో మంచి ఫలితాలనిస్తుంది.

చిట్కా

పాలతో వెండి వస్తువులను కడగడం వల్ల తళతళా మెరుస్తాయి.



బహుమతి పొందిన ముగ్గు





ఎం. ధనలక్ష్మీ, కెహెచ్‌బి కాలని నెల్లూరు.

16 చుక్కలు, 4 వరుసలు, 4 వచ్చే వరకు సరిచుక్క

సెన్సెక్స్ ↓ 08
36,068

నిఫ్టీ ↑ 03
10,862

రూపాయి ↑ 16 పై
అమెరికా డాలరుకు రూ.
69.78

అలహాబాద్ బ్యాంకు, ఎస్‌బిఐ లైఫ్ జట్టు




బ్యాంకస్యూరెన్స్ భాగస్వామ్యం..

తమ వినియోగదారులకు మరింతం చేరువయ్యేందుకు అలహాబాద్ బ్యాంకు, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లు బ్యాంకస్యూరెన్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై అలహాబాద్ బ్యాంకు ఎండి, సిఇఒ సిహెచ్ ఎస్ఎస్ మల్లికార్జున రావు, ఎస్‌బిఐలైఫ్ సిఇఒ సంజీవ్ నౌటియాల్ సంతకాలు చేశారు. అలహాబాద్ ఖాతాదారులకు బీమా ఉత్పత్తులను చేర్చడమే ఈ భాగస్వామ్య లక్ష్యం.

న్యూఢిల్లీ : అలహాబాద్ బ్యాంకు, దేశంలోని అతిపెద్ద బీమా సంస్థల్లో ఒక్కటైన ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లు 'బ్యాంకస్యూరెన్స్' భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. దీంతో అలహాబాద్ బ్యాంక్‌కు చెందిన 3238 శాఖల్లో ఎస్‌బిఐ లైఫ్ యొక్క విస్తృత శ్రేణి రక్షణ, సేవింగ్ ఉత్పత్తులను తమ వినియోగదారులకు అందించనుంది. వినియోగదారుల ఆర్థిక అవసరాలన్నీ కూడా ఒకే చోట తీర్చుకునేందుకు ఇది సహాయపడుతుందని అలహాబాద్ బ్యాంకు సిఇఒ, ఎండి మల్లి కార్జున రావు పేర్కొన్నారు. తమ శాఖల్లో జీవిత బీమా ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో పాటుగా బ్యాంకు యొక్క వడ్డీయేతర ఆదాయాన్ని వృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. అలహాబాద్ బ్యాంకుతో భాగస్వామ్యం వల్ల తమకు లభించే అవకాశాలు మరింత పెరగనున్నాయని ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండి, సిఇఒ సంజీవ్ నౌటియాల్ పేర్కొన్నారు. వినియోగదారులు ఇప్పుడు ఎస్‌బిఐ లైఫ్ యొక్క ప్రొటెక్షన్, వెల్త్ క్రియేషన్, సేవింగ్స్ ఉత్పత్తులను నేరుగా పొందడంతో పాటుగా సంపూర్ణమైన ఆర్థిక ప్రణాళిక పరిష్కారాలను పొందగలరన్నారు. తమ పంపిణీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవడంతో పాటు సామాన్య ప్రజలకు భీమాను మరింత చేరువ చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేయనుందని నైటియాల్ పేర్కొన్నారు.

చివరి రోజు నష్టాలు

సెన్సెక్స్ 8 పాయింట్ల తగ్గుదల



ముంబయి : ఏడాది చివరి రోజున దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. 2018 చివరి రోజు సోమవారం మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 8 పాయింట్లు తగ్గి 36,068 వద్ద నమోదయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 2 పాయింట్లు లాభపడి 10,862 వద్ద ముగిసింది. ఉదయం 36,239 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఓ దశలో 36,285 గరిష్ట స్థాయిని తాకింది. అనంతరం అమ్మకాల ఒత్తిడితో రోజంతా ఒత్తిడికి గురై.. ఓ దశలో 36,034 కనిష్ట స్థాయిని తాకింది. సెన్సెక్స్-30లో టాటా స్టీల్ 1.59 శాతం, వేదాంత 1.48 శాతం, సన్ ఫార్మా 1.42 శాతం, టాటా మోటార్స్ 1.05 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంకు 1.04 శాతం చొప్పున అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ 1.04 శాతం, యాక్సిస్ బ్యాంకు 0.87 శాతం, హీరో మోటో కార్ప్ 0.78 శాతం, ఎన్‌టిపిసి 0.77 శాతం, కోల్ ఇండియా 0.66 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

2018లో 5.91% ర్యాలీ

2018లో స్థూలంగా సెన్సెక్స్ 5.91 శాతం పెరిగింది. ఇదే బాటలో నిఫ్టీ 3.15 పాయింట్లు రాణించింది. నిఫ్టీలో బ్యాంకింగ్ స్టాక్ అత్యధికంగా 6.25 శాతం పెరిగింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ 13.38 శాతం, స్మాల్‌క్యాప్ 23.53 శాతం చొప్పున నష్టపోయాయి.

కొత్త ఏడాదిలో ఒడిదుడుకులే..!

కొత్త సంవత్సరం 2019లో దేశీయ మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వచ్చే నాలుగైదు నెలల్లో జరుగనున్న సాధారణ ఎన్నికలు, అంతర్జాతీయంగా చమురు ధరలు, ప్రపంచ దేశాల మధ్య చోటు చేసుకుంటున్న వాణిజ్య యుద్ధ భయాలు తదితర అంశాలు భారత మార్కెట్లపై కీలక ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. 2019 ప్రథమార్థంలో ముఖ్యంగా బడ్జెట్, లోకసభ ఎన్నికల ఫలితాలు ప్రభావం చూపించనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితులు కూడా మార్కెట్లను ప్రభావితం చేయనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు. అదే విధంగా అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా ప్రభావం చూపనుందన్నారు.

బ్యాంకుల్లో రూ.41వేల కోట్ల మోసాలు

- 2017-18లో 72% పెరుగుదల
- పిఎన్‌బిలోనే అతిపెద్ద స్కామ్
- ఆర్‌బిఐ రిపోర్టు వెల్లడి
- మోడీ హయాం ఆందోళనకరం



న్యూఢిల్లీ : నోట్ల రద్దు, పలు ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురాగలిగామని పదే పదే చెప్పుకునే పాలక వర్గాల ప్రకటనలకు భిన్నంగా బ్యాంకుల్లో మోసాలు చోటు చేసుకున్నాయి. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లలో ఈ మోసాలు ఏకంగా నాలుగు రెట్లు పెరగడం ఆందోళనకరం. ఇందుకు ఆర్‌బిఐ స్వయంగా వెల్లడించిన రిపోర్టే నిదర్శనం. 2017-18లో బ్యాంకింగ్ రంగంలో రూ.41,167.7 కోట్ల విలువ చేసే మోసాలు చోటు చేసుకున్నాయని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తాజాగా ఒక రిపోర్టులో వెల్లడించింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.23,933 కోట్ల మోసాలతో పోల్చితే ఒక్క ఏడాదిలోనే 72 శాతం పెరిగాయి. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన బంధువు మెహుల్ ఛోక్సీ తదితరులు కలిసి పంజాబ్ నేషన్ బ్యాంకుకు రూ.13వేల కోట్లు మోసం చేసిన విషయం తెలిసిందే. 2017-18లో బ్యాంకింగ్‌లో ఇదే అతిపెద్ద మోసంగా నమోదయ్యింది. పిఎన్‌బి కుంభకోణం వల్లే మోసాల విలువ భారీగా పెరిగిందని ఆర్‌బిఐ తన రిపోర్టులో పేర్కొంది.

నాలుగేళ్లలో నాలుగు రెట్లు..

2016-17 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో 5,076 మోసం కేసులు చోటు చేసుకున్నాయి. 2017-18లో ఈ సంఖ్య 5,917కు పెరిగింది. కాగా అత్యధికంగా 93శాతం కేసుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులే మోస పోయాయి. క్రితం నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకింగ్‌లో మోసాలు నాలుగు రెట్లు పెరిగాయి. 2013-14లో రూ.10,170 కోట్ల విలువ చేసే మోసాలు చోటు చేసుకున్నాయి. 2017-18లో ఈ మోసాలు రూ.41వేల కోట్లకు చేరడం ఆందోళనకరం. 2017-18లో 2,059 సైబర్ మోసాల వల్ల బ్యాంకులు రూ.109.6 కోట్లు నష్టపోయాయి. ఇంతక్రితం ఏడాదిలో 1,372 కేసుల్లో రూ.42.3 కోట్లు పోగొట్టుకున్నాయి.

రూ.50 కోట్ల పైబడినవే అత్యధికం

మొత్తం మోసాల్లో రూ.50 కోట్ల పైబడినవి 80 శాతంగా ఉండటం గమనార్హం. మొత్తం మోసాల్లో 90 శాతం రుణాలుగా జారీ చేసినవి కావడం ఆందోళనకరమని ఆర్‌బిఐ రిపోర్టు తెలిపింది. క్రితం ఆర్‌బిఐ వెల్లడించిన 'ట్రెండ్స్ అండ్ ప్రోగ్రెసెస్ ఆఫ్ బ్యాంకింగ్ 2017-18' నివేదిక ప్రకారం 2018 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (జిఎన్‌పిఎ) 11.2 శాతానికి పెరిగి దాదాపు రూ.10.39 లక్షల కోట్లకు ఎగిశాయి. అంతకు ముందు ఏడాది బ్యాంకుల జిఎన్‌పిఎ 9.3 శాతంగా నమోదయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెరిగిన జిఎన్‌పిఎల మొత్తంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా రూ.8.95 లక్షల కోట్లుగా ఉందని.. ఇది 14.6 శాతానికి సమానమని ఆర్‌బిఐ తన నివేదికలో తెలిపింది..

భెల్‌కు రూ.3,500 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ : విద్యుత్ తయారీ ఉపకరణాల సంస్థ భెల్‌కు భారీ ఆర్డర్ దక్కింది. పశ్చిమ బెంగాల్‌లో 660 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పడానికి గాను రూ.3,500 కోట్ల కాంట్రాక్టును పశ్చిమ బెంగాల్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (డబ్ల్యుబిపిడిసిఎల్) నుంచి పొందింది. ముర్షిదాబాద్ జిల్లాలోని మనిగ్రామ్‌లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) తెలిపింది. ఈ కాంట్రాక్టులో భాగంగా డిజైన్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, టెస్టింగ్, కమిషనింగ్ చేసి ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. అదే విధంగా బాయిలర్లు, టర్బైన్ జెనరేటర్లను సమకూర్చనుంది. కేంద్ర పర్యావరణ శాఖ ఇంధన ఉద్గారాల నూతన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు తెలిపింది.

16 నెలల కనిష్టానికి కీలక రంగాల వృద్ధి

న్యూఢిల్లీ: దేశం వెలిగిపోతోందని బిజెపి సర్కారు ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. ఆర్థిక వ్యవస్థలో మందగమన పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా విడుదలైన ఎనిమిది కీలక రంగాల వృద్ధి ఈ విషయాన్ని మరోమారు నిరూపితం చేసింది. నవంబరు మాసంలో ఆర్థిక వ్యవస్థలోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి 3.5 శాతానికి పడిపోయి.. 16 నెలల కనిష్టానికి చేరింది. 2017 జులైలో కీలక రంగాలలో కనిష్టంగా 2.9 శాతం వృద్ధి నమోదు అయింది. ఆ తరువాత మళ్లీ ఈ రంగాల వృద్ధి ఇంత కనిష్టానికి చేరడం ఇదే ప్రప్రథమం. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, చమురు శుద్ధి ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, విద్యుత్తు రంగాల సమిష్టి వృద్ధి గత ఆర్థిక సంవత్సరంలో 6.9 శాతంగా నమోదు అయింది.

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

కాకినాడ బాంబు ఘటన ఎప్పుడు జరిగింది?



ఎవిపి. రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం

1. తొలుత గాంధీజీయే తనకు ఆంగ్ల ప్రభుత్వం మొదటి ప్రపంచయుద్ధ కాలంలో (1914-19) ఇచ్చిన **'కైజర్-ఇ-హింద్'** బిరుదును త్యజించాడు. (సహాయ నిరాకరణోద్యమం)
2. గాంధీజీ అడుగుజాడలలో నడచి మాల్వీజహీద్ హుస్సేన్ సాహెబ్ **'షామ్‌సుల్ ఉలేమా'** అనే బిరుదును త్యజించాడు.
3. భారతదేశ సహాయ నిరాకరణోద్యమ చరిత్రలో చీరాల-పేరాల పురనిర్గమనము నిరూపమానమైన ఘట్టము. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించినవారు **- దుగ్గిరాల గోపాలకృష్ణయ్య**
4. **జాండ్రపేట, వీరరాఘవపేటల**తో కలిసి ఉన్న చీరాల-పేరాల గ్రామాలను మద్రాసు ప్రభుత్వం **1919**లో ప్రత్యేక పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేసింది.
5. నాడు చీరాల-పేరాల గ్రామాల జనాభా **15,000 మంది**.
6. ఆనాటి ప్రభుత్వం ప్రజావిన్నపాలు ఖాతరు చేయకుండా 1920 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించి **11 మంది సభ్యులు గల నూతన పురపాలక సంఘాన్ని ఏర్పాటు చేసింది**. (1920 జనవరి)
7. చీరాల-పేరాల ఉద్యమకాలంలో దురుసుగా ప్రవర్తించి, ఆంధ్రుల అభిమానాన్ని అవమానపరిచిన మద్రాసు ముఖ్యమంత్రి **- రాజారామరాయనింగార్ (జస్టిస్ పార్టీ)**
8. చీరాల-పేరాల ఉద్యమంలో దుగ్గిరాల ఏర్పరచిన 1000 మంది సభ్యులు గల **'రామదండు' (శాంతిసేన)** ఆయనకు కుడిభుజమై, ప్రముఖపాత్ర పోషించింది.
9. **1921, ఏప్రిల్ 06న** గాంధీజీ చీరాల సందర్శించి, రెండు ప్రతిపాదనలు చేశారు.
ఎ. పన్నుల నిరాకరణోద్యమాన్ని కొనసాగించడం లేదు.
బి. ప్రజలందరూ ఊరు వదిలి వెళ్లిపోవడం.
10. గాంధీజీ సలహా మేరకు దుగ్గిరాల చీరాల-పేరాల వాసులను **1921 ఏప్రిల్ 25 రాత్రి ఖాళీ చేయించారు**.
11. రామ్‌నగర్ గ్రామానికి శంకుస్థాపన జరిపినది ఎవరు **- గాంధీజీ**
12. రామ్‌నగర్ (తాటాకు గుడిసెల మహానగరం)లో చీరాల-పేరాల ప్రజలు ఎన్ని నెలలపాటు నివసించారు **- 11 నెలలు**
13. దుగ్గిరాల చీరాల-పేరాల ఉద్యమ ఖర్చుల నిమిత్తం ఎక్కడ జరుగుతున్న ఆంధ్రమహాసభ ప్రతినిధులను కలిసేందుకు వెళ్లగా అతనిని నిర్బంధించారు **- 1921 సెప్టెంబర్‌లో బరంపురంలో జరుగుతున్న ఆంధ్రమహాసభ**
14. దుగ్గిరాల జీవితచరిత్ర రాసింది ఎవరు **- గమ్మిడెదల వెంకట సుబ్బారావు**
15. 1922 ఫిబ్రవరి 5న **ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్** జిల్లాలోని చౌరీచౌరా జరిగిన సంఘటన పరిస్థితులను మార్చివేసింది. పోలీసుల దురుసైన ప్రవర్తనతో ఉద్రిక్తులైన ప్రజలు పోలీసులపై దాడిచేశారు. **22 మంది పోలీసులు ఈ దురంతంలో మృతి చెందారు.**
16. 1922 ఫిబ్రవరి 12న శాసనోల్లంఘనోద్యమం ముగిసింది. **(బార్డోలీ తీర్మానం ప్రకారం)**
17. బెజవాడ గోపాలరెడ్డి నాయకత్వాన కాంగ్రెస్ ప్రథమ మంత్రివర్గం ఎప్పుడు ఏర్పడింది **-1938లో**
18. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పుల్లరిశిస్తు వ్యతిరేక ఉద్యమ సమయంలో పల్నాడులో నెలకొన్న పరిస్థితులను అంచనా వేసేందుకు ఎవరిని పల్నాడుకు పంపింది **- ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభాషి వేదాంత లక్ష్మీనరసింహాచారిలను**
20. పల్నాడులో పుల్లరిశిస్తు వ్యతిరేక ఉద్యమంలో **ఉన్నవ లక్ష్మీబాయమ్మ, యామినీ పూర్ణతిలకమ్**లు ప్రముఖపాత్ర వహించారు.
21. పల్నాడులో పుల్లరి శిస్తు వ్యతిరేక ఉద్యమం నిర్వహించిన నాయకుడు ఎవరు **- కన్నెగంటి హనుమంతు**
22. 26 ఫిబ్రవరి 1922న కన్నెగంటి హనుమంతు ఎక్కడ జరిగిన కాల్పుల్లో వీరస్వర్గం పొందారు **- మించలపాడు వద్ద**
23. పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమానికి నాయకుడు **- పర్వతనేని వీరయ్య చౌదరి**
24. పెదనందిపాడు రైతుల శాంతియుత పోరాటం, నాటి మద్రాసు గవర్నరైన లార్డ్ వెల్లింగ్టన్ మాటలలో చెప్పవలెనన్న **'భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదులనే కదిలించి వేసిన ఉద్యమం'**
25. పర్వతనేని వీరయ్య చౌదరి ఏర్పాటు చేసిన స్వచ్ఛంద దళానికి ఏమని పేరు **- శాంతిసేన**
26. 'ఆంధ్రశివాజీ'గా ఖ్యాతిగాంచినవారు ఎవరు **- పర్వతనేని వీరయ్య చౌదరి**
27. పెదనందిపాడు ఫిర్కాలో ఏర్పడ్డ పరిస్థితులను చక్కదిద్దేందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఎవరిని నియమించింది **-రూథర్‌ఫర్డ్**
28. పెదనందిపాడు ఉద్యమంపై ఏర్పరచిన ఉపసంఘం సభ్యులు **- కాశీనాథుని నాగేశ్వరరావు, టంగుటూరి, డి.నారాయణరాజు (రివ్యూ కమిషన్)**
29. పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమాన్ని ఎవరి కోరిక మేరకు విరమించారు **- గాంధీజీ**
30. అల్లూరి సాగించిన విప్లవం **- రంపా విప్లవం**
31. అల్లూరి తల్లిదండ్రులు పశ్చిమగోదావరి జిల్లాలోని **మోగల్లు** వాస్తవ్యులు. (4-7-1897న జననం)
32. జనవరి 1922 నుంచి మే 1924 వరకూ కొనసాగిన రంపా విప్లవానికి నాయకత్వం వహించింది ఎవరు **- అల్లూరి సీతారామరాజు**
33. కృష్ణదేవి పేటకు సమీపంలో ఉన్న తాండవనది ఒడ్డున అల్లూరి నెలకొల్పుకున్న ఆశ్రమం పేరు **- రామ విజయనగరం**
34. అల్లూరికి సహాయపడిన సహచరులు ఎవరు **- వేగిరాజు సత్యనారాయణరాజు, గాంమల్లుదొర, గాంగంటందొర మొదలైనవారు..**
35. **'అగ్గిరాజు'**గా ప్రసిద్ధికెక్కినది ఎవరు **- వేగిరాజు సత్యనారాయణరాజు**
36. ఆంగ్ల ఉద్యోగియైన హెప్పెల్ నివేదికను అనుసరించి **1921 జులై నెల్లో** రామరాజు చిట్టగాంగ్ వెళ్లి అక్కడ బెంగాల్ విప్లవకారులతో సమాలోచనలో పాల్గొన్నారు.
37. అల్లూరి మొదటిసారిగా ఏ పోలీస్‌స్టేషన్‌పై దాడిచేశారు **- చింతపల్లి పిఎస్ (22-8-1922)**
38. మన్యం లేక రంపా విప్లవాన్ని అణచి వేయడానికి నియమించబడిన ప్రత్యేక కమిషనర్ ఎవరు **- రూథర్‌ఫర్డ్**



39. అల్లూరి తిరుగుబాటు కాలం నాటి గోదావరి ప్రాంత తహశీల్దార్ ఎవరు **- బాస్టియన్**
40. 1924 మే 6న అల్లూరిని బంధించినది ఎవరు **- జమేదార్ కంచుమీనన్**
41. 1924 మే 7న అల్లూరిని కాల్చి చంపింది ఎవరు **- మేజర్ గూడాల్**
42. 1924 మే 8న అల్లూరిని **కృష్ణదేవి పేట** వద్ద సమాధి చేశారు.
43. 1919 **మాంటెగు-ఛేమ్స్‌ఫర్డ్** సంస్కరణలు భారతీయులను సంతృప్తి పరచలేదు. దేశవ్యాప్తంగా ఈ సంస్కరణల పట్ల తీవ్ర వ్యతిరేకత పుట్టుకొచ్చింది. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం **సర్‌జాన్ సైమన్** అధ్యక్షతన ఏడుగురు సభ్యులుగల ఒక కమిషన్‌ను **8-11-1927**న నియమించింది. ఈ సంస్కరణలు పనిచేసే తీరుతెన్నులను స్వయంపాలన అవకాశాలు పరిశీలించి, ఒక నివేదికను సమర్పించాల్సిందిగా మన దేశానికి పంపారు. దీనినే సైమన్ కమిషన్ అని అంటారు.
44. 1928 ఫిబ్రవరి 3న సైమన్ కమిషన్ **ముంబయి**లో పర్యటించింది.
45. సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమానికి చెన్నైలో నాయకత్వం వహించినది ఎవరు **- టంగుటూరి**
46. సైమన్ కమిషన్ చెన్నైలో పర్యటించినపుడు కమిషన్‌కు వ్యతిరేకంగా అల్లర్లు జరిగాయి. ఈ అల్లర్లను అణచేందుకు రక్షకభటులు జరిపిన కాల్పులలో పార్థసారథి అనే యువకుడు నేలకొరిగాడు. నేలకొరిగిన పార్థసారథిని చూసేందుకు టంగుటూరికి రక్షకభటులు దారి ఇవ్వడానికి నిరాకరించారు. ఆ సమయంలో టంగుటూరి తన రొమ్మును చూపి కాల్చండి అని గర్జించాడు. టంగుటూరి చూపిన అసమాన ధైర్యసాహసానికి గాను **'ఆంధ్రకేసరి'** అనే బిరుదు వచ్చింది.
47. 1928 ఫిబ్రవరి 26న సైమన్ కమిషన్ **మద్రాసు**లో పర్యటించింది.
48. సైమన్ కమిషన్ తన నివేదికను ఏ సంవత్సరంలో సమర్పించింది **- 1930**
49. కాకినాడ బాంబు సంఘటన జరిగిన సంవత్సరం**- 1933**
50. కాకినాడ బాంబు కేసులో ప్రధాన నిందితుడు ఎవరు **- ప్రతివాద భయంకరాచారి**
51. కాకినాడ బాంబు కేసులో కారాగారానికి వెళ్లిన బాలనిందితుడెవరు **- ఓరుగంటి రామచంద్రయ్య**
52. 1929 డిసెంబర్‌లో జాతీయ కాంగ్రెస్ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన లాహోరులో సమావేశమై **'సంపూర్ణ స్వరాజ్యమే'** కాంగ్రెస్ లక్ష్యమని, దాని సాధనకు శాసనోల్లంఘన ఉద్యమం (సివిల్ డిస్‌ఓబీడియన్స్ మూమెంట్) అవసరమైన పన్నుతో నిరాకరణోద్యమాన్ని నిర్వహించాల్సిందిగా నిర్దేశించారు.
53. ఏఐసిసి అహ్మదాబాదులోని సబర్మతీ వద్ద సమావేశమై **శాసనోల్లంఘనోద్యమాన్ని** నిర్వహించేందుకు గాంధీజీని కోరింది.
54. గాంధీజీ 1930 మార్చి 12న **సబర్మతి ఆశ్రమం** నుంచి బయలుదేరి పశ్చిమతీరాన ఉన్న దండి గ్రామానికి వెళ్లి ఉప్పు తయారుచేయడంతో (6-4-1930) శాసనోల్లంఘనోద్యమం ఆరంభమైంది. ఈ దండి సత్యాగ్రహంలో ఆంధ్ర నుంచి **సరోజినీనాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ఎర్నేని సుబ్రమణ్యంతో 78 మంది** పాల్గొన్నారు.
55. ఆంధ్రలో ప్రథమ ఉప్పుసత్యాగ్రహం 1930 ఏప్రిల్ 9న బందరులో జరిగింది. బందరులో ఉప్పు సత్యాగ్రహనాయకుడు ఎవరు **- డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య**
56. గుంటూరులో ఉప్పు సత్యాగ్రహ నాయకుడు **- కొండా వెంకటప్పయ్య (దేశభక్త బిరుదుకలదు)**
57. ఏలూరులో ఉప్పు సత్యాగ్రహ నాయకుడు **- దండు సూర్యనారాయణరాజు**
విశాఖపట్నంలో **- తెన్నేటి విశ్వనాథం**
చెన్నయిలో **- టంగుటూరి**
58. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టు అయిన ప్రథమ మహిళ **- ఆచంట రుక్మిణీ లక్ష్మీపతి**
59. సీతానగరంలో ఉప్పు సత్యాగ్రహ నాయకుడు **- బ్రహ్మజోస్యుల సుబ్రమణ్యం**
60. సీతానగరం ఆశ్రమానికి గల పేరు- దక్షిణ భారత దండి
61. ఉప్పు సత్యాగ్రహ సందర్భంలో త్రిపురనేని రామస్వామి చౌదరి **'వీరగంధము తెచ్చినారము, వీరులెవ్వరో తెలుపుడి"** అనే గేయంతో తెనాలిలో ఉప్పు సత్యాగ్రహాలను ఆహ్వానించారు.
62. 'మా కొద్దీ తెల్లదొరతనం' గేయము ఎవరి రచన **- గరిమెళ్ల సత్యనారాయణ**
63. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ఉప్పుపాటను ఎవరు రచించారు **- గరికపాటి మల్లావధాని**
64. 'స్వరాజ్య' ఆంగ్ల పత్రిక స్థాపకుడు **- టంగుటూరి (26-10-1921)**
65. స్వరాజ్యపార్టీ 1923 సంవత్సరంలో **మోతీలాల్ నెహ్రూ + సి.ఆర్.దాస్ ప్రారంభించారు.** ★

ఉద్యోగాలు

సీఆర్‌పీఎఫ్‌లో 359 క్రీడా పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) క్రీడా కోటాలో 359 కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

కానిస్టేబుల్/ జనరల్ డ్యూటీ: 339 (ఇందులో పురుషులకు 295, మహిళలకు 44 పోస్టులున్నాయి).

అర్హత: మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత క్రీడలో ప్రతిభ, నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలుండాలి.

హెడ్ కానిస్టేబుల్/ జనరల్ డ్యూటీ: 20 (ఇందులో పురుషులకు 19, మహిళలకు 1 పోస్టు ఉన్నాయి).

అర్హత: 10+2 ఉత్తీర్ణతతో పాటు సంబంధిత క్రీడలో ప్రతిభ, నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలుండాలి.

వయసు: జనవరి 13, 2019 నాటికి 18-23 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: ఫిజికల్ స్టాండర్డ్/ట్రయల్/ఫిజికల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్. దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

దరఖాస్తు ఫీజు: రూ.100.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 13, 2019.

వెబ్‌సైట్: https://crpf.gov.in

ఇస్రోలో 18 ఖాళీలు

బెంగళూరు ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 18 సైంటిస్ట్/ ఇంజనీర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు: సైంటిస్ట్/ఇంజనీర్-ఎస్సీ (సివిల్-9, ఎలక్ట్రికల్-6, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్-2, ఆర్కిటెక్చర్-1).

అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.

వయసు: జనవరి 15, 2019 నాటికి 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.100. **రాత పరీక్షతేదీ:** మార్చి 10, 2019.

పరీక్షా కేంద్రాలు: అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చండీగఢ్, చెన్నై, గువాహటి, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ముంబై, న్యూఢిల్లీ, తిరువనంతపురం.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 15, 2019.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: www.isro.gov.in

'బిఆర్'లో జిమ్నాస్టిక్స్ ఇండోర్ స్టేడియం

ప్రజాశక్తి - గుంటూరు సిటీ ప్రతినిధి

పిపిపి పద్ధతిలో గుంటూరులోని బిఆర్ స్టేడియంను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. స్టేడియంలో రూ.3.61 కోట్లతో జిమ్నాస్టిక్స్ కేంద్రాన్ని ఆయన సోమవారం మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో రూ.2 నుంచి 3 కోట్లతో ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బిఆర్ స్టేడియం అభివృద్ధికి ఒక కమిటీని నియమించామని, ఇక్కడ అత్యాధునిక సదుపాయాలు సమకూరుస్తామని చెప్పారు.



ఆవిష్కరణ
విశాఖలోని గోపాల పట్నంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సమ్మె జయప్రదానికి రాష్ట్రవ్యాప్త ప్రచారం

విశాఖలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఈ నెల 8, 9న జరిగే అఖిల భారత కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి, అంగన్‌వాడీ తదితర యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో నిర్వహించిన సిపిఎం గుంటూరు పశ్చిమ జిల్లా విస్తృత సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడారు. వ్యవసాయ రంగం దుస్థితి, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించి సమ్మె ప్రాధాన్యతను వివరించారు. సిఐటియు ఆధ్వర్యంలో పిడుగురాళ్ల ఆశా వర్కర్లు సమ్మె నోటీసును ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ శ్యామలకు అందజేశారు. కృష్ణా జిల్లాలో పలుచోట్ల సిఐటియు, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు జరిగాయి. పలుచోట్ల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాల్టీ కమిషనర్ కమిషనర్ శంకర్రావుకు మున్సిపాల్టీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, ఎల్.కోటలో పిహెచ్‌సి వైద్యాధికారికి ఆశా వర్కర్లు సమ్మె నోటీసులను అందజేశారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ కమిటీ ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు ఎన్.రామారావు, జె.అయోధ్యరాం, వైటి.దాస్ మాట్లాడారు. సిఐటియు గోపాలపట్నం, పెందుర్తి కమిటీల ఆధ్వర్యాన సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులతో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు సమావేశం నిర్వహించారు. అక్కయ్యపాలెం సంగం ఆఫీసు వద్ద ఎఐటియుసి ఆధ్వర్యాన ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. సమ్మెను జయప్రతం చేయాలని తిరుపతిలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం నుంచి సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. కర్నూలు జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో సమ్మె నోటీసు అందజేశారు.

మరో అవకాశం ఇవ్వండి

నూతన సంవత్సర శుభాకాంక్షల్లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అభివృద్ధి కోసం 2019లో జరిగే ఎన్నికల్లో మరో పర్యాయం టిడిపికి పట్టం కట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, అమరావతి శరవేగంగా నిర్మాణం జరగాలన్నా రాజకీయ సుస్థిరత ఎంతో అవసరమని పేర్కొన్నారు. అభివృద్ధిని నిలబెట్టుకునేందుకు ప్రజలకు మరో అవకాశం వచ్చిందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ పథకాలను వివరించిన ఆయన ఈ ఏడాది పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని, తద్వారా చరిత్ర గతిని శాసించే సమయం ఆసన్నమవుతుందని అన్నారు. గత విజయాను సమీక్షించుకుని నవ సంకల్పాలతో భవిష్యత్ నిర్మించుకునేందుకు ఇదే మంచి అవకాశమని పేర్కొన్నారు. నాలుగున్నర సంవత్సరాల పరిపాలనా కాలంలో సాధించిన అభివృద్ధిని సమీక్షించుకుని, మరిన్ని పథకాలు రూపొందించడమే లక్ష్యంగా జనవరి 2 నుండి జన్మభూమి మావూరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. తనపై నమ్మకంతో రాజధాని నిర్మాణానికి రైతులు భూములిచ్చారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నూతన రాజధాని నిర్మాణం రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే సచివాలయంలో ఐదు అంతస్తుల నిర్మాణ పని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ క్యాలెండర్‌ను ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి మాట్లాడుతూ సిబ్బంది సేవలు ప్రయాణికులకు పూర్తి స్థాయిలో అందేలా చూడాలన్నారు. ప్రజల ఆదరణ పొందేందుకు కృషి చేయాలన్నారు. నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, కోశాధికారి దివాకర్, ఉపాధ్యక్షులు బిడిఆర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ, పరమేశ్వరరావు పాల్గొన్నారు

వివాదంలో కాపుభవన్ నిర్మాణ స్థలం

ప్రజాశక్తి - గుంటూరు అర్బన్

గుంటూరు నగర పరిధిలోని అడవితక్కెళ్లపాడులో ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వం కాపు భవన్‌కు శంకుస్థాపన చేసిన స్థలం వివాదాస్పదమైంది. సంబంధిత స్థలాన్ని కొన్ని దశాబ్దాల కిందట లబ్దిదారులకు అప్పటి ప్రభుత్వం కేటాయిస్తూ డికె పట్టా మంజూరు చేసింది. దీన్ని క్రయవిక్రయాలతోపాటు రిజిస్ట్రేషన్లూ చేయడంతో స్థలం కేటాయింపును రద్దు చేస్తూ ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. రెవెన్యూ అధికారుల స్వాధీనం నిర్ణయాన్ని సవాలు చేస్తూ సంబంధిత వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు వివాదాల్లో ఉన్న స్థలంలోనే కాపు భవన్‌కు మంత్రులు శంకుస్థాపన చేయడం తాజా వివాదంగా మారింది.

నకరికల్లు రైతుకు కునుకు కరువు

వైకుంఠపురం ఎత్తిపోతలతో సాగు అవకాశాలు మృగ్యం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా నకరికల్లు రైతులకు కంటిపై కునుకు కరువైంది. వైకుంఠపురం ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తెస్తామని సిఎం చంద్రబాబు గత నవంబరు 27న శంకుస్థాపన చేశారు. ఇదిలా ఉండగా సాగర్ ఆయకట్టు పరిధిలోని మండల కేంద్రమైన నకరికల్లులోని రైతులు 2004 నుంచి బోర్లపై వ్యవసాయం చేస్తూ మూడు పంటలు పండిస్తున్నారు. గ్రామంలో మొత్తం 1,700 ఎకరాల సాగు భూమి ఉంది. ఆరు వేల కుటుంబాలు ఈ సాగుపై ఆధారపడి జీవిస్తున్నాయి. సాగర్ నుంచి నీరు వచ్చినా రాకున్నా రైతులు ఎక్కువ మంది బోర్ల ద్వారా వచ్చే నీటితోనే సేద్యం చేస్తున్నారు. అయితే గ్రామంలోని భూమిని దశలవారీగా ప్రభుత్వం లాగేసుకుంటోంది. పరిహారం మాత్రం అరకొరే ఇస్తోంది. 2013 భూసేకరణ చట్టం అమలవడం లేదు. అద్దంకి-నార్కెట్‌పల్లి మధ్యన 150 ఎకరాలను సేకరించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను నిర్మాణం కోసం 250 ఎకరాలు సేకరించి అధికారులు రైల్వేశాఖకు అప్పగించారు. మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు నీటి నిల్వ కోసం చెరువు కోసం 400 ఎకరాలు వినియోగించారు. తాజాగా గోదావరి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న ఎత్తిపోతలకు గ్రామంలోని 700 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. ఇంకా మిగిలేది కేవలం 200 ఎకరాలే కావడం గమనార్హం. వాస్తవంగా నకరికల్లుకు వర్షం నీరు తప్ప కాల్వల నీరు అవసరం లేదని, బోర్ల ద్వారా నీటి అవసరాలు తీరుతున్నాయని రైతులు తెలిపారు. తమ గ్రామంలోని 700 ఎకరాలను ఎత్తిపోతల కోసం తీసుకుంటే తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని రైతులు వాపోతున్నారు. గోదావరి జలాలను తెచ్చేందుకు తొలుత రూపొందించిన మార్గాన్ని మార్చారని రైతులు తెలిపారు. ఎత్తిపోతల కోసం రాజుపాలెం మండల పరిధిలో చౌటపాపాయపాలెం, అందువలవారిపాలెం, అనుపాలెం, కోటనెమలిపురి, పెద్ద నెమలిపురి, శ్రీనివాసనగర్, బాలాజీనగర్ తండాతో పాటు నకరికల్లు మండలంలోని త్రిపురాపురం, నరసింగపాడు గ్రామాల గుండా కాల్వ వెళ్తుందని సిఎం చంద్రబాబు గోదావరి జలాల తరలింపునకు సంబంధించిన శంకుస్థాపన సభలో ప్రకటించారు. కానీ ఇప్పుడు అలైన్‌మెంట్ మార్చడం వల్ల నకరికల్లులోని 700 ఎకరాలను సేకరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఎంత మొత్తుకున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు. గ్రామంలో ఉన్న భూమి 90 శాతం ఇలా ప్రభుత్వమే తీసుకుంటే తమకు ఉపాధి ఎక్కడ నుంచి వస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది వలస పోయారని తెలిపారు. ఇళ్లు వాకిళ్లు వదులుకుని ఎక్కడి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాగర్ ఆయకట్టు డిఈకి తమ గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు (ఫైల్)

మొత్తం భూమి 1700 ఎకరాలు

- గోదావరి జలాల తరలింపునకు 700 ఎకరాలు
- రైల్వేలైనుకు 250, అద్దంకి - నార్కెట్‌పల్లి రోడ్డుకు 150 ఎకరాలు
- తాగునీటి చెరువులకు 400 ఎకరాలు కేటాయింపు
- ఇక మిగిలింది 200 ఎకరాలే!

ఆత్మహత్యలే శరణ్యం

ఎన్.ఆంజనేయులు రైతు, నకరికల్లు.

మా గ్రామంలో 700 ఎకరాలు సేకరిస్తే మిగిలే భూమి ఏమీ ఉండదు. సాగు భూమి లేనప్పుడు గ్రామంలో ఉండి మేం ఏం చేయాలి. ఉపాధి ఎక్కడ నుంచి వస్తుంది. 400 ఎకరాలు చెరువు కింద ఉచితంగా తీసుకున్నారు. అరకొర పరిహారంతో రోడ్డుకు, రైల్వే లైనుకు తీసుకున్నారు. ఇప్పుడు గోదావరి జలాల పేరుతో 700 ఎకరాలు తీసుకుంటే మేం ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదు.

ఓటరు ఐడితో 'మొబైల్' అనుసంధానం

రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓటరు గుర్తింపు కార్డుతో మొబైల్ నెంబరును అనుసంధానం చేసే ప్రక్రియను చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్పీ సిసోడియా తెలిపారు. ఈ విధానాన్ని జాతీయ స్థాయిలో మన రాష్ట్రంలోనే తొలిసారి ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. సచివాలయంలో కొత్తగా ఓటు హక్కు పొందిన పది మందిని సన్మానించి, వారికి ట్యాబ్‌లు అందజేశారు. 2019 ఎన్నికలకు కమిషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3.70 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వీరి సెల్‌ఫోన్ నెంబరును అనుసంధానించడంతో ఎస్‌ఎంఎస్‌లతో నేరుగా సమాచారం అందించే అవకాశమేర్పడనుందని తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు చెప్పారు. మెసేజ్ పంపి తనకు కావాల్సిన సమాచారాన్ని ఓటరు తెలుసుకోవచ్చన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటు వేయాల్సిన పోలింగ్ బూత్‌తో పాటు, ఇంటి నుంచి అక్కడకు వెళ్లే మార్గాన్ని తెలిపే మ్యాప్‌ను కూడా పంపుతామన్నారు. సమాచార మాధ్యమాల ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలింగ్ బూత్ వద్ద ఏ సమయంలో ఎంత మంది బారులుతీరి ఉన్నారో తెలియజేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కొత్త ఓటర్ల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జనవరి 11 నుంచి ఓటర్ల జాబితా విడుదల చేస్తామని, జాబితాలో పేర్లు లేని వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఓట్ల నమోదు, ఇతర అంశాలకు సంబంధించిన సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1950కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ నెల 26న ఓటర్స్ డే సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలక్షన్ కమిషన్ కేలండర్‌లో ఓటరుకు కావలసిన సమాచారాన్నంతా పొందుపర్చామన్నారు. ఈ కార్యక్రమంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షణకు నలుగురు ఐఎఎస్‌లను నియమించినట్లు చెప్పారు. 85 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధుల జాబితాను ప్రత్యేకంగా తయారు చేస్తున్నామన్నారు. బోగస్ ఓటర్లపై స్పందిస్తూ 58 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని ప్రతిపక్షాలు జాబితా ఇచ్చాయని, వీటిలో రెండు, మూడు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న 27 లక్షల పేర్లను తొలగించామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం పేర్లు తప్పుగా నమోదు కావడంతో 3.50 లక్షల ఓట్లను, అనుమానాస్పదంగా ఉన్న మరో 1.30 లక్షల ఓట్లను తొలగించామన్నారు. ఓటర్ల నమోదులో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా చూస్తామన్నారు. నూతన సంవత్సరంలో రానున్న ఎన్నికలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు.



శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న రిమ్స్ సెక్యూరిటీ గార్డులు

2న యజమాన్యంతో చర్చలు

రిమ్స్ సెక్యూరిటీగార్డులకు మంత్రి అచ్చెన్నాయుడు హామీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి (శ్రీకాకుళం)

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళంలోని రిమ్స్ జనరల్ ఆస్పత్రి సెక్యూరిటీగార్డులు జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. తమకు జై బాలాజీ యాజమాన్యం ఇవ్వాల్సిన బకాయి వేతనాలు, మూడు నెలల ఎరియర్స్ వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన 95 మంది సెక్యూరిటీ గార్డులు ఆదివారం రిమ్స్ నుంచి మంత్రి అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడ వరకూ 28 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి అదే గ్రామంలో రాత్రి బస చేసిన సంగతి తెలిసిందే. రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గణేష్, డి.సింహాచలం, టి.రామారావు, సెక్యూరిటీగార్డులు మంత్రిని సోమవారం కలిశారు. 2016 నుంచి 2018 వరకూ సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, వేతనాల నుంచి మినహాయించిన మొత్తాలను పిఎఫ్, ఇఎస్ఐ ఖాతాల్లో సక్రమంగా జమ చేయకపోవడం, యూనిఫాం, బూట్లు, బెల్టు, టార్చ్, స్టిక్స్ వంటి సామగ్రి అందజేయకపోడంపై కూడా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై పలుమార్లు వినతులు ఇచ్చినా, దశలవారీ ఆందోళనలు నిర్వహించినా సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. రిమ్స్ డైరెక్టర్ సమక్షంలో జరిగిన వేతన ఒప్పందం సైతం అమలు చేయలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందించి, జై బాలాజీ యాజమాన్యంతో ఫోన్లో మాట్లాడారు. యాజమాన్యంతో సెక్యూరిటీగార్డుల సమక్షంలో బుధవారం చర్చలు జరిపి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అర్ధనగ్న ప్రదర్శన, ధర్నాలు

- కొనసాగుతున్న సహకార ఉద్యోగుల సమ్మె



తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, జిఒ 151ను అమలు చేయాలని, గ్రాట్యూటీని రూ.5 లక్షలకు పెంచాలని, సంఘాల్లో అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ సహకార ఉద్యోగులు చేస్తున్న ఆందోళన సోమవారం వివిధ రూపాల్లో కొనసాగింది. సమ్మె కొనసాగుతోంది. కాకినాడ కలెక్టరేట్ నుంచి జెడ్‌పి సెంటర్ వరకూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి సిఐటియు జిల్లా (కాకినాడ) ప్రధాన కార్యదర్శి ఎం.వీరలక్ష్మి మద్దతు తెలిపారు.

యూనియన్ రాష్ట్ర నాయకులు తోట వెంకట్రామయ్య, రామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు కడగల ఆదినారాయణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 400 మంది వరకూ ఉద్యోగులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ వద్ద ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. వారికి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలంగా ఆలోచించి వెంటనే పరిష్కరించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పివి.సత్యనారాయణరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.గంగరాజు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గుంటూరు జెడ్‌పి హాల్లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పిఎసిఎస్ ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కె.ధనంజయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సహకార ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు సందర్శించి మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల వేతన సవరణ 50 శాతం పెంచుతూ అమలు చేయాలని, 2014 ఏప్రిల్ 1 నుంచి బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సును 60 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

నాణ్యత లేని పరికరాలు

- ఆదరణపై సర్వేలో 76 శాతం మంది వెల్లడి
- అసంతృప్తి సిఎం ఇలాకాలోనే ఎక్కువ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి అమలు చేస్తోన్న ఆదరణ-2 అప్రతిష్టపాలవుతోంది. టిడిపికి బిసిలే వెన్ను దన్ను అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం ఆ వర్గాలకు నాణ్యత కలిగిన పరికరాలను అందించడంలో ఘోరంగా వైఫల్యం చెందింది. పరికరాల్లో నాణ్యత లేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు రోజు రోజుకు పెరుగుతున్నారు. గత నెలలో నిర్వహించిన ఆర్టీజి సర్వేలో సుమారు 47 శాతం మంది లబ్ధిదారులు పంపిణీ చేసిన పరికరాల్లో నాణ్యత లేదని పేర్కొనగా, ఈ నెల నిర్వహించిన సర్వేలో దాదాపు 76 శాతం మంది లబ్ధిదారులు నాణ్యత లేని పరికరాలను అందిస్తున్నారని తమ అభిప్రాయాన్ని వెల్లడించారంటే ఆదరణ పథకంపైనా, దాని కింద అందించే పనిముట్లపైన, బిసి వర్గాల పైన ఏమేరకు చిత్త శుద్ధి ఉందో అర్థమవుతుంది. ఆదరణ-2 కింద పంపిణీ చేస్తున్న వస్తువులపై రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజి) ద్వారా ప్రభుత్వమే స్వయంగా తాజాగా లబ్ధిదారుల అభిప్రాయాలను స్వీకరించింది. లబ్ధిదారుల ఎంపిక నుంచి పరికరాలను పంపిణీ చేసేంత వరకు అధికారులు లంచాలు అడుగుతున్నారని సుమారు 12.48 శాతం మంది అభిప్రాయాన్ని వ్యక్త పరచగా, కొత్త పరికరాలు వాడే విధానంలో శిక్షణ ఇవ్వలేదని 5.24 శాతం, పరికరాలు అందించడంలో జాప్యం జరిగిందని 6.01 శాతం మంది, పంపిణీ చేసిన వాటిల్లో నాణ్యత లేదని 76.27 శాతం మంది పేర్కొన్నట్లు ఆర్టీజి ద్వారా చేపట్టిన సర్వేలో వెల్లడించారు. అసంతృప్తులు వ్యక్తం చేసిన వారిలో సిఎం సొంత జిల్లా చిత్తూరు 86.44 శాతం మంది ఉండటం విశేషం.

పోలీసులపై దాడి శాంతిభద్రతల వైఫల్యమే!

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయన్నదానికి తాడిపత్రిలో మట్కా మాఫియా రెచ్చిపోయి పోలీసులపై దాడికి పాల్పడడమే మచ్చుతునకని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాసమస్యలపై శాంతియుత ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ విరుచుకుపడే పోలీసులు ఈ ఘటనపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రజాస్వామిక వ్యవస్థను నిర్వీర్యం చేయడంతోనే ఇటువంటి ఘటనలు తలెత్తుతున్నాయన్నారు. తక్షణమే హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖలో కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుండి పుస్తక మహోత్సవ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 11వ తేదీ వరకూ విజయవాడ స్వరాజ్యమైదానంలో నిర్వహించనున్న పుస్తక మహోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య తెలిపారు. స్వరాజ్యమైదానంలోని పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రదర్శనలో 290 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పుస్తకంపై 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. ప్రదర్శన ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 10 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక మహాత్సవం విద్యార్థులకు, సాహితీ ప్రియులకు, అక్షర ప్రియులకు 11 రోజుల పాటు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించనుందని అన్నారు. పుస్తక మహోత్సవ్ ప్రాంగణానికి నవభారత్ ప్రకాష్‌రావు ప్రాంగణంగా పేరు పెట్టినట్లు తెలిపారు. సాహితీ కార్యక్రమాలు నిర్వహించే సాహిత్య వేదికకు యుద్ధనపూడి సులోచనారాణి సాహిత్య వేదికగా నామకరణం చేసినట్లు తెలిపారు.

ప్రజ్ఞ

జవాబులు

1. రాజస్థాన్
2. ఏపీ ఆక్టోపస్ ఎస్పి జీఆర్ రాధిక
3. అవామీలీగ్
4. రాజస్థాన్
5. డా. బి రాజేందర్

2019లో కూడా ప్రగతి సాధిద్దాం

నీరు-ప్రగతి-పురోగతిపై టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో 2018లో మంచి పురోగతి సాధించామని, 2019లో అలాగే సాధిద్దామనీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నీరు-ప్రగతి-పురోగతిపై సోమవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో నిర్వాహించిన కలెక్టర్ల టెలికాన్ఫరెన్స్‌లోఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతిఒక్కరికి సదుపాయాలు కల్పించామని, ప్రజల ఇబ్బందులను తొలగించామని తెలిపారు.. ఈ ఏడాది వివిధ రంగాలలో 675 పైగా అవార్డులు సాధించామని తెలిపారు. కృషి కళ్యాణ యోజనలో విజయనగరం, విశాఖ, కడప జిల్లాలు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాయని తెలిపారు. ముందుచూపు, నూతన ఆవిష్కరణలు, జవాబుదారీతనం, డిజటలైజేషన్, ఉబరైజేషన్, కన్వర్జెన్స్, టెక్నాలజి, ట్రాన్స్‌ఫర్మేషన్ (వయాడక్ట్) తోనే ఇన్ని అవార్డులు సాధించామని అన్నారు. విశాఖలో మెడ్ టెక్ జోన్ దేశానికే తలమానికమనీ, 175 నియోజకవర్గాలలో యువత ఉపాధి కోసమే ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేశామన్నారు. ఐదు వేల మంది కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వడం దేశంలోనే చరిత్రన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చేశామనీ, పంట బీమాలో రాష్ట్ర ప్రభుత్వ వాటా వెంటనే కేంద్రం విడుదల చేయాలని, వాటా విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని అధికారులను ఆదేశించారు. రబీ వ్యవసాయంలో వద్ధి మరింత పెరగాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠ మాట్లాడుతూ నరేగాలో ఇప్పటికే ఏడు వేల కోట్లు రూపాయలు సద్వినియోగం చేసుకున్నామని, ఇదే స్ఫూర్తితో రాబోయే నాలుగు నెలలు మరిన్ని నిధులు సాధించాలన్నారు. 345 కరువు మండలాల్లో 150 రోజుల పనిదినాలను కల్పించాలన్నారు.

కొత్త ఏడాదిలో సామాన్యుడే రాజు : పవన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన సంవత్సరంలో సామాన్యుడే రాజై వెలగాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. 2019 ఏడాదికి తొలి అడుగు వేస్తున్న తరుణంలో తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గతేడాది అనుభవాల్ని ప్రేరణగా తీసుకుని నూతన నిర్ణయాలతో ముందుడుగు వేద్దామని సూచించారు. నూతన సంవత్సరం మానవీయ పాలనకు, నవ చరితకు శ్రీకారం కావాలని పేర్కొన్నారు.

నేటి నుంచి అమరావతిలో...

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నూతన సంవత్సరం తొలిరోజు విజయవాడలోని స్టెల్లా కాలేజీ సమీపంలోని పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేందర్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, శ్రేణులు, అన్ని వర్గాల వారినీ కలుస్తారని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1 నుంచి అనుక్షణం రాజధాని అమరావతిలో అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయి పర్యటనలు చేపట్టనున్నారని తెలిపారు. ఇందుకనుగుణంగా పార్టీ కార్యక్రమాల ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది సరికొత్త పర్యాటక కార్యక్రమాలు

ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్త ఏడాదిలో పలు పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పర్యాటక సాధికార సంస్థ సిఇఒ, ఏపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి తర్వాత 17 నుంచి 19 వరకు అరకు వేదికగా బెలూన్ ఫెస్టివల్, అడ్వంచర్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సెమినార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2019 నవంబర్‌లో వారం రోజులపాటు జల ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక పర్యాటక ప్రయోజనాలకు ప్రోత్సాహమిస్తూ కొండపల్లి, కొండవీడు, కోటప్పకొండలలో హిల్ ఫెస్టివల్స్ చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 25 ప్రాంతాలను పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. విజయవాడ భవానీ ద్వీపంలో నీటి సింహాల పార్కును ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. భవిష్యత్తులో జల క్రీడలలో ప్రయివేటు భాగస్వామ్యంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

గ్యాస్ ధర తగ్గింపు

- సబ్సిడీ సిలిండర్‌పై రూ.5.91లు
- సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.120.50



న్యూఢిల్లీ : వంట గ్యాస్ సిలిండర్ ధరలు సోమవారం తగ్గాయి. సబ్సిడీ సిలిండర్‌పై రూ.5.91లు తగ్గినట్లు సంబంధిత వర్గాలు ప్రకటించాయి. అలాగే సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.120.50లు తగ్గిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలో వంట గ్యాస్ ధరలు తగ్గడం ఇది రెండోసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్‌పిజి ధర పడిపోవడం, డాలర్ మారకపు రేటు బలపడటం తదితర కారణాల వల్ల సిలిండర్ ధరలు తగ్గినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గడంతో దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో ప్రస్తుతం రూ.500.90లుగా ఉన్న సిలిండర్ ధర సోమవారం అర్ధరాత్రి నుండి రూ.494.99లు అయ్యిందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.


అంతకుముందు డిసెంబరు 1న సబ్సిడీ ఎల్‌పిజి సిలిండర్ ధర రూ.6.52లు తగ్గింది. సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.120.50లు తగ్గడంతో సోమవారం అర్ధరాత్రి నుండి ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రు. 689లుగా ఉంది. జూన్ నుండి వరసనే ఆరు నెలలు పెరుగుతూ వచ్చిన సిలిండర్ ధర డిసెంబరులో రెండు సార్లు తగ్గింది.

నకిలీ స్టాంప్ పేపర్ల కేసులో తెల్గి నిర్దోషి : నాసిక్‌సెషన్స్ కోర్టు తీర్పు

ముంబయి : వేల కోట్ల రూపాయిల నకిలీ స్టాంప్ పేపర్ల కుంభకోణం కేసులో అబ్దుల్ కరీమ్ తెల్గి, ఇతరులను మహారాష్ట్ర కోర్టు సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. కాగా, అనేక ఇతర కేసుల్లో మొత్తం 30 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తూ బెంగళూరు జైలులో 2017 అక్టోబర్‌లో తెల్గి మృతి చెందిన సంగతి తెలిసిందే. 11 రాష్ట్రాల్లో నకిలీ స్టాంప్ పేపర్ల కుంభకోణం నిర్వహిస్తున్నాడని, 2001లో తెల్గిని కర్నాటక పోలీసులు అరెస్టు చేశారు. అప్పటికే 10 సంవత్సరాలు నుంచి ఈ కుంభకోణం జరుగుతుందని పోలీసులు ఆరోపించారు.


ఈ కేసు విచారణలో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రముఖ రాజకీయ నాయకుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. రైల్వే ఉద్యోగి కుమారుడు, మాజీ ట్రావెల్ ఏజెంట్ అయిన తెల్గి నకిలీ స్టాంప్ పేపర్లను ముద్రించి అనేక బ్యాంకులకు, స్టాక్ బ్రోకరేజ్ సంస్థలకు, బీమా కంపెనీలకు విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. 350 మంది ఏజెంట్ల ద్వారా సుమారు 70 పట్టణాల్లో ఈ కుంభకోణం జరిగినట్లు తెలిపారు.

ప్రధాన సమాచార కమిషనర్‌గా సుధీర్ భార్గవ్



న్యూఢిల్లీ : నూతన ప్రధాన సమాచార కమిషనర్(సిఐసి)గా సుధీర్ భార్గవను కేంద్రం సోమవారం నియమించింది. ఆయనతో పాటు మరో నలుగురు సమాచార కమిషనర్లుగా నియమితులయ్యారు. వీరందరూ కూడా కేంద్ర సమాచార కమిషన్‌లో అధికారులే. మొత్తం 11 మంది సభ్యులు గల కమిషన్ ప్యానల్‌లో తాజా నియమకాలతో సంఖ్య ఏడుకు చేరుకుంది. సిఐసిలో సమాచార కమిషనర్‌గా వ్యవహరించిన సుధీర్‌కు పదవోన్నతి లభించింది. ఐఎఫ్ఎస్ మాజీ అధికారి యశ్వర్ధన్ కుమార్ సిన్హా, ఐఆర్ఎస్ మాజీ అధికారి వనజ ఎన్.సర్నా, ఐఎఎస్ మాజీ అధికారి నీరజ్ కుమార్ గుప్తా, మాజీ న్యాయ కార్యదర్శి సురేష్ చంద్ర నియామకాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆమోదం తెలిపారు. 1981 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి సిన్హా బ్రిటన్‌లో భారత హైకమిషనర్‌గా వ్యవహరించారు. ఆయన విద్యాభ్యాసమంతా పాట్నా, ఢిల్లీలో సాగింది. 1980 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి వనజ ..ఈ కమిటీలో ఒకే ఒక్క మహిళా కమిషనర్ కానుండటం విశేషం.

కోర్టులో లొంగిపోయిన సజ్జన్ కుమార్



న్యూఢిల్లీ : 1984 నాటి సిక్కుల ఊచకోత కేసులో యావజ్జీవ శిక్షకు గురైన కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్‌కుమార్ సోమవారం ఢిల్లీ కోర్టులో లొంగిపోయారు. ఆయనను తూర్పు ఢిల్లీలోని మండోలి జైలుకు పోలీసులు తరలించనున్నారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం చెలరేగిన అల్లర్లలో రాజ్‌నగర్‌లో ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు మృతికి కారణమయ్యారంటూ సజ్జన్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 17న ఇచ్చిన తీర్పులో ఈ నెలాఖరులోగా కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. అయితే తనకు కొంత సమయం కావాలని పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు తోసిపుచ్చింది. అనంతరం తనకు విధించిన శిక్షను సవాలు చేస్తూ సజ్జన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శీతాకాల సెలవుల అనంతరం జనవరి 2న దీనిపై విచారణ చేపట్టవచ్చునని ఆయన తరుపు న్యాయవాదులు భావిస్తున్నారు.

రాఫెల్‌పై లోక్‌సభలో రగడ

మోడీకి సంబంధం లేదన్న రాజ్‌నాథ్‌సింగ్

జెపిసి వేయాలన్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంలో మోడీ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. ఒకే అబద్దాన్ని పదేపదే చెప్పినంత మాత్రాన అది నిజం కాదని కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి లోక్‌సభలో అన్నారు. మొదటిరోజు నుండి తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, అయితే ప్రతిపక్షం చర్చకు సిద్ధంగా లేదని అన్నారు. జీరో అవర్‌లో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ఈ అంశాన్ని ప్రస్తావించగా కాంగ్రెస్‌తో సహా అన్నాడిఎంకె, టిడిపి ఎంపిలు వివిధ అంశాలపై నినాదాలు చేశారు. రాఫెల్ ఒప్పందంపై జెపిసి కమిటీ వేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం అతిపెద్ద కుంభకోణమని అన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన ధరకన్నా మూడు రెట్లు ఎక్కువ ధరతో యుద్ధ విమానాలను కొనుగోలు చేశారని అన్నారు. రాఫెల్ ఒప్పందంలో యుద్ధ విమనాల కొనగోలు ధరలను వెల్లడించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు పేర్కొన్న ఎన్‌డిఎ ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందంపై ప్రభుత్వ స్పందన సంతృప్తికరంగా లేదని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేయడంతో ప్రశ్నోత్తరాల సమయంలో కొంత సేపు సభ వాయిదా పడింది. కావేరి నదిపై ఆనకట్ట నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అన్నాడిఎంకె సభ్యులు నినాదాలు చేయగా, ఎపికి ప్రత్యేక హోదా నివ్వాలని కోరుతూ టిడిపి సభ్యులు నినాదాలు చేశారు.

కాపలాదారే 'దోపిడీ దారు'

ప్రధాని మోడీపై రాహుల్ విమర్శనాస్త్రాలు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ తనకు అత్యంత సన్నిహితులైన మిత్రులకు సహాయపడేందుకు దేశాన్ని లూటీ చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం విమర్శించారు. దేశానికి కాపలాదారుడిగా ఉన్న ప్రధానే లూటీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మోడీ సహాయపడిన స్నేహితులందరూ బ్యాంకుల్లో పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని విదేశాలకు పరారయిన వారేనన్నారు. "ప్రధాని మోడీ దేశ కాపలాదారునిగా నటిస్తూ దొంగగా పనిచేశారు. తనకు అత్యంత సన్నిహితులైన వారికి రూ.41, 167 కోట్లు దోచి పెట్టారు" అని రాహుల్ ట్వీట్ చేశారు. 2017-18 సంవత్సరంలో జరిగిన మోసాల కారణంగా దేశంలోని బ్యాంకులు రూ.41, 167 కోట్లు నష్టపోయాయని రిజర్వు బ్యాంకు ప్రకటించిన మూడు రోజుల తరువాత రాహుల్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. మోడీ తన సన్నిహితులకు దోచిపెట్టిన మొత్తంతో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి ఇబ్బంది లేకుండా మూడు రాష్ట్రాలలో రైతు రుణాలను రద్దు చేయొచ్చునని అన్నారు. అలాగే దాదాపు 40 ఎయిమ్స్ తరహా ఆసుపత్రులను, ఏడాది పాటు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించవచ్చునని రాహుల్ స్పష్టం చేశారు. రిజర్వు బ్యాంకు శుక్రవారం ఒక నివేదిక విడుదల చేస్తూ 2017-18 సంవత్సరంలో మోసగాళ్ళు రూ.41, 167.7 కోట్లను దోచుకున్నారన్నారని, అది అంతకు ముందు ఏడాది దోచుకున్న రూ.23,933 కోట్ల కన్నా 72 శాతం అధికమని తెలిపింది.

సీపీఐ(ఎం) నేత సైమన్ బ్రిట్టో కన్నుమూత



న్యూఢిల్లీ: సిపిఐ(ఎం) నాయకుడు, రచయిత సైమన్ బ్రిట్టో(64) సోమవారం కన్నుమూశారు. తీవ్ర గుండెపోటుతో త్రిసూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సీనా భాస్కర్, కూతురు కయానిలా ఉన్నారు. 1954, మార్చి 27న ఎర్నాకుళం జిల్లాలోని పొంగిక్కరలో జన్మించారు. ఆయన తండ్రి నికోలస్ రోడ్రిగ్యేజ్, తల్లి ఇరిన్ రొడ్రిగ్యేజ్. ఆయన విద్యాభ్యాసం ఎర్నాకుళంలోని సెయింట్ ఆల్బర్ట్స్ కాలేజీలో, బీహార్‌లోని మిథిలా యూనివర్సిటీలో, ఎర్నాకుళంలోని న్యాయ కళాశాల, తిరువనంతపురంలోని న్యాయ అకాడెమీలలో సాగింది. క్యాంపస్ రాజకీయాల్లో ఆయన చురుకుగా పాల్గొనేవారు. ఆయన 1984లో కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ప్రత్యర్థులు ఆయనపై కత్తితో దాడి చేశారు. ఆ సమయంలో బ్రిట్టో శరీరం పక్షవాతానికి గురైంది. 2006-11 మధ్య కేరళలో వామపక్ష కూటమి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర అసెంబ్లీకి ఆంగ్లో-ఇండియన్ సభ్యుడిగా ఆయన నామినేట్ అయ్యారు. ఆయన మూడు నవలలతో పాటు అనేక ఆర్టికల్స్ కూడా రాశారు. ఆయన మొదటి నవల 'అగ్రగామి' కేరళ సాహిత్య అకాడెమీ అవార్డును గెలుపొందింది. కేరళ గ్రంథాలయ కౌన్సిల్ సభ్యుడిగానూ బ్రిట్టో ఉన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లును అడ్డుకుంటాం

- కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి
- చంద్రబాబుపై కోర్టు ధిక్కారం కేసు పెట్టాలి: విజయసాయి రెడ్డి
- కొనసాగిన టిడిపి, వైసిపి ఎంపిల ఆందోళన



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ఆమోదం పొందనీయబోమని టిడిపి ఎంపి, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి అన్నారు. బిల్లులో కొన్ని సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి ఎంపిలు మాట్లాడారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని సుజనా డిమాండ్ చేశారు. తలాక్ బిల్లును చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని, సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరుతున్నా పట్టించుకోవట్లేదని ఎంపి గల్లా జయదేవ్ ఆరోపించారు. రాజ్యసభలో ఈ బిల్లును అడ్డుకుని తీరుతామని చెప్పారు. బిల్లులో కొన్ని సవరణలు చేయాలని టిడిపి డిమాండ్ చేస్తోందని మరో ఎంపి నారాయణ చెప్పారు. స్త్రీలకు న్యాయం చేయడం కోసం పురుషులకు అన్యాయం చేయొద్దని, స్త్రీ, పురుషులకు సమాన న్యాయం జరిగేలా బిల్లు ఉండాలని ఆయన కోరారు. తలాక్ బిల్లు లోపభూయిష్టంగా ఉందని ఆయన విమర్శించారు. దేశ ప్రజలను విడగొట్టేలా, సెంటిమెంట్లను దెబ్బతీసేలా బిల్లు ఉందని ఆరోపించారు. చట్టం చేయడానికి ముందు మరింత అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీ, పురుషుల మధ్య ఏ చిన్న వివాదం వచ్చినా పురుషులపై కేసులు పెట్టేలా ఉందన్నారు. పురుషులకు మూడేళ్ల జైలు శిక్షపై కూడా ఆలోచించాలన్నారు. అన్ని దేశాల చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాకే చట్టాన్ని తీసుకురావాలని ఎంపి టిజి వెంకటేష్ సూచించారు.

చంద్రబాబుపై కోర్టు ధిక్కారం కేసు పెట్టాలి

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాను కోరుతూ వైసిపి, టిడిపి సభ్యుల ఆందోళన సోమవారం కూడా కొనసాగింది. గాంధీ విగ్రహం వద్ద వైసిపి, టిడిపి ఎంపిలు ఆందోళన చేశారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాలుగేళ్ల పాటు కేంద్రంలో మోడీతో అంటకాగారని, నాలుగు లక్షల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్ సిఎం కాగానే తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. హైకోర్టు విభజనపై తప్పుడు సమాచారం ఇచ్చిన చంద్రబాబుపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ కోసమే హైకోర్టును విభజించారని చెప్పడం చంద్రబాబుకు మతిభ్రమించిందని అనడానికి నిదర్శనమన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని వైసిపి డిమాండ్ చేస్తోందని తెలిపారు. బిల్లులోని పలు అంశాలపై సెలెక్ట్ కమిటీ పరిశీలన చేయాలని విజయసాయి రెడ్డి అన్నారు.

ఐఎన్ఎస్ విరాట్ 'చేజారింది'

- మహారాష్ట్రకు పంపేందుకు కేంద్రం అంగీకారం
- రాజ్యసభలో కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నౌకా దళం సేవల నుంచి ఉపసంహరించిన విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విరాట్ ఆంధ్రప్రదేశ్ చేజారిపోయింది. విరాట్‌ను తమ రాష్ట్రానికి అప్పగించాల్సిందిగా మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం రాజ్య సభలో ప్రకటించారు. వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఐఎన్ఎస్ విరాట్‌ను విశాఖపట్నం వద్ద అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ కమ్ హోటల్‌గా మార్చేందుకు ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అప్పగించాలని రక్షణ మంత్రిత్వ శాఖ అంగీకరించింది వాస్తవం కాదా? అని ప్రశ్నవేశారు. దీనికి కేంద్ర మంత్రి తమ మంత్రిత్వ శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. డీ కమిషన్ చేసిన విమాన వాహక యుద్ధనౌక విరాట్‌ను హోటల్ కమ్ మ్యూజియంగా మార్చడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా రక్షణ మంత్రిత్వ శాఖ అందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని చెప్పారు.

విశాఖ-రాజమండ్రి మధ్య రూ.1775 కోట్లు టోల్ వసూళ్లు

విశాఖపట్నం-రాజమండ్రి మధ్య జాతీయ రహదారిపై ఉన్న మూడు ప్రధాన టోల్ గేట్ల నుంచి ఇప్పటి వరకు రూ.1775 కోట్లు టోల్ వసూలు చేసినట్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. సోమవారం రాజ్యసభలో వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ విషయం వెల్లడించారు. విశాఖపట్నం-రాజమండ్రి మధ్య జాతీయ రహదారిపై అగనంపూడి, వేంపాడు, కృష్ణవరం వద్ద మూడు టోల్ గేట్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు. అగనంపూడి టోల్ గేట్లో జూలై 1998 నుంచి 25 డిసెంబర్ 2018 నాటికి రూ.286.25 కోట్లు, వేంపాడు టోల్ గేట్లో మే 2005 నుంచి 25 డిసెంబర్ 2018 నాటికి రూ.844.99 కోట్లు, కృష్ణవరం టోల్ గేట్లో మే 2005 నుంచి 25 డిసెంబర్ 2018 నాటికి రూ.644.23 కోట్లు టోల్ ఫీజు కింద వసూలు చేసినట్లు మంత్రి వివరించారు.

దుగరాజపట్నం పోర్టు సాధ్యం కాదు

దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు సాధ్యం కాదని కేంద్ర ఉపరితల రవాణా శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ మరోసారి తెలిపారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ ఎనిమిదిలో దుగరాజపట్నం మేజర్ పోర్టు గురించి పేర్కొన్నారని తెలిపారు. కేంద్ర షిప్పింగ్, కేంద్ర ఆర్థిక శాఖలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి నీతి ఆయోగ్ పరిశీలించిందని, దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి అనుకూల పరిస్థితులు లేవని తేలిందని అన్నారు. కృష్ణ పట్నం పోర్టు 40 కిలోమీటర్లు, ఎన్నూర్ పోర్టు, చెన్నై పోర్టులు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని తెలిపింది. అందువల్ల పోర్టుకు ప్రత్యామ్నాయ ప్రాంతం చూపాలని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ, ఏపి ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. కానీ ఏపి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపలేదని పేర్కొన్నారు.

నేడు మహిళల మానవహారం

- కేరళలో 30 లక్షల మంది పాల్గొనే అవకాశం
- అది మహిళా సమానత్వ హారం : పినరయి విజయన్
- చేరుకున్న అంతర్జాతీయ మీడియా సంస్థలు
- ప్రపంచ రికార్డులో నమోదుకు ఏర్పాట్లు

తిరువనంతపురం : కేరళా మహిళలు చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించనున్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, తమ హక్కులు కాపాడాలని కోరుతూ కాసర్‌గోడ్ నుండి వెల్లాయమ్‌బాలమ్ వరకు 620 కిలోమీటర్ల మేరకు మానవహారం నిర్మించనున్నారు. నూతన సంవత్సరం రోజున జాతీయ రహదారిపై సాయంత్రం 3.45 గంటల నుండి 4.15 వరకు జరిగే ఈ మానవహారంలో సుమారు 30 లక్షల మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. దీనిలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, కేరళ ఆరోగ్యశాఖా మంత్రి కె.కె. శైలజ పాల్గొననున్నారు. మహిళలతో ఏర్పాటు చేసే మానవహారం సమానత్వపు హారంగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మానవహారానికి మద్దతుగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 50 లక్షలమంది మహిళలను సమీకరించనుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించారు. 25 లక్షల మంది మహిళలతో కూడిన బృందాలు, 70 లక్షల గృహాలకు వెళ్లి మానవహారం విశిష్టతను తెలిపాయి. యూనివర్సల్ రికార్డు ఫోరం ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసి వరల్డ్ రికార్డులో నమోదు చేయనున్నది. దీనికోసం ఏడు జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రాజకీయ, సాంస్కృతిక నేతలు పాల్గొనే ఈ కార్యక్రమానికి నవోదనా సంరక్షణ సమితితో పాటు 174 సామాజిక సంస్థలు మద్దతిచ్చాయి. ప్రజలు, సామాజిక సంస్థల నుండి విశేష మద్దతు లభించిందని నిర్వాహకులు చెప్పారు.

ముస్లింలలో భయాన్ని పెంచుతోంది

- ఘటనతో సంబంధం లేని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు
- 'బులంద్‌షహర్'పై ఎన్‌సీహెచ్ఆర్‌వో నివేదిక



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన బులంద్‌షహర్ ఘటన ముస్లింలలో భయాన్ని పెంచేలా ఉందంటూ జాతీయ మానవ హక్కుల సమాఖ్య సంఘం (ఎన్‌సీహెచ్ఆర్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ఇది జాతీయ మానవ హక్కుల సంస్థకు అనుబంధ సంస్థగా పనిచేస్తోంది. కాగా, ఈ ఘటనను 'ప్రణాళిక ప్రకారం చేసిన కుట్ర' (ప్లాన్డ్ ఇన్సిడెంట్)గా అభివర్ణించింది. లక్నోలో ఈ సంస్థ మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్‌సీహెచ్ఆర్‌వో నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడు మన్‌జీత్ సింగ్ మాట్లాడుతూ.. శాంతియుతంగా ఉన్న బులంద్‌షహర్‌లో డిసెంబర్ 3 నాటి హింస ఇక్కడి ముస్లింలలో భయాన్ని పెంచేలా ఉందని తెలిపారు. చిన్న గొడవగా ప్రారంభమై.. తదనంతరం హింసకు దారి తీసినందుకు బీజేపీ యువమోర్చా, మరికొన్ని హిందూ అతివాద సంఘాల సభ్యులే కారణమని అన్నారు. బులంద్‌షహర్‌కు సమీపాన ఉన్న మహా గ్రామంలో గోహత్యలు ఏమీ జరగకపోయినా ఉద్దేశపూర్వకంగానే ఇక్కడ మూకదాడి జరిగిందని చెప్పారు. ఘర్షణల అనంతరం పోలీసులు ఇద్దరు యువకులను అనుమానితులుగా భావిస్తూ వారిని అరెస్టు చేశారు. కానీ, హింసకు ప్రధాన కారకుడిగా భావిస్తున్న భజరంగ్ దళ్ సభ్యుడు యోగేశ్ రాజ్ మాత్రం యథేచ్ఛగా బయట తిరుగుతున్నాడు. దీనిపై మన్‌జీత్ మాట్లాడుతూ.. నిందితులను కాపాడటంలో రాజకీయ నాయకుల హస్తం ఉన్నదని ఆరోపించారు. ఈ తరహా హింసాత్మక ఘటనలను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టం రూపొందించాలని ఎన్‌సీహెచ్ఆర్‌వో కేంద్రాన్ని కోరింది. మూకదాడులకు పాల్పడుతున్న ఇలాంటి సంస్థలపై నిషేధం విధించాలని డిమాండ్ చేసింది. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిత్యం సమీక్షలు జరిపి దేశంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, ఈ ఘటనతో సంబంధం లేనివారిని కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారని మరో సభ్యుడు అన్సర్ ఇండోరి అన్నారు. బులంద్‌షహర్‌కు సమీపంలో ఉన్న నయాబన్‌లో మసీదుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సర్ఫుద్దీన్‌ను ఏ తప్పు చేయకున్నా పోలీసులు అరెస్టు చేశారని అన్నారు. సర్ఫుద్దీన్‌తో పాటు మరో ఏడుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతనెల 3న జరిగిన ఈ హింసలో సుభోద్ కుమార్ అనే పోలీసుతో పాటు మరో యువకుడు మరణించిన సంగతి తెలిసిందే.

అమాయకులపై బంద్ కేసుల ఉపసంహరణ

- కాంగ్రెస్ ప్రభుత్వాలకు మాయావతి డిమాండ్

లక్నో: గత ఏప్రిల్ 2 నాటి భారత్ బంద్ సందర్భంగా అమాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను బిఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు. ఈ కేసులను వెంటనే ఉపసంహరించుకోకపోతే ఆయా ప్రభుత్వాలకు బయటనుండి మద్దతునిచ్చే అంశాన్ని తాము పునఃపరిశీలించాల్సి వుంటుందని ఆమె సోమవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాజకీయ, కుల వివక్షతో బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అమాయకులపై అక్రమ కేసులు నమోదుచేశాయని ఆమె పేర్కొన్నారు. గతంలో బిజెపి పాలనలో వుండి ఇప్పుడు కాంగ్రెస్ చేతుల్లోకి వచ్చిన మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఈ కేసుల ఉపసంహరణ విషయాన్ని వెంటనే పరిశీలించాలని, లేకుంటే ఆయా ప్రభుత్వాలకు బయటనుండి మద్దతునిచ్చే అంశాన్ని తాము పునఃపరిశీలించాల్సి వుంటుందని ఆమె హెచ్చరించారు. బిఎస్పీకి మధ్యప్రదేశ్ అసెంబ్లీలో ఇద్దరు, రాజస్థాన్ అసెంబ్లీలో ఆరుగురు సభ్యుల బలం వున్న విషయం తెలిసిందే.

ఆ 13 మత అల్లర్లపై నివేదికలు లేవు

సీఐసీకి కేంద్రం నిర్లక్ష్యపు సమాధానం

న్యూఢిల్లీ: దేశంలోని మత అల్లర్లపై సమాచారహక్కు చట్టం కింద దాఖలైన ఓ ప్రశ్నకు కేంద్రం బాధ్యతారాహిత్యమైన సమాధానమిచ్చింది. దీంతో కేంద్రం తీరుపై కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో 1961-2003 మధ్య జరిగిన 13 మత అల్లర్లపై దర్యాప్తు నివేదికల వివరాలు కోరుతూ అంజలీ భరద్వాజ్ ఆర్‌టీఐ కింద దరఖాస్తు దాఖలు చేసింది. అయితే దీనికి స్పందించిన కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆ 13 దర్యాప్తు నివేదికల వివరాలు తమవద్ద లేవని పిటిషన్ విచారణ సందర్భంగా తెలిపింది. కేంద్రం స్పందనపై సమాచార కమిషనర్ బిమాల్ జుల్కా ఆగ్రహం వ్యక్తం చేశారు.

నివేదికలు ఎందుకు అందుబాటులో లేవని ప్రశ్నించారు. హోంమంత్రిత్వశాఖ.. సమాచారాన్ని అందించడం లేదా సంబంధిత కార్యాలయానికి పిటిషన్‌ను బదిలీ చేయాలని బిమాల్ అన్నారు. హోంమంత్రిత్వశాఖ తీరు ఆమోదయోగ్యంగా లేదన్నారు. ఆ 13 నివేదికల స్థితిగతులను పరిశీలించడానికి ఒక సీనియర్ అధికారిని నియమించాలని కేంద్ర హోంశాక సెక్రెటరీ రాజీవ్ గౌబాను సీఐసీ ఆదేశించింది. దీనిపై హోంశాఖ 15 రోజుల్లో సమగ్ర నివేదికను తప్పక అందించాల్సి ఉంటుంది.

ఇద్దరు చొరబాటుదారుల హతం

పాక్ కుట్రను భగ్నం చేసిన సైన్యం

శ్రీనగర్: సరిహద్దు వెంబడి దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఇద్దరిని భారత సైన్యం మట్టుపెట్టింది. నియంత్రణరేఖ వెంబడి సైనిక స్థావరాలపై దాడులకు చొరబాటుదారులు ప్రయత్నించారు. వారిని గమనించిన భారతసైన్యం కాల్పులు జరిపింది. ఈ ఘటన కాశ్మీర్‌లో ఆదివారం చోటుచేసుకుంది.

హసీనాకు మోడీ అభినందనలు

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ ప్రధానిగా ఎన్నికైన షేక్ హసీనాకు ప్రధాని మోడీ సోమవారం అభినందనలు తెలిపారు. తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికలలో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ కూటమి 298 సీట్లకు గాను 288 సీట్లను చేజిక్కించుకుంది. అవామీలీగ్ పార్టీ ఒక్కటే 266 సీట్లు గెలుచుకుంది. ఈ సందర్భంగా హసీనాను మోడీ అభినందిస్తూ బంగ్లాదేశ్‌తో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. దేశంలో చేపట్టిన అభివృద్ధికి, అద్భుతమైన నాయకత్వానికి లభించిన విజయంగా మోడీ పేర్కొన్నట్లు ప్రధాని కార్యాలయం కార్యదర్శి తెలిపారు. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయన్న విశ్వాసాన్ని బంగ్లా విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య గత ఐదేళ్లలో 19 అభివృద్ధి ప్రాజెక్టులను ఇరుదేశాల నేతలు సంయుక్తంగా ప్రారంభించారు.

కలుషిత ఆహారం తిని 103 మంది విద్యార్థులకు అస్వస్థత

బెంగళూరు : నగరంలోని బాల మందిరానికి చెందిన 103 మంది విద్యార్థులు ఆదివారం రాత్రి భోజనానంతరం అస్వస్థతకు గురైన సంఘటన కలకలం సృష్టించింది. వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని సంబంధిత వర్గాలు తెలిపాయి. వీరిలో ముగ్గురు విద్యార్థుల పరిస్థితి ఆందోళన కరంగా వుందని, వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స జరుగుతోందని, మిగిలిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారని ఆ వర్గాలు తెలిపాయి. ఆహారం కలుషితం కావడమే ఈ ఘటనకు కారణమని భావిస్తున్నారు. ఆదివారం రాత్రి భోజనానంతరం ముగ్గురు విద్యార్థులు కడుపు నొప్పిగా ఉందని ఫిర్యాదు చేశారని, దీంతో ముందస్తు జాగ్రత్త చర్యగా మొత్తం 103 మంది విద్యార్థులకు పరీక్షలు చేయించినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

అధికార పార్టీ విజయాన్ని అంగీకరించం

కాంగో ప్రతిపక్ష నేత మార్టిన్ ఫయలూ

కిన్షాసా : అధికార పార్టీ విజయాన్ని తాము అంగీకరించమని కాంగో ప్రతిపక్ష సంకీర్ణ పార్టీ లముక నేత మార్టిన్ ఫయలూ మీడియాకు తెలిపారు. డెమక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఆదివారం అధ్యక్ష ఎన్నికలు జరిగిన అనంతరం సోమవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అధికార పార్టీ అభ్యర్థి షడారి ఎలా గెలుస్తాడో నాకు తెలియదు. ఎవరైనా అతను గెలుస్తాడని చెబితే అది రెచ్చగొట్టడమే అవుతుందని ఫయలూ తెలిపారు..కాంగోలో 2016 నుండి వాయిదా పడుతూ వస్తున్న ఎన్నికలు ఆదివారం జరిగాయి.పోలింగ్ బూత్‌లను సకాలంలో తెరవక పోవడం, ఓటర్ల జాబితాలో చాలా మంది ఓటర్ల పేర్లు లేకపోవడం తదితర అంశాల కారణంగా ఓటింగ్ కూడా ఆలస్యంగా జరిగింది. ఓటింగ్ యంత్రాలు తగినంతగా లేక పోవడంతో కాంగో రాజధాని నగరమైన కిన్షాసాలోని 20 శాతం పోలింగ్ స్టేషన్లు తెరుచుకోలేదని ఎన్నికల కమిషన్ (సిఇఎన్ఐ) బుధవారం తెలిపింది. దాదాపు 46 మిలియన్ల మందికి పైగా ఉన్న కాంగో ప్రజలు ఆదివారం నాటి ఓటింగ్‌లో పాల్గొన్నారు. కాంగోకు 17 ఏళ్ళపాటు అధ్యక్షుడిగా జోసెఫ్ కబిలా కొనసాగారు. ఆయన స్థానంలో మరో కొత్త నేతను ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలు కీలకం కానున్నాయి. దాదాపు 21 మంది అభ్యర్థులు అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. అంతకుముందు డిసెంబరు మాసారంభంలో ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కార్యాలయం ధ్వంసమైంది. ఈ అగ్నిప్రమాదంలో 80 శాతం ఓటింగ్ మిషన్లు ధ్వంసమైటుల్ల సంబంధిత వర్గాలు తెలిపాయి.



ఫిలిప్పైన్స్‌లో ఉస్మాన్ తుపాను బీభత్సం

68 మంది మృతి

మణిలా: క్రిస్మస్ పండుగ తరువాత ఫిలిప్పైన్స్‌ను కుదిపేసిన ఉస్మాన్ తుపాను బీభత్సంలో మరణించిన వారి సంఖ్య సోమవారం నాటికి 68కి చేరింది. ఇది మరింత పెరిగే అవకాశాలున్నాయని ఫిలిప్పైన్స్ పౌర రక్షణ విభాగం అధికారులు చెప్పారు. రాజధాని మనీలాకు ఆగ్నేయంగా వున్న బైకాల్ పర్వత ప్రాంతంలో దాదాపు 57 మంది మరణించగా, ఫిలిప్పైన్స్ సెంట్రల్‌లో వున్న సమార్ దీవిలో మరో 11 మంది మరణించారని, వీరిలో అధికశాతం మంది కొండచరియలు విరిగి పడటం, నీట మునగటం ద్వారా మృత్యువాత పడ్డారని అధికారులు చెప్పారు. తుపాను విధ్వంసం సృష్టించిన ప్రాంతాల్లో శిథిలాలను తొలగించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైందని తెలిపారు. ఫిలిప్పైన్స్‌ను ఈ తుపాను శనివారం తాకగా, భారీ వర్షాలు కురవటంతో వరదలు సంభవించి భూమి గుల్లబారింది. దీనితో కొన్ని ప్రాంతాలలో కొండచరియలు విరిగి పడ్డాయి. ప్రభుత్వ యంత్రాంగం తుపానుపై గట్టి హెచ్చరికలు చేయకపోవటంతో అధికశాతం మంది ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేకపోయారని, దీంతో పాటు పండుగ సంబరాల్లో వుండటం కూడా ప్రాణనష్టం పెరగటానికి కారణమని పౌర రక్షణ విభాగం అధికారి యుకాట్ వివరించారు.

సిరియా నుంచి బలగాల ఉపసంహరణపై తర్జనభర్జన

వాషింగ్టన్ : సిరియా నుంచి అమెరికా బలగాల ఉపసంహరణపై తర్జనభర్జన పడుతున్నామని రిపబ్లికన్ పార్టీ సెనేటర్ గ్రాహమ్ లిండ్సే తెలిపారు. సిరియా నుంచి అమెరికా భద్రతా బలగాలను వెనక్కి పిలిపించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా, ట్రంప్ నిర్ణయం పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా రక్షణ మంత్రి జిమ్ మాట్టిస్ సహా పలువురు మంత్రులు క్యాబినెట్ నుంచి వైదొలిగారు. సిరియా నుంచి అమెరికా బలగాలు వెనక్కి వచ్చినట్టయితే ఐఎస్ సహా పలు ఉగ్రసంస్థలు పుంజుకునే ప్రమాదముందని గ్రాహమ్ లిండ్స్ అభిప్రాయపడ్డారు. సిరియా నుంచి బలగాలను క్రమక్రమంగా తగ్గించుకునే అంశంపై పునరాలోచించాలని ట్రంప్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని అన్నారు.

బాధితులను ఆదుకుంటాం : పుతిన్

మాస్కో : రష్యాలో మాగ్నిటోగోర్క్ నగరంలోని 10 అంతస్థుల భవనం సోమవారం కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందారు. వందలాది మంది భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఈనేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా, మాగ్నిటోగోర్క్ నగరం రాజధాని మాస్కో నుంచి 1400 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

బంగ్లా ఎన్నికల్లో 'హసీనా' గెలుపు

- అవామీలీగ్ కూటమికి 288 స్థానాలు
- హసీనాకు 2,29,539 ఓట్లు... సమీప ప్రత్యర్థికి 123 ఓట్లు
- ఫలితాలను తిరస్కరించిన ప్రతిపక్షం



ఢాకా: బంగ్లాదేశ్ ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీలీగ్ ఘన విజయం సాధించింది. అవామీ లీగ్ కూటమి 288 చోట్ల జయకేతనం ఎగురవేసింది. దీంతో, హసీనా రికార్డు స్థాయిలో నాలుగోసారి ప్రధాని పీఠాన్ని దక్కించుకున్నారు. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) కూటమి కేవలం 8 స్థానాలకే పరిమితమైందని ఎన్నికల సంఘం సెక్రెటరీ హెలాలుద్దీన్ అహ్మద్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో మొత్తం 300 నియోజకవర్గాలున్నాయి. వరుసగా మూడోసారి జయకేతనం ఎగుర వేసిన హసీనాకు రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సైనిక అధికారులు అభినందించారు. సోమవారం ఆమెను గణబ్ భవన్‌లో కలుసుకుని అభినందనలు తెలిపినవారిలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి దిలీప్ బారువా, హోమ్ మంత్రి అసదుజ్జామాన్ ఖమ్మం కమల్, ప్రధాని ఇంధన సలహాదారు తౌఫిక్ ఎలాహి చౌదురి, సైనిక, పౌర ఉన్నతాధికారులు పలువురు ఉన్నారు. లితాల్లో అధికార అవామీ లీగ్ పార్టీ 268 చోట్ల విజయం సాధించింది. అవామీ లీగ్ కూటమి పార్టీ అయిన జాతీయ పార్టీ 20చోట్ల గెలుపొందింది. స్వతంత్ర్య అభ్యర్థులు మూడు చోట్ల గెలుపొందారు. గోపాల్ గంజ్ స్థానం నుంచి పోటీ చేసిన ప్రధాని షేక్ హసీనాకు 2,29,539 ఓట్లు వచ్చాయి. ఆమెపై పోటీ చేసిన బీఎన్‌పీ అభ్యర్థి ఎస్ఎం జిలానీకి కేవలం 123 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. ఇస్లామి బంగ్లాదేశ్ ఆందోళన్ అభ్యర్థి ఎండీ మారూఫ్‌కు 71 ఓట్లు, మిగతా వారికి కేవలం 14 ఓట్లు వచ్చాయి. 2008లోనూ అవామీ పార్టీ మూడో వంతు మెజారిటీ సాధించింది. అవామీ విక్టరీతో ఖలీదాకు చెందిన బీఎన్‌పీ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది.

ఫలితాలను తిరస్కరించిన ప్రతిపక్షం

బంగ్లా ఎన్నికల ఫలితాలను ప్రతిపక్ష బీఎన్‌పీ కూటమి తిరస్కరించింది. 'ఈ ఫలితాలను మేం అంగీకరించట్లేదు. తటస్థమైన ఆపద్ధర్మ ప్రభుత్వం నేతృత్వంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. చిట్టగాంగ్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ ప్రారంభం కాకముందే బ్యాలెట్ బాక్సులు నిండిపోయాయి. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా రిగ్గింగ్ జరిగింది. ఈ ఎన్నికలను రద్దు చేసి మరోసారి ఎన్నికలు నిర్వహించాలి' అని బీఎన్‌పీ కన్వీనర్ కమల్ హొస్సైన్ డిమాండ్ చేశారు.


విజయం సాధించిన షేక్ హసీనా ఎవరు?

బంగ్లాదేశ్ పాలక పార్టీ అవామీ లీగ్ నాయకురాలు, ప్రధానమంత్రి షేక్ హసీనా వాజెద్ బంగ్లాదేశ్ జాతిపితగా పిలిచే షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె. హసీనా 2014లో మూడోసారి ప్రధాని పదవిని చేపట్టారు. ఆమెకు 71 సంవత్సరాలు. 1960ల్లో ఢాకా విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడే హసీనా రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 1968లో ప్రముఖ శాస్త్రవేత్త ఎంఏ వాజెద్ మియాను హసీనా వివాహం చేసుకున్నారు. ముజిబుర్ రెహ్మాన్ బంగ్లాదేశ్‌కు తొలి అధ్యక్షుడు. అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని నెలలకే 1975, ఆగస్టు15న ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురయ్యారు. ఆయనతోపాటు, హసీనా తల్లిని, ముగ్గురు సోదరులను పలువురు సైనికాధికారులు ఇంట్లోనే హత్య చేశారు. ఈ హత్యలు జరిగినప్పుడు ఆమె బంగ్లాదేశ్‌లో లేరు. అప్పట్లో హసీనా ఆరేండ్లు ప్రవాసంలో ఉన్నారు. ఆ సమయంలోనే అవామీ లీగ్ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. 1981లో ఆమె బంగ్లాదేశ్ తిరిగివచ్చాక రాజకీయాల్లో కీలక నాయకురాలయ్యారు. ఆ సమయంలో కొన్నిమార్లు గృహనిర్బంధానికి గురయ్యారు. 1990 డిసెంబర్‌లో ప్రజల ఒత్తిడికి తలొగ్గిన బంగ్లాదేశ్ చివరి సైనిక పాలకుడు లెఫ్టినెంట్ జనరల్ మొహమ్మద్ ఎర్షాద్ రాజీనామా చేశారు.

హసీనా రాజకీయ ప్రస్థానం...

- 1996 జూన్ ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించగా, హసీనా ప్రధానమంత్రి అయ్యారు.
- 2001 అక్టోబరులో ఎన్నికల్లో ఖలీదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీ, మూడు సంకీర్ణ భాగస్వామ్య పక్షాల చేతిలో అవామీ లీగ్ ఓడిపోయింది.
- 2004 ఆగస్టులో దేశ రాజధాని ఢాకాలో అవామీ లీగ్ ర్యాలీపై గ్రెనేడ్ దాడి జరిగింది. ఈ ఘటనలో 22 మంది మృతి చెందారు. హసీనా ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు.
- 2008 డిసెంబరులో సార్వత్రిక ఎన్నికల్లో 300 స్థానాలకుగానూ 250కి పైగా స్థానాల్లో హసీనా సారథ్యంలోని అవామీలీగ్ జయకేతనం ఎగురవేసింది.
- 2009 జనవరిలో ప్రధానిగా హసీనా ప్రమాణం.
- 2014 జనవరిలో సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించిన బీఎన్‌పీ. ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం, మూడోసారి ప్రధానిగా హసీనా బాధ్యతల స్వీకారం.

అమెరికా కొత్త రక్షణ మంత్రిగా షనాహన్



వాషింగ్టన్: అమెరికా తాత్కాలిక రక్షణ మంత్రిగా పాట్రిక్ షనాహన్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం నాడు బాధ్యతలు స్వీకరిస్తారని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత రక్షణ మంత్రి జిమ్ మాటిస్ రాజీనామా నేపథ్యంలో రక్షణశాఖ ఉప మంత్రిగా వున్న షనాహన్‌కు పదోన్నతి కల్పించినట్లు పేర్కొంది. అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార శైలితో దీర్ఘకాలంగా కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలో మాటిస్ తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ట్రంప్ హయాంలో విదేశాంగ విధానంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్న కీలక సమయంలో షనాహన్ అమెరికా రక్షణ మంత్రిగా బాధ్యతలు స్వీకరించటం విశేషం.

2020 ఎన్నికల్లో ట్రంప్‌పై పోటీ: ఎలిజిబెత్

వాషింగ్టన్ : 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్‌పై పోటీ చేస్తానని డెమోక్రాట్ పార్టీ సెనేటర్ ఎలిజబెత్ వారెన్ సోమవారం ఒక వీడియో సందేశం ద్వారా ప్రకటించారు. ఎలిజిబెత్ విడుదల చేసిన సుమారు 5 నిమిషాల వీడియోలో ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, అతని ఫోటోలను పొందుపర్చారు. 'అమెరికా మధ్యతరగతిపై దాడులు జరుగుతున్నాయి' అని 69 ఏళ్ల వారెన్ విమర్శించారు. కాగా, 2020 ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించిన తొలి ప్రముఖ వ్యక్తి ఎలిజిబెత్ నిలిచింది. ప్రముఖ బ్యాంకులు, వ్యాపారవేత్తలపై విమర్శలతో ఎలిజిబెత్ గుర్తింపు తెచ్చుకున్నారు.

వలసలకు తలుపులు మూసిన ఐరోపా

హవానా: ఇతర దేశాల నుండి వలసవస్తున్న పేదలను నడి సంద్రంలోనే అడ్డుకుంటున్న ఐరోపా దేశాలు 2019లో మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించాయి. వలసలకు తలుపులు మూయాలని ఇటలీ, మాల్టా వంటి దేశాలు ఇప్పటికే నిర్ణయించాయి. మరి కొన్ని యూరపు దేశాలు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. మధ్యధరా సముద్రంలో 33 మంది వలసవాసులను రక్షించిన ఒక స్వచ్ఛంద సంస్థ సీవాచ్‌కు చెందిన నౌకలను తమ రేవుల్లోకి రానీయకుండా ఇటలీ ఇటీవల అడ్డుకోవడంతో వలసల అంశం మరోసారి చర్చనీయాంశమైంది. సముద్రం మధ్యలో చిక్కుకున్న వారిని రక్షించి తీరానికి తీసుకొస్తే వారిని ఓడరేవు వద్దే అడ్డుకోవడం అమానుషమని డాక్టర్స్ వితవుట్ బోర్డర్స్, ఎస్ఒఎస్ మెడిటెర్రీనీ వంటి స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఏ దేశమూ అనుమతించకపోతే వారు ఏం కావాలి? మానవతా విలువలను మంటగలుపుతున్నవారిని ఏమనాలి? అని ఈ సంస్థలు నిలదీస్తున్నాయి. సహాయక శిబిరాలలో వున్న వలసవాసులు కూడా వసతుల లేమితో నానా అగచాట్లు పడుతున్నారు. 2016లో మధ్యధరా సముద్రంలో ప్రమాదంలో చిక్కుకున్న దాదాపు 30 వేల మంది అక్రమ వలసవాసులను కాపాడిన అక్వారిస్ నౌకకు ఐరోపా ప్రభుత్వాల నుండి అనుమతి లభించకపోవటంతో తన కార్యకలాపాలను నిలిపివేసింది.

మొదటి పేజీ తరువాయి

13 తరువాత ఆర్టీసి సమ్మె

నుంచి జరగలేదన్నారు. గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న ఎన్ఎంయు హయాంలో వేతన సవరణ జరగాల్సి ఉండగా నష్టాల సాకుతో 19 శాతం ఐఆర్‌తో సరిపెట్టిందన్నారు. ఇయు గుర్తింపు సంఘం అయ్యాక ఐదు సార్లు వేతన సవరణ కమిటీ సమావేశం జరిపినప్పటికీ యాజమాన్యం తన వైఖరిని స్పష్టం చేయలేదన్నారు. ఆర్టీసి ఉద్యోగులు కోరుకుంటున్న 50 శాతం ఫిట్‌మెంట్ న్యాయమైన డిమాండేనన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన 14 రోజుల నుంచి 41 రోజుల లోపు సమ్మె చేపట్టే అధికారం ఉన్నందున జనవరి 13 తరువాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధమవుతామన్నారు. ఆర్టీసిలోని అన్ని కార్మిక సంఘాలతో జనవరి 4న ఇయు రాష్ట్ర కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి, జెఎసిని ఏర్పాటు చేశాక సమ్మె సన్నాహక కార్యక్రమాల్ని రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇయు రాష్ట్ర నాయకులు ఎం హనుమంతరావు, జివి నరసయ్య, ఎవి రామచంద్రరావు, ఎం శంకర రావు, ఎండి ప్రసాద్, ఎం కోటేశ్వరరావు, టివి భవాని తదితరులు పాల్గొన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ తరపున సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, కోశాధికారి దివాకర్, ఉపాధ్యక్షులు బిడిఆర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ, పరమేశ్వరరావు ఉన్నారు.

నిరుద్యోగులకు కొత్త సంవత్సర కానుక

లెక్చరర్లు, మత్స్య శాఖలో 43 ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ విభాగాల్లో 446 గ్రూప్-2, 308 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ పోస్టులు, 169 గ్రూప్-1 పోస్టులు, 10 అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ (సబ్‌సర్వీస్) పోస్టులతో పాటు మరో 5 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చారు. పోస్టులు వారీగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల తేదీలను కూడా ప్రకటించారు. పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ పోస్టులకు ఫిబ్రవరి 6 నుంచి 27 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారుల పోస్టులకు జనవరి 17 నుంచి ఫిబ్రవరి 8 వరకు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రూప్-2 ఉద్యోగాలకు జనవరి 10 నుంచి 31 వరకు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ల పోస్టులకు ఫిబ్రవరి 5 నుంచి 26 వరకు, గ్రూప్-1 పోస్టులకు జనవరి 7 నుంచి 28 వరకు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ ఫిషరీస్ పోస్టులకు జనవరి 18 నుంచి ఫిబ్రవరి 8 వరకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ పోస్టులకు జనవరి 22 నుంచి ఫిబ్రవరి 12 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎపిపిఎస్సీ పేర్కొంది. అయితే గ్రూప్-2 పోస్టులకు తప్ప మిగిలిన ఉద్యోగాలకు పరీక్షల తేదీలను ప్రకటించలేదు. గ్రూప్-2 కు మాత్రం మే 5న ప్రాథమిక పరీక్ష, జులై 18,19 తేదీల్లో మెయిన్ పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో క్యారీ ఫార్వర్డ్ కింద 16 ఎగ్జిక్యూటివ్, 94 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి. తాజా గ్రూప్-2 పోస్టుల్లో 138 ఎగ్జిక్యూటివ్ పోస్టులు కాగా, మిగిలిన 198 పోస్టులు నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీకి చెందినవి.

రైతులకు త్వరలో రుణమాఫీ బకాయిలు

ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలోని రైతులందరికీ త్వరలో రుణమాఫీ బకాయిలు విడుదల చేస్తామని ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని తిమ్మాపురంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.24 వేల కోట్ల రుణమాఫీలో భాగంగా చివరి విడత రూ.8 వేల కోట్లు మరో 15 రోజుల్లో విడుదల చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీని ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగుతుందన్నారు. రైతు రుణమాఫీ పథకం దేశంలోనే ప్రప్రథమంగా మన రాష్ట్రంలోనే అమలు చేశామన్నారు. దీన్ని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు కూడా రైతు రుణమాఫీ అమలు చేస్తున్నాయన్నారు. డ్వాక్రా మహిళల రుణమాఫీ కింద బకాయిలుగా చెల్లించాల్సిన రూ.వెయ్యి కోట్లు మరో పదిహేను రోజుల్లోగా ఇస్తామన్నారు. రాష్ట్రంలో పన్నుల ఆదాయం బాగున్నప్పటికీ రెవెన్యూ వ్యయం పెరిగిందని, రాష్ట్రంలో ఆర్థిక భారాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి రామకృష్ణుడు చెప్పారు. గతంలో తీసుకున్న రుణాలపై వడ్డీ రేటు తగ్గడం వంటి చర్యల కారణంగా కొంత వెసులుబాటు కలిగిందన్నారు. బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా రుణాలు పొందుతున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖలో సిఎఫ్ఎంఎస్ విధానం ద్వారా చెల్లింపులు చేపట్టడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వ్యయం క్రమబద్ధీకరణ జరిగిందన్నారు.

సేవా రంగంలో వెనుకబడ్డాం

మొదటి పేజీ తరువాయి

శ్వేతపత్రం విడుదల చేశారు. పరిశ్రమల శాఖా మంత్రి ఎ అమర్‌నాథ్ రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 58 శాతం ఉపాధి వ్యవసాయ రంగంలో ఉందన్నారు. ఈ శక్తిని పారిశ్రామిక, సేవారంగానికి మార్చగలిగితే మన తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో అభివృద్ధి సాధిస్తే తప్ప అభివృద్ధి లక్ష్యానికి త్వరగా చేరుకోలేమని చంద్రబాబు వివరించారు. కేంద్రం నమ్మించి మోసం చేసిందని ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ఇచ్చిన ఆర్థిక ప్రోత్సాహకాలు ఏపీకి దక్కలేదన్నారు. విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు కేంద్రం గ్రాంటు ఇవ్వలేదని, పెట్టుబడి పెట్టలేదనీ అన్నారు. ఢిల్లీ - ముంబై పారిశ్రామిక కారిడార్లలో పెట్టుబడి పెట్టిందన్నారు. గ్రీన్ ఫీల్డ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ పెట్టాలన్న హామీ కార్యరూపం దాల్చలేదని, కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పాలన్న హామీకి కూడా అదే గతి పట్టిందన్నారు. ఈ నెల 8న ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నామని, 9న ప్రకాశం జిల్లా రామాయపట్నం పోర్టు పనులకు శ్రీకారం, పేపర్‌మిల్లు ఏర్పాటుకు శిలాఫలకం వేయనున్నట్లు చంద్రబాబు తెలిపారు. దుగరాజపట్నం పోర్టు అడిగితే కేంద్రం ఏర్పాటు చేయలేదని, రామాయపట్నం పోర్టును మనమే అభివృద్ధి చేస్తున్నామన్నారు. కడపస్టీల్ ఫ్యాక్టరీ విషయంలో కేంద్రం వెనుకకు పోయిందని, మనం చొరవ తీసుకునిముందుకెళు న్నామన్నారు. కాకినాడ పెట్రో కెమికెల్ కారిడార్‌ను కేంద్రమే పెట్టాల్సి ఉండగా, అనేక సాకులు చెబుతుండటంతో మనమే చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. విశాఖలో ఐటి కారిడార్ ఏర్పాటు చేస్తామని చెప్పి మాట మార్చిందన్నారు. భావనపాడు, కృష్ణపట్నం, మచిలీపట్నం పోర్టులను రాష్ట్ర పోర్టులుగా అభివృద్ధి చేయనున్నామని సిఎం తెలిపారు. పరిశ్రమలకు అనుమతులే కాకుండా వాటికి ఇచ్చే రాయితీ ప్రోత్సాహకాలు నిర్ణీత కాల వ్యవధిలో ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక మధ్యతరహా ప్రాజెక్టును అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 12శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకోగా, 10.5శాతం మాత్రమే సాధించామని చంద్రబాబు వెల్లడించారు. ఖాయిలా పడిన చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు రూ.100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఏదైనా ఇతర కారణాలతో మూతబడే పరిశ్రమలను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రైవేటు రంగంలో 2.5లక్షల ఉద్యోగావకాశాలు కల్పించినట్లు, ప్రాజెక్టులన్నీ పూర్తయితే సుమారు 13 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఓర్వకల్లును పారిశ్రామిక రంగంలో, నగరి ప్రాంతాన్ని టెక్స్‌టైల్స్ రంగంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఆయన వివరించారు. 2014-15లో1,784 మిలియన్ యూనిట్లుగా ఉన్న పారిశ్రామిక విద్యుత్తు వినియోగం 2017-18 నాటికీ దాదాపు రెట్టింపై 3,321 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు. పర్యాటక రంగంలో వృద్ధి ఫలితాలు బాగా ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. వరుసగా మూడు సంవత్సరాల్లో నిర్వహించిన భాగసామ్య సదస్సుల వల్ల అనేక పరిశ్రమలు వచ్చాయన్నారు. పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ చట్టం-2017ను తీసుకు వచ్చామని, పరిశ్రమలకు అవసరమైన 74 రకాల సేవలను నిర్ణీత కాలవ్యవధిలో అందించేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ రావడంతో 19 శాఖల నుంచి 69 రకాల సేవలను ఈ పోర్టల్ అందిస్తోందన్నారు. 2014 నుంచి 30,349 ఎంఎస్ఎంఇ యూనిట్లు స్థాపించారని, వీటితో రూ.14,292 కోట్లు నిధులు వచ్చాయని, 3.3లక్షల మందికి ఉపాధి కలిగిందన్నారు. ఎంఎస్ఎంఇల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, 2014-18 మధ్య కాలంలో రూ.62,097 కోట్ల మేర రుణాలకు ఎంఎస్ఎంఇ రంగానికి ఇచ్చినట్లు చంద్రబాబు తెలిపారు.

న్యాయమూర్తులొచ్చేశారు!

మొదటి పేజీ తరువాయి

జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ పనులో నిమగ్నమైన సిఆర్‌డిఎ సిబ్బందికి హైకోర్టు సిబ్బంది కూడా తోడ య్యారు. హైదరాబాద్ నుండి తీసుకువచ్చిన దస్తావేజులను, ఇతర సామాగ్రిని ఒక పద్ధతి ప్రకారం తాత్కాలిక కార్యాలయాల్లో సర్దు తున్నారు. మంగళవారం ఉదయం ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రధాన న్యాయమూర్తి చేత గవర్నర్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయించనున్న సంగతి తెలిసిందే. దీనికోసం ఆయన ఉదయం 10.30గంటలకు విజయవాడకు చేరుకోనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో ఆత్మీయ వీడ్కోలు

అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన న్యాయాధికారులు, కోర్టు ఉద్యోగులు, ఇతర సిబ్బంది సోమవారం హైదరాబాద్ నుండి అమరావతికి బయలు దేరారు. వీరికి తెలంగాణ బార్అసోసియేషన్, న్యాయాధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉమ్మడి హైకోర్టు ఆవరణలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. గత జ్ఞాపకాలను, అనుబంధాలను గుర్తు చేసుకుంటూ అధికారులు, ఉద్యోగులు కంట తడి పెట్టారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ రెడ్డి అధ్యక్షతన ఎపి అధికారులకు వీడ్కోలు సభ జరిగింది. అనంతరం హైదరాబాద్ హైకోర్టు ప్రాంగణం నుంచి నాలుగు బస్సుల్లో సుమారు రెండు వందల మంది అధికారులు, ఉద్యోగులు బయలుదేరారు. మరికొందరు సొంత వాహనాల్లో వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన కేసుల ఫైళ్లు, ఇతర ముఖ్యమైన డాక్యుమెంట్లు, సామాగ్రితో మరో రెండు వ్యాన్‌ల ఎస్కార్ట్‌తో అమరావతికి బయల్దేరాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు తరలివెళ్లే సమయంలో రాయలసీమ ప్రాంతానికి చెందిన పలువురు న్యాయవాదులు ఉమ్మడి హైకోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు.

రాయలసీమలో ప్రత్యేకబెంచ్ ఏర్పాటు చేయకుండా హైకోర్టును తరలించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయాధికారులు కూడా తరలడంతో హైదరాబాద్‌లోని హైకోర్టుతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకున్న 62 సంవత్సరాల బంధానికి తెరపడింది.

అత్యవసరం కాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపి ఉమ్మడి హైకోర్టు విభజనపై అత్యవసర విచారణ అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంపై బుధవారం సాధారణ విచారణ నిర్వహిస్తామని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలో నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే వరకు హైదరాబాద్ నుంచి హైకోర్టు తరలింపు నిర్ణయం వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం, న్యాయవాదులు కె.సీతారాం, కె. జగన్మోహన్ రెడ్డిలు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని హౌస్ మోషన్‌గా స్వీకరించాలని కోరారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం సుప్రీం కోర్టు రిజిస్ట్రీ కార్యాలయంలో పిటిషన్ దాఖలు చేయాలని అధికారులు సూచించడంతో వెకేషన్ అధికారి కుల్వి దగ్గర రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ స్వీకరించి నంబర్ ఇచ్చిన వెకేషన్ అధికారి, జనవరి రెండున విచారణ జాబితాలో చేర్చుతున్నట్లు తెలిపారు. హైకోర్టు భవనాలు, జడ్జిల నివాస సముదాయాలు, ఇతర మౌలిక వసతులు పూర్తయ్యే వరకు హైకోర్టు విభజన వాయిదా వేయాలని కూడా న్యాయవాదుల సంఘం కోరింది. మరోవైపు హైకోర్టు విభజన అవసరమేనంటూ తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీం కోర్టులో కేవియట్ దాఖలు చేసింది.



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు , కార్యకర్తలు, కేబుల్ ఆపరేటర్లు

ట్రాయ్‌తో వినోదం దూరం

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ట్రాయ్ తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు వినోదం దూరమవుతుందని, ఈ నిర్ణయం సరైంది కాదని సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి తెలిపారు. ట్రాయ్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కర్నూలు అర్బన్, న్యూసిటీ కమిటీ కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు అధ్యక్షత వహించారు. కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రూ.150, రూ.200లతో వస్తున్న ఛానెళ్ల ధరలు రూ.300 నుంచి 600 అయ్యే అవకాశం ఉందని, తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇ.పుల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఛానెల్‌కు ఒక ధర పెట్టి ఛానెళ్ల వారికి బిజెపి ఊడిగం చేస్తోందని విమర్శించారు.

రాజ్యసభలో 'తలాక్' ప్రకంపనలు

మొదటి పేజీ తరువాయి

బిజెడి, ఎస్పీ, ఎన్సీపి, బిఎస్పీ, సిపిఎం, సిపిఐ, అన్నాడిఎంకె, డిఎంకె, టిడిపి, వైసిపి, ఆప్, ఆర్జేడి తదితర పార్టీలు నిరాకరించాయి. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందిగా ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలకు చెందిన ఎంపిలు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు."ఉయ్ వాంట్ జస్టిస్" అంటూ బిగ్గరగా నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సభా కార్యకలాపాలు పావుగంట కూడా నడవలేదు. ఈ దశలో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేస్తున్నట్టు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ ప్రకటించారు. అనంతరం ప్రారంభమైన సభలో అన్నాడిఎంకె సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. బిల్లును సమగ్రంగా పరిశీలించేందుకు సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందిగా ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ డిమాండ్ చేశారు. "ఇది చాలా ప్రాముఖ్యమైన బిల్లు. కొన్ని కోట్ల మంది ప్రజల జీవితాలపై ఈ బిల్లు అనుకూల...ప్రతికూల ప్రభావం చూపుతోంది. అటువంటి ముఖ్యమైన బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలించకుండా ఆమోదింపజేయాలని చూడటం తగదు" అని ఆజాద్ పేర్కొన్నారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని అన్ని ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నాయని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓ బ్రెయిన్ తెలిపారు.

కాగా, తలాక్ బిల్లుపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కానీ కాంగ్రెస్ కావాలనే అడ్డంకులు సృష్టిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్ అన్నారు. లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్ మద్దతు తెలిపింది. కానీ ఇప్పుడు మాత్రం అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. ముస్లిం మహిళల హక్కులకు సంబంధించిన ముఖ్యమైన బిల్లు ఆమోదం పొందకుండా కాంగ్రెస్ ఇతర పార్టీలతో కలిసి రాజకీయం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీంతో తీవ్ర గందరగోళం సభ పదిహేను నిమిషాల పాటు వాయిదా పడింది. ఈ సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యులతో డిప్యూటీ చైర్మన్ చర్చలు జరిపారు.

రాజ్యసభ రబ్బర్ స్టాంప్ కాదు


అనంతరం ప్రారంభమైన సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత ఆనంద్ శర్మ మాట్లాడుతూ, సమగ్రంగా పరిశీలించకుండా చట్టాలను చేయలేమని, లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన పెద్దల సభలో ఆమోదం పొందాలని లేదని, రాజ్యసభ రబ్బర్ స్టాంప్ కాదని అన్నారు. బిల్లును ఎవరూ వ్యతిరేకించటంలేదని, దీన్ని పరిశీలించేందుకు సెలెక్ట్ కమిటీకి పంపాలని యావత్ ప్రతిపక్షం డిమాండ్ చేస్తోందని అన్నారు. బిల్లుపై ప్రభుత్వం రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

ముచ్చటగా మూడోసారి





అల్లు అర్జున్ దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి సినిమా తెరకెక్కనుంది. 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రానికి ముహూర్తం నూతన సంవత్సరంలో నిర్ణయించారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్', 'గీతాఆర్ట్స్' సంయుక్తంగా నిర్మించబోతున్నాయి. హీరోగా అల్లు అర్జున్‌కు ఇది 19వ చిత్రం. జులాయిగా తిరిగేవాడు తన మైండ్‌గేమ్‌తో ఎలాంటి ఘనకార్యాలు చేశాడనేది త్రివిక్రమ్ మొదటి సినిమాలో చూపిస్తే, తండ్రి పేరు ప్రఖ్యాతులను కాపాడడం కోసం కొడుకుగా కథానాయకుడు ఏం చేశాడనే పాయింట్‌ను రెండో సినిమాలో చూపించాడు. ఇప్పుడు మూడో చిత్రంలో అంతకంటే మరింత ఆసక్తికరమైన అంశాన్ని ఎంచుకున్నాడని చిత్ర యూనిట్ చెబుతోంది. ఆ రెండు చిత్రాలకున్న పేరు దృష్ట్యా ఇటు సినీ వాణిజ్య రంగాలలోను, అటు ప్రేక్షక వర్గాలలోనూ అంచనాలు ఉన్నత స్థాయిలో నెలకొన్నాయి. వీటిని నిజం చేసే దిశగా సుప్రసిద్ధ చలన చిత్ర నిర్మాణ సంస్థలు కృషిచేస్తున్నట్లు చెబుతున్నారు. అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్ర పూర్వ నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే మరో ప్రకటనలో అధికారికంగా తెలియజేస్తామని నిర్మాతలు చెబుతున్నారు.



మహేష్ 'మహర్షి' లుక్



మహేష్ హీరోగా సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు వంశీ పైడిపల్లి దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పి.వి.పి సినిమా పతాకాలపై రూపొందుతోన్న భారీ చిత్రం 'మహర్షి'. మహేష్‌కు ఇది 25వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రాన్ని చాలా పెద్ద స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన సెకండ్‌లుక్‌ను నూతన సంవత్సర కానుకగా డిసెంబర్ 31 సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేశారు. ఈ చిత్ర షూటింగ్ భారీ ఎత్తున జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో షెడ్యూల్ పూర్తయింది. జనవరి రెండో వారం నుంచి మార్చి వరకు జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

సూపర్‌స్టార్ మహేష్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తోంది. అల్లరి నరేష్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. భారీ తారాగణం నటిస్తోన్న ఈ 'మహర్షి' చిత్రం హై టెక్నికల్ వేల్యూస్‌తో రూపొందుతోంది.

దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సూపర్ మూవీకి కె.యు.మోహనన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. హరి సాల్మన్, సునీల్‌బాబు, కె.ఎల్.ప్రవీణ్, రాజు సుందరం, శ్రీమణి, రామ్-లక్ష్మణ్ పనిచేస్తున్న ముఖ్య సాంకేతికవర్గం.

'అందరి సినిమాలు బాగా ఆడాలి'



'అందరూ బాగుండాలి. అందులో మనముండాలి' అన్నట్లు.. 'సంక్రాంతికి బాలయ్యబాబు, రజనీకాంత్, చరణ్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. వారికీ నా అభినందనలు. అందరి సినిమాలు బాగా ఆడాలి. తెలుగు ఇండస్ట్రీ బావుండాలి' అని వెంకటేష్ అన్నారు. వెంకటేష్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్స్‌గా దిల్‌రాజు నిర్మాణంలో రూపొందిన చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా ఈనెల 12న సినిమా విడుదలవుతుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన పాటలను వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. 'నా తొలి సినిమా కలియుగ పాండవులు నుండి చాలా సినిమాలు వైజాగ్‌లో చేశాం. వైజాగ్ ఉత్సవాల్లో మా సినిమా పాటలను విడుదల చేయడం ఆనందంగా ఉంది. దర్శకుడు అనిల్ నా గత చిత్రాలన్నింటినీ చూసి వాటిన్నంటి కంటే రెచ్చిపోయేలా ఈ సినిమాలో నటింపచేశాడు. ఈ సినిమాలకు పనిచేస్తున్న సమయంలో ఎంజాయ్ చేశాను. 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' సమయంలో మహేష్ ఓ సోదరుడిని చూసుకున్నాను. ఇప్పుడు



'ఎఫ్ 2' పాటల వేడుకలో దేవీశ్రీప్రసాద్ ఆలపిస్తున్న పాటకు నర్తిస్తున్న వెంకటేష్, వరుణ్‌తేజ్, దర్శకుడు అనిల్

వరుణ్‌తేజ్‌లో మరో సోదరుడిని చూసుకున్నాను' అని చెప్పారు.

దిల్‌రాజు మాట్లాడుతూ.. 2017 సంక్రాంతికి మూడు సినిమాలు విడుదలైనప్పుడు చాలా పెద్ద కాంపిటీషన్ అని ఫీలయ్యాం. 'గౌతమిపుత్ర శాతకర్ణి' క్లాసిక్‌లా నిలిచింది. మెగాస్టార్ 150వ సినిమా 'ఖైదీ నంబర్ 150' ఇండస్ట్రీ రికార్డ్ అయింది. 'శతమానం భవతి' మంచి సినిమా అయ్యి నేషనల్ అవార్డును సాధించింది. ఇప్పుడు మళ్లీ 2019లో మూడు సినిమాలు విడుదలవుతున్నాయి. ఈ మూడు పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. దర్శకుడు అనిల్ రావిపూడి కథ చెబుతున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. ప్రతి భార్యాభర్త మధ్య ఫన్ ఉంటుంది, ఫ్రస్టేషన్ ఉంటుంది. స్క్రిప్ట్ చెప్పినరోజునే మా బ్యానర్‌లో మరో సూపర్‌హిట్ సినిమా రాబోతుందని తెలుసు. దానికి తగ్గట్లు ఇద్దరు హీరోలు, మంచి హీరోయిన్స్, ఇతర టెక్నీషియన్స్ బాగా కుదిరారు. ఫ్యామిలీతో వచ్చే ఆడియెన్స్ రెండున్నర గంటల సేపు నవ్వుకుంటారు. అందుకనే సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు అనే మరో ట్యాగ్‌లైన్‌ను కూడా అనిల్ యాడ్ చేశాడు' అన్నారు.

దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. వెంకటేశ్‌గారు ఓ టైంమిషన్‌లో అబ్బాయిగారు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి టైంకు తీసుకెళ్లిపోతారు. అంత కామెడీ ఎనర్జీ సినిమాలో కనపడుతుంది. వరుణ్‌తేజ్ గురించి చెప్పాలంటే.. తను తొలిసారి కామెడీ జోనర్‌లో నటిస్తున్నాడు. దేవిశ్రీగారు అందించిన ఆరు సాంగ్స్ బావున్నాయని అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూస్తే మనలోని ఫ్రస్టేషన్ అంతా పోయి ఫన్‌తో ఇంటికెళతారని అన్నారు.

క్రికెట్ లుక్ వచ్చేసింది

నాని బ్యాట్ పట్టాడు. 'జెర్సీ' వేసుకుని సిక్స్‌లు బాదేందుకు గ్రౌండ్‌లోకి దిగాడు. 'మళ్లీ రావా' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నటిస్తున్న 'జెర్సీ' మూవీ ఫస్ట్‌లుక్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేశారు నాని. నూతన సంవత్సర కానుకగా ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. 90 దశకంలో జరిగిన ఓ క్రికెటర్ జీవిత కథాంశంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాని క్రికెటర్ అర్జున్‌గా కనిపించబోతున్నారు. '36 ఏళ్ల వయసులో క్రికెటర్‌గా అతడు నిరూపించుకోవాల్సింది ఏమీ లేదు. విజయాలతో పాటు వైఫల్యాలు వెనుక నిలబడ్డాయి. 1996-97లో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్‌పై అతడికి ఉన్న ప్రేమ బయట పెట్టింది' అంటూ ఆ క్రికెటర్ ఎవరన్నదానిపై సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తూ హింట్ ఇచ్చారు నాని.



ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ ఫస్ట్‌లుక్ టైటిల్‌కి 'ఇట్స్ నెవర్ టూ లేట్ టు డ్రీమ్' క్యాప్షన్ ద్వారా కలలు కనటంలో కూడా ఆలస్యం చేయకూడదనే మెసేజ్ మిళితం చేయబోతున్నాడు దర్శకుడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్య దేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమిళ రాక్ స్టార్ అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

'కుర్రాళ్ళకి అర్థమవుతుంది'



'4లెటర్స్'లో ఈశ్వర్, టువ చక్రవర్తి

నేటి యువతకు '4 లెటర్స్' అంటే ఈజీగా అర్థమవుతుందని ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ బ్యానర్ తెలియజేస్తుంది. '4 లెటర్స్' అనేది సినిమా టైటిల్. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణను పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. మా బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం. ఈశ్వర్ సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. ఇందుకోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. అలాగే 'కలుసుకోవాలని' రూపొందించిన దర్శకుడు రఘురాజ్ మా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కన్నడ, తమిళ చిత్రాల్లో బిజీగా మారిన ఆయన చాలా గ్యాప్ తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రమిది. అన్ని అంశాలతో కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా రూపొందించాం. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని అన్నారు.

దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ.. నేటితరం ప్రేమకథాచిత్రంగా తెరకెక్కించాను. ప్రేమ, పెళ్లి విషయాలలో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటన్నది వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించాం. చిత్ర కథ, కథనాలు, సంభాషణలు అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సాగటంతోపాటు ఆలోచన రేకెత్తించేలా ఉంటాయి. హీరో హీరోయిన్లు చక్కగా నటించారు. హైదరాబాద్‌లో టాకీ పార్ట్‌ను, బ్యాంకాక్‌లో పాటలను చిత్రీకరించాం' అన్నారు.

విద్యాబాలన్ పుట్టినరోజు జనవరి 1. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ బయోపిక్‌లో బసవతారకం పాత్ర స్టిల్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.



అమీర్ ఖాన్ కొత్త చిత్రం

బాలీవుడ్ స్టార్ అమీర్‌ఖాన్ హీరోగానే కాకుండా నిర్మాతగా తనదైన శైలిలో చిత్రాలని రూపొందిస్తారు. తాజాగా స్టార్‌ప్లస్‌తో కలిసి అమీర్ ఖాన్ ప్రొడక్షన్ బ్యానర్ పై ఆయన నిర్మించిన చిత్రం 'రూబరు రోషిణి'. ఈ చిత్రాన్ని 2019 గణతంత్ర దినోత్సవం సందర్భంగా టీవీ ప్రీమియర్ల ద్వారా ప్రదర్శించనున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఇదే తాను ప్రేక్షకుల కోసం చేసిన ప్లాన్ అని అమీర్ స్పష్టం చేశారు. ఇక అమీర్ నటించిన పిరియాడికల్ మూవీ 'థగ్స్ అఫ్ హిందుస్థాన్' గత నెల 8న విడుదలై నెగిటివ్ టాక్‌తో ఫ్లాప్ సినిమాల జాబితాలో చేరింది. కత్రినా కైఫ్, అమితాబ్ బచ్చన్, ఫాతిమా సన షేక్ వంటి స్టార్ కాస్ట్ కూడా ఈ సినిమాను కాపాడలేకపోయారు.



నూతన సంవత్సర వేడుకల్లో మహేష్

మహేష్ బాబు తాను దుబాయిలో నూతన సంవత్సర వేడుకల్లో



పాల్గొనబోతున్నట్టు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులకు తెలియజేశారు. 'చిల్లింగ్ ఎట్ మిక్స్ ది బాయ్స్' అంటూ ట్యాగ్‌లైన్‌తో దుబాయ్‌లో స్నేహితులతో కలిసి దిగిన ఫొటోని షేర్ చేశారు. ఈ న్యూ ఇయర్ పార్టీ దుబాయ్‌లోని ఎన్‌వైఈలో జరగనుంది. ప్రస్తుతం మహేష్ వంశీ పైడిపల్లి దర్శకత్వంలో 'మహర్షి' చిత్రంలో నటిస్తున్నారు. వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ మూవీలో మహేష్ సరసన పూజా హెగ్డే నటిస్తుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈచిత్రాన్ని దిల్ రాజు, అశ్వనీదత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఖమ్మంలో నూతన చిత్రం ప్రారంభం



సాయికృష్ణ, శిరీష

సాయికృష్ణ, శిరీష, విజయ్ ప్రధాన తారాగణంగా నటిస్తున్న చిత్రం సోమవారంనాడు ప్రారంభమైంది. అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్ పై తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఖమ్మంలోని శ్రీ కన్యాక పరమేశ్వరి దేవాలయంలో ముహూర్తపు షాట్ చిత్రించారు. నిర్మాత శ్రీనివాస్, శ్రీలక్ష్మి క్లాప్ ఇచ్చారు. తల్లాడ సురేష్, భరత్ కలిసి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం నిర్మాత మాట్లాడుతూ.. మా బ్యానర్‌లో 'ఎందరో మహానుభావులు' తరువాత చేస్తున్న చిత్రమిది. త్వరలో ఈ చిత్ర పేరుని, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తాం అని తెలిపారు. దర్శకుడు, హీరో సాయికృష్ణ మాట్లాడుతూ.. ఇదొక థ్రిల్లర్ జోనర్ సినిమా. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామని తెలిపారు. ఈ చిత్రానికి ఇద్దరు దర్శకులుగా వ్యవహరించనున్నారు. మరొక దర్శకుడు సయ్యద్ మాట్లాడుతూ.. కథ చిత్రానికి ప్రధాన బలమని తెలిపారు.

4న 'భగవాన్'

రాజీవ్, శతి జంటగా నటించిన చిత్రం 'భగవాన్'. ఆశిష్ విద్యార్థి ప్రధాన పాత్ర పోషించాడు. రాజు, సంగం సందీప్ నిర్మాతలు. చందు దర్శకునిగా పరిచయమవుతున్నాడు. మాస్ యాక్షన్‌తో కూడిన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. ఈనెల 4న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సందర్భంగా సీనియర్ నిర్మాత సాయి వెంకట్ మాట్లాడుతూ.. నిర్మాతలు సినిమా తీయటం మాత్రమే కాదు. విడుదల చేయటం కుడా గొప్ప విషయం అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ... ఇది మాస్ సినిమా అయినా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని అన్నారు. హీరో రాజీవ్ మాట్లాడుతూ... కథాబలమున్న చిత్రంలో నటించే అవకాశం వచ్చినందుకు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి కెమెరా: తిరుమల. సంగీతం: కరుణాకర్. రచయిత: కోడి ప్రసాద్. దర్శకత్వం: కె. చందు.



'భగవాన్'లో రాజీవ్



కాలప్రవాహంలో ఓ భాగమై జీవితం కళ్లముందే సాగిపోతోంది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి.. ప్రతి ఏటా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూనే ఉన్నాం. ఎప్పటికప్పుడు కొత్త ఆరోగ్య ప్రణాళికలూ రూపొందించుకుంటుంటాం.కొత్త సంవత్సరంలో ఆనందంగా.. ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో తెలుసుకుందాం!

సరికొత్త సంవత్సరంలో

ఆనందంగా.. ఆరోగ్యంగా...

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ చూసినా నేటి జీవనశైలి మనిషిని ఏదో ఒక అనారోగ్యంలోకి నెట్టేస్తోంది. కాగడా పట్టి వెతికినా పరిపూర్ణ ఆరోగ్యవంతులు కన్పించే పరిస్థితి లేదు. అడుగడుగునా ఆవరించిన కాలుష్యం, కల్తీ ఆహారం, వ్యసనాలు, వ్యాయామానికి దూరమైన జీవితం, ఒత్తిళ్లు ఆరోగ్యవంతుల్ని కూడా అనారోగ్యం అంచుల్లోకి నెట్టేస్తున్నాయి.

వ్యాయామంతో.. మెదడుకు ఉత్తేజం

మనిషిని నిత్యజీవన కార్యకలాపాల్లో, వివిధ జీవక్రియల్లో సక్రమంగా స్పందించేలా సూచనలిచ్చేది మెదడే. మెదడు పూర్తి ఆరోగ్యంగా ఉండి, సమర్థవంతంగా పనిచేస్తేనే ఆలోచనా శక్తి, విశ్లేషణా సామర్థ్యం పెరుగుతాయి. ఏకాగ్రత సమకూరుతుంది. మెదడు చురుగ్గా ఉండడానికి.. శారీరక శ్రమకు, వ్యాయామానికి సంబంధం ఉంది. రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయమం లేదా శారీరక శ్రమ చేసేవారి మెదడు పనితీరు చురుగ్గా ఉంటుంది. దీనివల్ల గుండె, ఊపిరితిత్తులు బాగా పనిచేసి.. శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుంది, శారీరకంగా ఫిట్‌గా ఉంటే మానసిక ఆరోగ్యం కూడా చేకూరుతుంది. శరీరంలో డిప్రెషన్, యాంగ్జయిటీ వంటి వాటికి కారణమయ్యే హార్మోన్ల ఉత్పత్తి తగ్గిపోయి.. మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. శరీరంలో ఏవైనా వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలుంటే.. అవి మెదడుపై, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా దీర్ఘకాలికంగా పట్టిపీడించే టైప్-2 మధుమేహం, ఊబకాయం, హైపర్ టెన్షన్ వంటివి మెదడు పనితీరును తీవ్రంగా దెబ్బతీస్తాయి. వాటివల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఆలోచించే శక్తి, విశ్లేషణా సామర్థ్యం కూడా తగ్గిపోతాయి. వీటికి తగిన చికిత్సలు తీసుకుంటూనే వ్యాయామాన్ని, శారీరక శ్రమనీ చేయాలి. వ్యాయామం వల్ల శరీరంలో అన్ని అవయవాలకూ తగిన ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. నిత్యజీవితంలో వ్యాయామాన్ని ఒక భాగంగా మార్చుకోవాలి. కనీసం అరగంట సమయానికి తగ్గకుండా అందుకోసం కేటాయించాలి.

పౌష్టికాహారం ముఖ్యం

శరీరం పనితీరు సక్రమంగా ఉండాలంటే సరైన పోషణ దానికి అందించాలి. అది పౌష్టికాహారంతోనే సాధ్యమవుతుంది. ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, చురుకుగా ఉండాలంటే తీసుకునే ఆహారంపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఆహారంలో కార్బొహైడ్రేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు అవసరమైన మేరకు ఉండేలా చూసుకోవాలి. ఇందులోనూ కార్బొహైడ్రేట్లు ఎక్కువగా, కొవ్వులు తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి, ప్రొటీన్లు మాత్రం అవసరమైన మేరకు తప్పనిసరిగా శరీరానికి అందాలి.

ఆహారంలో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండాలి. ముఖ్యంగా శాచురేటెడ్ ఫ్యాట్ వీలైనంత తక్కువగా ఉండాలి. శాచురేటెడ్ కొవ్వు అధికంగా ఉన్న ఆహారం తీసుకున్న వారిలో దీర్ఘకాలంలో ఆరోగ్యసమస్యలు వచ్చే ఆస్కారాలున్నాయి. ఆహారంలో అధిక కొవ్వుల కారణంగా మెదడులో జ్ఞాపకశక్తికి కేంద్ర స్థానమైన హిప్పో కాంపస్ భాగం పనితీరు దెబ్బతింటుంది. అయితే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు మాత్రం మెదడు మరింత చురుగ్గా పనిచేసేందుకు తోడ్పాటునందిస్తాయి. ముఖ్యంగా గర్భస్థ శిశువులలో మెదడు ఎదుగుదలకు ఇవి ఉపయోగపడతాయి. పౌష్టికాహారాన్ని కూడా ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా కొంచెం కొంచెం పరిమాణంలో తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట లభించే ఆహారాలజోలికి వెళ్లకూడదు. అందులోనూ జంక్‌ఫుడ్‌కి, ఫాస్ట్‌ఫుడ్స్‌కీ దూరంగా ఉండాలి. వాటి తయారీకి ఉపయోగించే కల్తీ నూనెలు, రసాయనాలు శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఏ ఆహారాన్ని తీసుకోవాలో, ఎలాంటి పదార్థాలకు దూరంగా ఉండాలో తప్పనిసరిగా వైద్యుల, న్యూట్రిషనిస్టుల సూచనలను పాటించాలి.

తగినంత నిద్ర, విశ్రాంతి

మనసూ, శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత నిద్ర, విశ్రాంతి అవసరం. నిద్ర కూడా కలత నిద్ర, మగతగా నిద్ర వంటివి కాకుండా పూర్తిస్థాయి గాఢ నిద్ర ఉండాలి. మొత్తంగా రోజుకు కనీసం ఆరు గంటల నుంచి ఎనిమది గంటల నిద్ర అవసరం. పని మధ్యలోనైనా అప్పుడప్పుడు పది పదిహేను నిమిషాలు విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాలి. మెలకువతో ఉన్నప్పుడు మనం చూస్తున్న, వింటున్న, అనుభూతి చెందుతున్న ప్రతి జ్ఞాపకం మెదడులో చేరుతుంది. వాటిని మెదడు ప్రాసెస్ చేస్తూ.. తదనుగుణంగా శరీర అవయవాలకు ఆదేశాలు జారీ చేస్తుంది.

ఈ క్రమంలో మెదడులో కొన్ని ప్రొటీన్లు ఉత్పత్తి అవుతుంటాయి. ఎక్కువసేపు నిద్రపోకుండా ఉంటే ఆ ప్రొటీన్లు అలాగే మెదడులో పేరుకు పోతుంటాయి. వాటివల్ల ఏకాగ్రత తగ్గుతుంది. సవ్యంగా ఆలోచించలేకపోవడం, కొత్త విషయాలపట్ల ఆసక్తి లోపించడం వంటి లక్షణాలుంటాయి. అదే తగినంత నిద్రవల్ల మెదడుకు విశ్రాంతి లభిస్తుంది. తిరిగి మనం నిద్ర లేచిన తర్వాత పూర్తి శక్తితో చురుగ్గా పనిచేస్తుంది. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలుచేస్తుంది. తగినంత నిద్ర లేకపోతే దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.

వ్యసనాలుంటే మానేయాలి

సరదాగా మొదలయ్యే అలవాట్లు క్రమేపీ వ్యసనాలై విదిలించుకోలేని సంకెళ్లుగా మారుతుంటాయి. మద్యపానం, పొగతాగడం, గుట్కా, పాన్‌మసాలా, పొగాకు నమలడం వంటివన్నీ శారీరక, మానసిక ఆరోగ్యాలను కోలుకోలేనంతగా దెబ్బతీస్తుంటాయి. వీటిని మానుకోకపోతే ఆరోగ్యానికి ముప్పు తప్పదు. వీటి వల్ల వచ్చే క్యాన్సర్లు, కాలేయ వ్యాధులు, నేత్ర వ్యాధులు, హృద్రోగాలతో నిత్యం ఎంతోమంది చనిపోతున్నారు. ఈ విషయంపై ఎంత ప్రచారం జరుగుతున్నా ఇవన్నీ విచ్చలవిడిగా ఎక్కడిక్కడే లభిస్తుండడంతో వ్యసనపరులు పెరుగుతున్నారేగానీ ఏమాత్రం తగ్గడం లేదు. వ్యసనాలను మానకోవడానికి కౌన్సిలింగ్ కేంద్రాలు, వివిధ రకాల మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే మనో నిశ్చయంతోనే వాటిని దూరంగా ఉంచడానికి వీలవుతుంది. ఇప్పటివరకూ వివిధ రకాల వ్యసనాల వల్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నవారు తమ పొరపాటు గ్రహించి ఈ కొత్త సంవత్సరంలో వ్యసనాలను వదులుకోవాలని నిర్ణయాన్ని తీసుకొని ఈరోజు నుంచే దానిని ఆచరించాలి.

కాలుష్యానికి దూరంగా

మానవాళి ఆరోగ్యాన్ని కబళిస్తున్న వాటిలో కాలుష్యం కీలకమైనదిగా మారింది. వంటగది నుంచి వాహనాల పొగ దాకా వాయు కాలుష్యం విస్తరించింది. గుండెవ్యాధుల వల్ల సంభవించే మరణాల్లో 75 శాతం, ఊపిరితిత్తుల వ్యాధుల వల్ల మరణాల్లో 25 శాతం కేవలం వాయు కాలుష్యం కారణంగానే జరుగుతున్నాయి. అంతేకాదు కాలుష్యం వల్ల వంధ్యత్వం, ఎముకలు గుల్లబారిపోవడం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలూ తలెత్తుతున్నాయి. వాయు కాలుష్యం పొగ గొట్టాల నుంచి, శిలాజ ఇంధనాల దహనం నుంచి, వాహనాలు తదితర వాటి నుంచి ఎక్కువగా వెలువడుతోంది. వీటివల్ల అతి ప్రమాదకరమైన గోధుమరంగు పొగ మంచు (బ్రౌన్ హెజ్) వాతావరణంలో ఏర్పడి ఆరోగ్యాలను దెబ్బతీస్తోంది. శిలాజ ఇంధనాలు అంటే పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి వాటిని మండించినప్పుడు అతి సూక్ష్మమైన కణాలు (అల్ట్రా ఫైన్ పార్టికల్స్) వెలువడతాయి. వీటి నుంచే కాకుండా గ్యాస్ ఆధారిత వాహనాల నుంచి వచ్చే పొగ, గడ్డిని. టైర్లని, ప్లాస్టిక్‌ని కట్టెలను కాల్చడం, ఎండిపోయిన ఆకులను కాల్చడం, ధూమపానం ద్వారా కూడా అల్ట్రాఫైన్ పార్టికల్స్ గాలిలో కలుస్తున్నాయి. ఇవి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనవి. గాలిలో చేరే అతి సూక్ష్మ రసాయన కణాలు, దుమ్ము, ధూళి కణాలు కూడా కాలుష్యాన్ని కలిగిస్తుంటాయి. ఇవి సంతాన సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. ఈ కాలుష్యం వల్ల ఎముకల కణాల్లో సాంద్రత తగ్గి, గుల్లబారిపోయే ఆస్టియో పోరోసిస్ వ్యాధి వస్తుంది. సమస్య. దీనివల్ల ఎముకల్లో పటుత్వం తగ్గిపోయి, చిన్న దెబ్బ తగిలినా విరుగుతాయి. గాలి కాలుష్యానికి గురైనప్పుడు శరీరంలో పారా థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది ఆస్టియో పోరోసిస్‌కు దారి తీస్తుంది. దీనివల్ల పక్షవాతం ముప్పు కూడా పొంచి ఉంది. విపరీతంగా గాలి కాలుష్యానికి లోనవుతున్న వారిలో మూత్రపిండ (కిడ్నీ) సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. గాలిలోని కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలోకి చేరుతున్నాయి. ఆ కలుషితాలను తొలగించే క్రమంలో కిడ్నీలు దెబ్బతింటున్నాయి. వాయు కాలుష్యంతో అధిక రక్తపోటు సమస్య కూడా తలెత్తుతోంది.


కలుషిత గాలిలో ఉండే హానికరమైన, విషపూరిత రసాయనాలు గర్భస్థ శిశువుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. దీనివల్ల గర్భంలో పిండం ఎదుగుదల దెబ్బతిని, నెలలు నిండక ముందే కాన్పు జరుగుతుంది. కలుషితమైన గాలి కారణంగా వచ్చే శ్వాస సమస్యలు, చర్మ సమస్యలు వంటివి కూడా మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. నీటి కాలుష్యం, శబ్దకాలుష్యం వంటివి కూడా శారీరక, మానసిక ఆరోగ్యంపై చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వీటన్నింటికీ వీలైనంత దూరంలో ఉండగలిగితేనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు. ఈ కొత్త ఏడాదిలో ఈ విషయంపై ప్రధానంగా దృష్టి సారించాలి.



సొంతవైద్యంతో ఆరోగ్యానికి చేటు

ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే చాలామంది సామాజిక మాధ్యమాల్లోనూ, యూట్యూబ్, ఇంటర్నెట్, మీడియా వంటివాటిలో చూసి సొంత వైద్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది భవిష్యత్‌లో ప్రమాదాలకు దారితీస్తుంది. వ్యాధి నిర్ధారణ చేయకుండా మందులు వాడడం వల్ల దుష్ఫలితాలు అనేకం ఎదురవుతాయి. ఆరోగ్య సమస్యలు లేకపోయినా కొంతమంది మార్కెట్లో లభించే ఒమేగా-3 సప్లిమెంట్లు, మల్టీవిటమిన్ ట్యాబ్లెట్ల వంటి వాటిని ఎక్కువగా కొనివాడుతున్నారు. ఇలాంటి వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఏమీ ఉండదని పలు పరిశోధనల్లో వెల్లడైంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఏవైనా వ్యాధులు వచ్చినప్పుడు డాక్టర్లు సిఫారసు చేస్తే మాత్రమే అటువంటి సప్లిమెంట్లను వినియోగించాలి. లేకపోతే ఆ సప్లిమెంట్లతో ఎలాంటి ఫలితం లేకపోగా ఎన్నో దుష్ఫలితాలు (సైడ్ ఎఫెక్టులు) తలెత్తుతాయి. ఏ రకమైన ప్రొటీన్లు, విటమిన్లు అయినా సహజ ఆహారం రూపంలో శరీరం సంగ్రహిస్తేనే ప్రభావవంతంగా పనిచేస్తాయి. వీటిని అడ్డగోలుగా వాడడం వల్ల అధిక రక్తపోటు, జీర్ణాశయ సమస్యలు, లైంగిక పటుత్వం కోల్పోవడం, డిప్రెషన్ వంటి సమస్యలు వస్తాయి. ఈ కొత్త సంవత్సరం సందర్భంగా సొంత వైద్యాన్ని మాని, ఏ ఆరోగ్య సమస్య తలెత్తినా డాక్టర్‌ని సంప్రదించాలనే విషయానికి ప్రాధాన్యత ఇద్దాం.





డాక్టర్ కె. దుర్గా నాగరాజు
డిఎన్‌బి, ఎంఆర్‌సిఎస్, ఎంసిహెచ్,
అను హాస్పటల్,
పుష్పా హోటల్ సెంటర్,
సూర్యారావు పేట, విజయవాడ



చిన్నారి

పొడుపు కథ

నామముంది కానీ పూజారిని కాను
వాలముంది కానీ
కోతిని కాను
ఎవరిని నేను?




జవాబు : ఉడుత

జోక్:

తల్లి : ఎదురుషాపు నుంచి దారపు రీలు తెమ్మంటే ఇంతసేపా చింటూ?

చింటు : దారపు రీలుపై 300 మీటర్లని రాసి ఉంది. ఏమైనా మోసం ఉంటుందేమోనని దారమంతా కొలిచి తెచ్చేసరికి ఇంతసేపు పట్టింది మరి!

Happy New Year చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, బొమ్మ ఏమిటో కనిపెట్టండి!

శుభాకాంక్షలు



నూ-నూతన వత్సరానికి
స్వాగతం పలుకుదాం
త-తరాల అంతరాలు
తక్షణమే తరిమేద్దాం
న-నవ సమాజానికై నడుం
బిగించి, పోరాడుదాం!
సం-సంపూర్ణ మనసుతో
ముందడుగు వేద్దాం!
వ-వడివడిగా ప్రగతి
పథంలో పయనిద్దాం
త్స- త్సవంగా ఉజ్జీవం
మెండుగా నింపుదాం
ర- రయముగా పాత
వత్సరానికి వీడ్కోలు చెప్పదాం!
ము- ముద్దుగా నూతన
సంవత్సరంలో
అడుగుపెడుదాం!



- లావణ్య,
5వ,తరగతి,
ప్రాథమిక పాఠశాల
మెయిన్,
హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా

దారి చూపండి!



పిల్లలూ!
పక్కనున్న
చిత్రంలోని
కుందేలు
గుడ్లను చేరే
దారి చూపండి.!

నేను గీసిన బొమ్మ



పి. నేహా
9వ తరగతి,
జిల్లా పరిషత్
హైస్కూల్,
కాణిపాకం,
చిత్తూరు.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com

భారత మహిళా క్రికెటర్ల ఘనత





- స్మృతి మంధానకు రెండు ఐసిసి అవార్డులు
- ఐసిసి టీ20 కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్

దుబాయ్: ఈ ఏడాదికిగాను భారత మహిళా జట్టు క్రికెటర్ స్మృతి మంధాన రెండు ఐసిసి అవార్డులను సొంతం చేసుకుంది. వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్, వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులను మంధాన సొంతం చేసుకుంది. 2018 ఏడాది అద్భుతంగా రాణించిన మంధాన ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసిసి అవార్డులను దక్కించుకున్న తొలి భారత మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును నెలకొల్పారు. 2018 లో ప్రధానంగా వెస్టిండీస్‌లో జరిగిన మహిళా వరల్డ్ టీ20ల్లో భారత్ సెమీ ఫైనల్ చేరడంలో మంధాన కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నీలో 125పైగా స్ట్రైక్‌రేట్‌తో 178 పరుగులు సాధించారు.ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మంధాన మొత్తంగా 1291 పరుగులు చేశారు. 12 వన్డేలకు గాను 669 పరుగులు సాధించిన మంధాన.. 25 టీ20ల్లో 622 పరుగులు చేశారు. ఈ ఏడాది వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఐదు హాఫ్ సెంచరీలు సాధించడం మరో విశేషం. కాగా, ఐసిసి ప్రకటించిన అత్యుత్తమ వన్డే, టీ20 జట్లలో కూడా మంధాన చోటు దక్కించుకున్నారు.

అలాగే, అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) టీ20 కెప్టెన్‌గా భారత మహిళా క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ ఎంపికయ్యారు. ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసిసి ప్రకటించగా, అందులో టీ 20 జట్టుకు హర్మన్ ప్రీత్ కెప్టెన్‌గా నియమించబడ్డారు. ఈ మేరకు సోమవారం అత్యుత్తమ మహిళా వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటించింది. టీ 20 ఫార్మాట్‌లో భారత్ నుంచి హర్మన్‌తో పాటు స్మ తీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు చోటు దక్కింది. ఇక వన్డే విభాగంలో భారత్ నుంచి స్మ తీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే స్థానం దక్కగా, కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ నియమించబడ్డారు. నవంబర్‌లో జరిగిన ఐసిసి మహిళల వరల్డ్ టీ20లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరడంలో హర్మన్ ప్రీత్ కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నమెంట్‌లో కౌర్ 160.5 స్ట్రైక్‌రేట్‌తో 183 పరుగులు చేశారు. 2018లో హర్మన్ ప్రీత్ 25 టీ20 మ్యాచ్‌లుఆడి 126.1 స్ట్రైక్‌రేట్‌తో 663 పరుగులు సాధించారు. మరొకవైపు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు.

ఐసిసి మహిళా టీ20 జట్టు:
హర్మన్ ప్రీత్ కౌర్(కెప్టెన్, భారత్), స్మ తీ మంధాన(భారత్), అలైస్సా హేలీ(ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్(న్యూజిలాండ్), నాటేటీ స్కివర్(ఇంగ్లండ్), ఎలైసె పెర్రీ(ఆస్ట్రేలియా), అష్లే గార్డనర్(ఆస్ట్రేలియా), కాస్పెర్క్(న?్యరీజిలాండ్), మెగాన్ స్కట్(ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్(బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్(భారత్)

ఐసిసి వన్డే జట్టు:
సుజీ బేట్స్(కెప్టెన్, న్యూజిలాండ్), స్మ తీ మంధాన, టామీ బీమౌంట్(ఇంగ్లండ్), డేన్‌వాన్ నీకెర్క్(దక్షిణాఫ్రికా), సోఫీ డివైన్(న్యూజిలాండ్), అలైస్సా హేలీ(వికెట్ కీపర్, ఆస్ట్రేలియా), మారింజన్నే కాప్(దక్షిణాఫ్రికా), డాటిన్(వెస్టిండీస్), సానా మిర్(పాకిస్తాన్), సోఫీ ఎక్లెస్టోన్(ఇంగ్లండ్), పూనమ్ యాదవ్(భారత్)

తండ్రయిన రోహిత్

సిడ్నీ టెస్టుకు దూరం

న్యూఢిల్లీ : భారత ప్రముఖ క్రికెటర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ తండ్రయ్యారు. రోహిత్ సతీమణి రితికా సజ్దే పండంటి పాపకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని రితిక బంధువు సీమాఖాన్(నిర్మాత సొహైల్ ఖాన్ భార్య) సామాజిక మీడియా ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ ఆడుతున్న రోహిత్ శర్మ తన బుజ్జి పాపాయిని, భార్యను చూసేందుకు భారత్‌కు తిరుగుపయనమయ్యారు. దీంతో జనవరి 3 నుంచి సిడ్నీలో జరగనున్న నాలుగో, ఆఖరి టెస్టుకు దూరంగా కానున్నాడు. ఈ విషయాన్ని బిసిసిఐ కూడా వెల్లడించింది. 'ఆస్ట్రేలియా నుంచి భారత్‌కి రోహిత్ శర్మ త్వరలో వెళ్లనున్నాడు. అతని భార్య రితిక ఆదివారం ఓ పండంటి ఆడబిడ్డకి జన్మనిచ్చింది. దీంతో.. పాపని చూసేందుకు రోహిత్ శర్మ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

తడబడిన ఆంధ్ర

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సొంత మైదానాన్ని వినియోగించుకోవటంలో ఆంధ్ర బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. 187 పరుగులకే ఆరు వికెట్లు చేజార్చుకున్నారు. క్రికెట్ ప్రకాశం ఆధ్వర్యంలో ఒంగోలు సిఎస్ఆర్ శర్మ కళాశాల క్రీడామైదానంలో కూచ్ బిహర్ అండర్-19 కూచ్ బిహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, సౌరాష్ట్ర జట్ల మధ్య 4 రోజుల మ్యాచ్ సోమవారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్‌కు దిగింది. 90 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. ఆ జట్టులో సుబ్రహ్మణ్యం 77(235 బంతుల్లో; 9 ఫోర్లు) పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇతనికి వై.సందీప్ 53(147 బంతుల్లో; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగులతో సహకారమందించాడు. మరోవైపు సౌరాష్ట్ర బౌలర్లలో రాహుల్ వాన్‌రాణి 46 పరుగులిచ్చి 3 వికెట్లు, యువరాజ్ సిహ్నోల్ 41 పరుగులిచ్చి 2 వికెట్లు, దేవ్‌దాన్ ఓ వికెట్‌ను పడగొట్టారు. ఈ మ్యాచ్‌ను క్రికెట్ ప్రకాశం అధ్యక్షులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, కోశాధికారి కె.అప్పాజి పర్యవేక్షించారు.

ఫైనల్‌కు బెంగుళూరు

ప్రో కబడ్డీ లీగ్

కొచ్చి : 2018 ప్రో కబడ్డీ లీగ్ ఫైనల్‌కు బెంగుళూరు బుల్స్ చేరుకుంది. సోమవారం జరిగిన క్వాలిఫయిర్ 1 మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యున్స్ జైంట్స్‌పై బెంగళూరు 29-41 పాయింట్లతో ఘన విజయం సాధించింది. జనవరి 5న జరిగే తుదిపోరుకు చేరుకుంది. కాగా, గుజరాత్‌కు మరో అవకాశం ఉంది. సోమవారం జరిగిన ఎలిమినేటర్ 3 మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీపై యుపి యోధ 33-45 పాయింట్లతో విజయం సాధించింది. దీంతో జనవరి 3న జరిగే క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లో గుజరాత్‌తో యుపి యోధ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది.



భారత్ నెంబర్ 1

టీమిండియాపై ఆసీస్ దిగ్గజాల ప్రశంసలు

మెల్‌బోర్న్: ఆసీస్ పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్‌లో ముగిసిన మూడు టెస్టులో ఘనవిజయం సాధించడంతో భారత క్రికెట్ జట్టుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆస్ట్రేలియా క్రికెట్ ప్రముఖులు కూడా భారత్‌ను ప్రశంసించడం విశేషం. 'టీమిండియా జట్టు పరిస్థితి ఇప్పుడు బాగుంది. ఇప్పుడు వారిది నం.1 జట్టు. వారి ఆట చూడటానికి ముచ్చటగా ఉంది. విజయ కాంక్ష పెరుగుతోంది. విదేశాల్లో ఒకప్పుడు టీమిండియా ఎదుర్కొన్న ఇబ్బందుల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. వారి జట్టులో పురోగతి మొదలైంది. ఎందుకంటే వారి జట్టులో ఫాస్ట్ బౌలింగ్ పరిస్థితి ఎంతో బావుంది. ఇక టీమిండియా ఆటగాళ్లు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లపై సులభంగా పోరాటం చేయగలరు. ఒకప్పుడు ఈ దేశ జట్లతో ఆడటానికి టీమిండియా కాస్త ఇబ్బందులు ఎదుర్కొనేది. ఇప్పుడు అదే జట్లపై ఆధిపత్యం చెలాయించే స్థితికి చేరుకుంటోంది' అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్ ప్రశంసించారు. టీమిండియా ప్రస్తుతం విదేశాల్లో నిలకడగా రాణిస్తోందని అభిప్రాయపడ్డారు. బాక్సింగ్ డే టెస్టు తర్వాత ఆయనపై వ్యాఖ్యలు చేశారు. అలాగే బౌలింగ్ గురించి మాట్లాడుతూ 'టీమిండియా జట్టులో అద్భుతమైన బౌలర్లున్నారు. స్పిన్ బౌలింగ్‌లో ఇప్పటి టీమిండియా ఆటగాళ్ల ప్రదర్శన ఎంతో బాగుంది. బ్యాటింగ్, బౌలింగ్ ఇలా అన్ని విభాగాల్లోనూ భారత జట్టు స్థిరంగా రాణిస్తోంది' అంటూ కితాబిచ్చారు.

తేడా.. కోహ్లీ, పుజారా : లాంగర్

ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య ప్రధాన తేడా విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారా అని ఆస్ట్రేలియా జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. తమ బ్యాటింగ్ లైనప్‌లో ప్రపంచ స్థాయి బ్యాట్స్‌మెన్ లేకపోవడం ఇబ్బందికరంగా మారిందన్నాడు. 'నిజం చెప్పాలంటే ఈ దశలో సిరీస్‌లో ప్రధాన తేడా పుజారా, కోహ్లీ. తొలి ఇన్నింగ్స్‌లో పుజారా సగటు 53, కోహ్లీ సగటు 46. రెండో ఇన్నింగ్స్‌లో పరుగులేమీ చేయలేదు. దీన్నుంచి మేం నేర్చుకున్న పాఠం వారు ఒత్తిడిని అధిగమించారు. బ్యాటింగ్ ఒక కళ! ఇందులో ఒత్తిడిని ఆస్వాదించడం కీలకం. టెస్టు క్రికెట్‌లో చాలా సమయం ఉంటుంది. ప్రస్తుత టీ20 యుగంలో అన్నీ త్వరగా, వెంటనే కావాలి. పైగా స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడుతున్నారు. మా కుర్రాళ్లు ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నారు. అలా జరక్కపోతే ఇలాంటి ఓటములే ఎదురవుతాయి' అని లాంగర్ అన్నాడు. అలాగే 'మెల్‌బోర్న్ టెస్టు చాలా కఠినంగా సాగింది. మేం పూర్తిగా అలసిపోయాం. నాలుగో టెస్టు ముందు విశ్రాంతి అవసరం. ఫించ్‌లో నిలకడ లోపించింది. మిడిలార్డర్ సైతం ఇదే సమస్యతో సతమతం అవుతోంది. ఈ సిరీస్ గెలవకుండా కనీసం సమం చేసుకుంటే మాకు బాగుంటుంది' అని లాంగర్ పేర్కొన్నాడు.

డేవిస్‌కప్‌కు భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : ఇటలీతో జరిగే డేవిస్‌కప్‌కు భారత జట్టును అఖిల భారత టెన్నిస్ సమాఖ్య (ఎఐటిఎ) సోమవారం ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి కోల్‌కతాలో జరిగే డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫైయిర్ మ్యాచులు జరగనున్న విషయం తెలిసిందే. అలాగే సోమవారం ఫెడ్ కప్‌కు కూడా భారత జట్టును ఎఐటిఎ ప్రకటించింది. ఫిబ్రవరిలోనే ఖజకస్తాన్‌లో ఫెడ్ కప్ ఆసియా-ఒసియానా గ్రూప్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

డేవిస్‌కప్‌కు భారత జట్టు : ప్రజ్నేష్ గున్నెస్వరణ్, రామ్‌కుమార్ రామనాథన్, దివిజ్ శరణ్, రోహన్ బోపన్న, సాకేత్ మైనేని, శశి కుమార్ ముకుంద్

ఫెడ్ కప్‌కు భారత జట్టు : అంకిత్ రైనా, కర్మాన్ థండి, ప్రాంజల యడ్లపల్లి, ప్రార్థనా తంబరే, రుజుత భోషలే

కోహ్లీ... టాప్ ర్యాంక్‌తో కొత్త ఏడాదిలోకి..

దుబాయ్: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ 2018 ఏడాదిని ఘనంగా ముగించాడు. మైదానంలో పరుగుల వరద పారించాడు. శతకాల జోరు కొనసాగించాడు. దీంతో తాజాగా ఐసీసీ ప్రకటించిన టెస్టు బ్యాటింగ్ ర్యాంకుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అత్యుత్తమ ర్యాంకుతో ఏడాది 2018ను ముగించాడు. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 82 పరుగులు చేసినా అతడి ఖాతాలో మూడు రేటింగ్ పాయింట్లు తగ్గాయి. అయినప్పటికీ రెండో ర్యాంకులోని కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్) కన్నా 34 రేటింగ్ పాయింట్లు ఎక్కువగానే ఉండటం గమనార్హం. 135 రోజులుగా విరాట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగడం విశేషం. ఈ ఏడాది అతడు 1322 పరుగులు సాధించాడు. ఇక టీమిండియా నయావాల్ ఛతేశ్వర్ పుజారా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ 10 స్థానాలు మెరుగై 38వ ర్యాంకులో ఉన్నాడు. మెల్‌బోర్న్‌లో అరంగేట్రం చేసిన మయాంక్ అగర్వాల్ 76, 42 పరుగులతో నిలిచి 67వ ర్యాంకుతో జాబితాలో ప్రవేశించాడు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68